హైదరాబాద్
ఆదివారం
11-3-2018
సంపుటి: 2, సంచిక: 101
పేజీలు: 12+16, వెల: రూ.6
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



సంక్షోభంలో వైద్య విద్యా పాలన

- ఇన్‌చార్జి డీఎంఈగా జూనియర్
- కోర్టును ఆశ్రయించిన సీనియర్లు
- సీనియర్‌ను నియమించాలి
- సర్కారుకు కోర్టు ఆదేశాలు
- డెంటల్ కాలేజి ప్రిన్సిపాల్‌గా సర్జన్
- బీడీఎస్ సీట్లు చేజారే ప్రమాదం

2లో..





'మిలియన్' ఆంక్షలు

'స్ఫూర్తి' సభపై ఉక్కుపాదం.. అడుగడుగునా నిర్బంధాలు, అరెస్టులు

- పోలీసు పహారాలో ట్యాంక్‌బండ్
- అష్టదిగ్బంధంలో ఉస్మానియా వర్సిటీ
- ఎక్కడికక్కడే అదుపులోకి నేతలు, కార్యకర్తలు
- జేఏసీ చైర్మన్ కోదండరామ్ గృహ నిర్బంధం
- అనంతరం అరెస్టు.. ఠాణాకు తరలింపు
- మార్గమధ్యంలోనే చాడ, విమలక్క అరెస్టు
- సర్కారు మూల్యం చెల్లించుకోక తప్పదు
- నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు:కోదండరాం



హైదరాబాద్, మార్చి 10 (మనం ప్రతినిధి):

టీజేఏసీ, సీపీఐ, ప్రజా సంఘాలు సంయుక్తంగా నిర్వహించ తలపెట్టిన 'మిలియన్ మార్చ్ స్ఫూర్తి' సభపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. శుక్రవారం సాయంత్రం నుంచే రంగంలోకి దిగిన పోలీసులు నగరానికి వచ్చే వాహనాలతోపాటు, నగరంలోని వాహనాలను జల్లెడపట్టారు. ట్యాంక్‌బండ్ చుట్టూ భారీగా మిగతా 6లో..



బూచోడు కాదు.. మంచోడే

స్మార్ట్ ఫోన్ వ్యసనం కానే కాదు

- మాటలకు అదో మంచి సాధనం
- సంభాషణ కాస్త తగ్గినా బేఫికర్
- చాటింగ్‌తో సంబంధాలు మెరుగు
- యువత.. విద్యార్థుల్లో నయాట్రెండ్
- స్నేహితులు.. బంధువుల గ్రూపులు
- వాట్సాప్‌లో వారందరితో చాటింగ్
- ఇది కూడా మంచిదే: శాస్త్రవేత్తలు

''బూచాడమ్మా బూచాడు.. బుల్లిపెట్టెలో ఉన్నాడు.. కళ్లకెపుడు కనపడడు, కబురులెన్నో చెబుతాడు'' అని ఫోన్ గురించి చెప్పేవారు. కానీ ఇప్పుడు చిన్న పెద్దా ఎవరిని చూసినా చేతిలో స్మార్ట్ ఫోన్లు పట్టుకునే కనిపిస్తున్నారు. వాళ్ల వేళ్లు చకచకా కీప్యాడ్ మీద కదులుతుంటాయి. ఏం చేస్తున్నారో కూడా ఎవరికీ తెలియదు. ఎందుకురా అస్తమానూ ఆ ఫోన్ పట్టుకుని వేలాడతావు అని పెద్దవాళ్లు తిడతారు. కానీ వాళ్లేం చేస్తున్నారో తెలిస్తే మాత్రం మీరలా తిట్టరు. పైపెచ్చు పొగుడుతారు కూడా..!

మనం సండే స్పెషల్

6లో..



సింగరేణి కార్మికులకు తీపికబురు

కారుణ్య నియామకాలకు ఓకే

ఉత్తర్వులు జారీ చేసిన యాజమాన్యం

హైదరాబాద్, మార్చి 10 (మనం ప్రతినిధి):

సింగరేణి కార్మికులకు తీపికబురు. సింగరేణి కాలరీస్ కంపెనీలో కారుణ్య నియామకాలకు యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణిలో మిగతా 6లో..



కోదండకు కోమటిరెడ్డి 'సపోర్టు'? ట



- నిధులందించనున్న సోదరద్వయం!
- అవసరం కొద్దీ అంగీకరించిన టీజేఏసీ నేత
- అభ్యర్థులను రెడీ చేస్తున్న రెడ్డి సోదరులు
- వ్యూహంలో భాగంగానే కాంగ్రెస్‌తో పొత్తు
- టీఆర్ఎస్ ప్లీనరీ తర్వాత స్పష్టత వచ్చే చాన్స్
- గులాబి పార్టీలోని అసంతృప్తులకూ గాలం
- ఎండవేడికి పోటాపోటీగా రాజకీయ గర్మీ

(హైదరాబాద్ - మనం ప్రతినిధి)

ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు మూడో ఫ్రంట్ ప్రకటనతో ఊపందుకున్న రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు చోటు చేసుకుంటున్నాయి. పార్టీలు, నేతల సరికొత్త వ్యూహాలు, ఎత్తులు, ఎత్తుగడల వల్ల ఎండవేడితో పాటు రాజకీయాల్లోనూ గర్మీ పెరుగుతోంది. కొత్త రాజకీయ సమీకరణాలు చోటు చేసుకుంటున్నాయి. రాజకీయ యవనికపై సరికొత్త సీన్లు ఆవిష్కృతమవుతున్నాయి. మీడియాలోను, సోషల్ మీడియాలోనూ వైరల్ అవుతూ మిగతా 6లో..





థర్డ్ కాదు.. ఫస్ట్ ఫ్రంట్

భారత్ రెండు పార్టీల వ్యవస్థకాదు

- రెండు పార్టీల పోరాటమూ కాదు
- బహుళ పార్టీలు ఉన్న దేశమిది..
- కాంగ్రెస్, బీజేపీకి మెజారిటీ రాదు
- ప్రాంతీయ పార్టీలపై ఆధారపడాల్సిందే
- అధికారాలన్నీ కేంద్రీకృతమవుతున్నాయి
- ఉపాది డబ్బులు ఢిల్లీలో వేయాలా?
- అందుకే థర్డ్ ఫ్రంట్‌కు కేసీఆర్ పునాది
- కేంద్రం నుంచి రాష్ట్రానికి పైసా రాలేదు
- ఒక్క విభజన హామీ నెరవేరలేదు
- రాష్ట్రాలను పట్టించుకోవట్లేదు
- ఏపీకీ ఇదే పరిస్థితి ఎదురైనట్లుంది
- కేంద్రం నుంచి తప్పకుంది: కేటీఆర్
- అభివృద్ధిలో తెలంగాణ దూసుకెళ్తోంది
- స్కోచ్ సదస్సులో మంత్రి ప్రసంగం

6లో..



దంత వైద్యులకు బంపర్ చాన్స్

బీడీఎస్ పట్టభద్రులకు మూడేళ్ల బ్రిడ్జికోర్సు

- దాంతో ఎంబీబీఎస్ వైద్యులుగా చేసే చాన్స్
- కేంద్ర ప్రభుత్వానికి డెంటల్ కౌన్సిల్ విజ్ఞప్తి
- అమలైతే బీడీఎస్ వారికి సువర్ణావకాశం

భువనేశ్వర్, మార్చి 10:

బీడీఎస్ (దంత వైద్యవిద్య కోర్సు) పూర్తిచేసిన వారికి మూడేళ్ల ఎంబీబీఎస్ బ్రిడ్జి కోర్సు ప్రవేశపెట్టాలని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ కోర్సు ద్వారా దంతవైద్యులు కూడా పూర్తిస్థాయి ఎంబీబీఎస్ వైద్యులుగా పని చేయడానికి వీలుంటుందని డీసీఐ పేర్కొంది. ఇది అమలైతే ఎంబీబీఎస్‌లో సీటురాక బీడీఎస్‌లో చేరే వారికి ఒకరకంగా సువర్ణావకాశమే మిగతా 6లో..

ఇదీలోకం!



మీపేరు సువర్ణాక్షరాలతో లిఖిస్తే ఏరోజుకైనా చెరిగిపోతుందేమోనని ఆడపిల్లలంతా పచ్చబొట్టు పొడిపించుకుంటున్నారు మేడమ్..!

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: నవమి ఉ.8.36 తదుపరి దశమి; నక్షత్రం: పూర్వాషాఢ పూర్తి; వర్జ్యం: మ.3.28-5.17; దుర్ముహూర్తం: సా.4.47-5.34; రాహుకాలం: సా.4.53-6.22; అమృతఘడియలు: రా.11.16-1.04; శుభసమయం: ఉ.7.00-9.00.

సూర్యోదయం: 6.31

సూర్యాస్తమయం: 6.22

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో ఆదివారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతలో మార్పులేదు. రాత్రి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. గంటకు 13 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 36 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 20 డిగ్రీలు

గాలిలో తేమ: 48 శాతం

సంక్షోభంలో వైద్య విద్యా పాలన



డీఎంఈ పదవిలో ఇన్‌చార్జిగా జూనియర్ ..కోర్టును ఆశ్రయించిన సీనియర్ వైద్యులు

- పదిరోజుల్లో సీనియర్‌ను నియమించాలి
- తెలంగాణ సర్కారుకు కోర్టు ఆదేశాలు
- డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సర్జన్
- దంతవైద్యుడినే నియమించాలని రూల్
- ఈసారి బీడీఎస్ సీట్లు చేజారే ప్రమాదం

హైదరాబాద్ మార్చి10 (మనం ప్రతినిధి): తెలంగాణలో వైద్యవిద్యా పాలన సంక్షోభంలో పడినట్లు కనిపిస్తున్నది. ఒకవైపు డీఎంఈ పోస్టుకు సంబంధించిన వివాదం కొనసాగుతుండగా.. మరోవైపు ఉస్మానియా దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ పదవిపైనా వివాదం చెలరేగింది. సీనియర్లను కాదని.. ఇన్‌చార్జిల పేరుతో జూనియర్లకు పట్టం కడుతున్నారని ఆరోపణలు రావడం, ఈ వ్యవహారాలపై కొందరు కోర్టుకు కూడా ఎక్కడంతో ఇదంతా చినికి చినికి గాలివానగా మారింది.

తెలంగాణ రాష్ట్ర వైద్యవిద్యా సంచాలకుని (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ - డీఎంఈ) నియామకంలో సీనియారిటీని పట్టించుకోలేదని.. కేవలం సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి ఉన్నవాళ్లను మాత్రమే ఆ పదవిలో నియమించాలని కోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో డీఎంఈ పోస్టు సంక్షోభంలో పడింది. డీఎంఈ పోస్టులో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదా ఉన్నవారినే నియమించాలి. కానీ, సీనియారిటీ లిస్టును పక్కన పెట్టి.. ఇన్‌చార్జి పేరుతో రమేశ్ రెడ్డి అనే జూనియర్ వైద్యుడిని నియమించారంటూ అర్హత కలిగిన కొందరు వైద్యులు కోర్టును ఆశ్రయించారు. సీనియారిటీ జాబితాలో రమేశ్‌రెడ్డి నెంబరు 54 అని తెలుస్తోంది. దాంతో.. సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జాబితా సిద్ధం చేసి.. వారిలో అత్యంత సీనియర్‌ను మాత్రమే డీఎంఈ, ఉస్మానియా వైద్యకళాశాల ప్రిన్సిపాల్ పోస్టులలో నియమించాలని కోర్టు ఆదేశించింది. ఈ నియామకాలు పది రోజుల వ్యవధిలో జరపాలని పేర్కొంది.



దంతవైద్య కళాశాలలోనూ...

ఒకవైపు డీఎంఈ పోస్టు వివాదం ఇలా ఉండగా మరోవైపు ఉస్మానియా దంతవైద్య కళాశాల ప్రిన్సిపల్ పోస్టు కూడా అలాగే తయారైంది. తొలుత ఈ కళాశాలకు డాక్టర్ పట్లోళ్ల బాల్‌రెడ్డిని ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఆయన గత నెలలో రిటైర్ కావడంతో.. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నాగేందర్‌ను నియమించారు. ఆయనకు ఇప్పటికే ఉస్మానియా వైద్యకళాశాల ప్రిన్సిపాల్, ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బాధ్యతలున్నాయి. వాస్తవానికి దంతవైద్య కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఎండీఎస్ (మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ) అర్హత కలిగిన సీనియర్ వైద్యుడినే నియమించాలి. కానీ అసలు దంతవైద్యంతో సంబంధం లేని సర్జరీ విభాగం వైద్యుడిని ఇక్కడ నియమించడంపై తీవ్ర విమర్శలు తలెత్తాయి. ఈ ప్రిన్సిపాల పదవి కోసం కొంతమంది జూనియర్లు పైరవీలు చేస్తున్నట్లు తెలుసుకున్న దంతవైద్యులు కోర్టును ఆశ్రయించారు. ఇక్కడ కూడా సీనియర్లను మాత్రమే ప్రిన్సిపాల్‌గా నియమించాలని కోర్టు ప్రభుత్వానికి అదేశాలు జారీ చేసింది.

డెంటల్ సీట్లు చేజారుతాయా?

ప్రభుత్వ దంత వైద్యశాలకు మార్చిలో డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృదం ఆకస్మిక తనిఖీకి వస్తుంది. అక్కడి వసతులు, బోధనా సిబ్బంది తదితర అంశాలను పరిశీలించి.. వాటికి అనుగుణంగానే వైద్యవిద్య సీట్లను కేటాయిస్తుంది. ఈ సమయంలో నిబంధనల ప్రకారం దంత వైద్యుడే ప్రిన్సిపాల్‌గా ఉండాలి. అప్పుడే సీట్లు తగినన్ని వస్తాయి. ప్రస్తుతం దంతవైద్యానికి సంబంధం లేని వైద్యుడు ఇన్‌చార్జిగా ఉండటంతో.. ఈ సంవత్సరం దంత వైద్య సీట్లు చేజారే ప్రమాదం ఉందని పలువురు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ వైద్య పరిపాలన సజావు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య విభాగం పరిపాలన సజావుగా సాగుతోందని, అక్కడ ఇన్‌చార్జి పేరుతో ఎలాంటి అవకతవకలు జరగటం లేదని పలువురు వైద్యులు చర్చించుకుంటున్నారు. అక్కడ డీఎంఈ, ప్రిన్సిపాల్ పోస్టులలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాత్రమే ఉన్నారని వైద్యులు తెలిపారు. కానీ తెలంగాణలో కీలకమైన డీఏంఈ పోస్టు నుంచి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ పోస్టుల వరకు ఇన్‌చార్జి ముసుగులో అనర్హులకు పట్టం కడుతున్నారని ఆరోపణలున్నాయి. అలాగే సీనియారిటీ లిస్టులో కూడా అనేక అవకతవకలు ఉన్నట్లు వినిపిస్తోంది. కోర్టు ఉత్తర్వులతోనైనా న్యాయం జరుగుతుందేమోనని పలువురు వైద్యులు అశిస్తున్నారు.



విద్యుత్ స్థంబాన్ని ఢీ కొన్న కరణ్ ట్రావెల్స్ బస్సు

టిప్పర్‌ను ఢీకొట్టిన బస్సు

- జహీరాబాద్ బైపాస్ వద్ద ఘటన
- బస్సును తాకి పల్టీ కొట్టిన టిప్పర్
- స్పాట్‌లోనే టిప్పర్ డ్రైవర్ మృతి
- పది మందికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం



ప్రమాదానికి గురైన టిప్పర్

జహీరాబాద్, మార్చి 10(మనం న్యూస్): జహీరాబాద్ పట్టణ సమీపంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. ముంబయి నుంచి హైదరాబాద్ వస్తున్న బస్సు వేగంగా దూసుకొచ్చి టిప్పర్‌ను ఢీ కొట్టింది. ఆపై రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగింది. శనివారం ఉదయం అలుగోలు ఎక్స్‌రోడ్డు వద్ద జరిగిన ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ అక్బర్(45) అక్కడికక్కడే మరణించగా.. ప్రమాదానికి కారణమైన కరణ్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న పదిమందికి తీవ్ర గాయాల య్యాయి. ప్రమాదం విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న పోలీసులు స్థానికుల సాయంతో క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించినట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసుకున్న జహీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, హైవేపై అమర్చిన సీసీ కెమెరాల్లో ఈ ప్రమాదం జరిగిన తీరు రికార్డైంది. రైట్ టర్న్ తీసుకునే ప్రయత్నంలో టిప్పర్ ముందుకెళ్లగా వేగంగా దూసుకొచ్చిన ట్రావెల్స్ బస్సు టిప్పర్‌ను ఢీకొట్టింది. బస్సు వేగానికి టిప్పర్ పల్టీలు కొట్టింది. అప్పటికీ అదుపులోకి రాక రోడ్డు కిందికి దిగి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని తాకి ఆగిపోయింది. ఈ వీడియో ఫుటేజీ సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది.

కాంగ్రెస్ అభ్యర్థిగా బలరామ్ నాయక్

- రాజ్యసభకు రేపు నామినేషన్



హైదరాబాద్, మార్చి 10(మనం ప్రతినిధి): రాజ్యసభ ఎన్నికలకు తన అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి బలరామ్ నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసింది. సోమవారం ఆయన నామినేషన్ దాఖలు చేయనున్నారు. పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు, సీఎల్పీ నాయకుడు జానా రెడ్డి, పలువురు సీనియర్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి 21 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఇందులో ఇద్దరు మృతి చెందడంతో నిర్వహించిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయం సాధించింది. దీంతో కాంగ్రెస్ బలం 19కి చేరింది. వీరిలో ఏడుగురు ఎమ్మెల్యేలు కనకయ్య, పువ్వాడ అజయ్, చిట్టం రామ్మోహన్ రెడ్డి, బొడ్డు భాస్కర్ రావు, రెడ్యా నాయక్, విఠల్ రెడ్డి , కాలే యాదయ్య టీఆర్ఎస్‌లో చేరారు. సాంకేతికంగా వీరందరని శాసన సభలో కాంగ్రెస్ సభ్యులుగానే పరిగణిస్తున్నారు. దీంతో ప్రస్తుతం శాసన సభలో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 12 మాత్రమే. కాంగ్రెస్ పార్టీకి తెలుగు దేశం, బీజేపీ మద్దతు ఇచ్చే అవకాశాలు కనిపించడంలేదు. టీఆర్ఎస్‌కే తమ మద్దతు అని ఎంఐఎం ఇప్పటికే ప్రకటించింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్య తీసుకోవడంలేదని, రాజ్యసభ ఎన్నికల్లో విప్ జారీ చేయడం ద్వారా, వారిపై అనర్హత వేటు వేయాలని కోరవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. పోటీ అనివార్యమైతే ఈ నెల 23 న ఓటింగ్ నిర్వహిస్తారు.

మందకృష్ణ అరెస్టుకు పోలీసుల యత్నం

- ఇంటివద్ద భారీగా పోలీసుల మోహరింపు

హైదరాబాద్, మార్చి 10(మనం ప్రతినిధి): మార్చి 13న ఎస్సీ వర్గీకరణకోసం నిర్వహించ తలపెట్టిన 24 గంటల బంద్ విజయవంతానికి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను పోలీసులు శనివారం అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. అందులో భాగంగానే ఆయన ఇంటి వద్ద భారీగా పోలీసులను మోహరించారు. ఇదిలావుంటే.. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. మందకృష్ణ ఏ క్షణంలో ఇంటి నుంచి బయటకు వచ్చినా అరెస్టు చేయాలని ప్రయత్నిస్తున్నారు.

వ్యవసాయ విద్యకు 'ఎకరం'

రైతుకోటా నిబంధనలో సడలింపులు.. వచ్చే ఏడాది నుంచి పూర్తిగా రద్దు?

- వ్యవసాయ శాఖ తాజా ఉత్తర్వులు
- ఎకరంలోపుంటే సీటు లేనట్లే
- సగం మంది మూడెకరాల్లోపు వారే
- 18 లక్షల మందికి ఎకరం లోపే
- రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల కౌలు రైతులు
- సీట్లలో వీరందరికీ మొండిచెయ్యి



హైదరాబాద్, మార్చి 10(మనం ప్రతినిధి): అగ్రికల్చర్ డిగ్రీ కోర్సుల్లో సీట్ల రిజర్వేషన్‌లో నిబంధనలను మారుస్తూ రాష్ట్ర వ్యవసాయ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. సవరించిన నిబంధనల ప్రకారం డిగ్రీ కోర్సుల్లో 40 శాతం సీట్ల(రైతు కోటా) కేటాయింపుల్లో ఎకరం పైగా ఉన్న రైతుల పిల్లలనూ అర్హులుగా చేర్చింది. గతంలో ఈ సీట్లను మూడెకరాలకు పైగా ఉన్న రైతుల పిల్లలకే ఆ కోటా కింద సీట్లను కేటాయించేవారు. అన్నదాతల కుటుంబాల్లోని పిల్లలకు ఇచ్చే రిజర్వేషన్‌లో మార్పులు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్ర వ్యవసాయ శాఖకు ప్రతిపాదనలు పంపిన సంగతి తెలిసిందే! వర్సిటీ ప్రతిపాదన మేరకు మూడెకరాల నిబంధనను ఎకరానికి తగ్గిస్తూ శుక్రవారం వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిబంధన కొంతమంది రైతుల పిల్లలకు శుభవార్త అయినప్పటికీ.. చాలామంది రైతుల పిల్లలను నిరాశ పర్చింది.

రిజర్వేషన్ వర్తింపు ఇలా..

వ్యవసాయ విద్యాకోర్సుల్లో రైతు కోటా కింద ఉండే 40 శాతం సీట్లను ప్రస్తుత విద్యా సంవత్సరం వరకు మూడెకరాలకు మించి భూమి ఉన్న రైతుల పిల్లలకు కేటాయించేవారు. ఇందుకు విద్యార్థి పేరు మీద గానీ తల్లిదండ్రుల పేరు మీద గానీ కనీసం మూడెకరాల వ్యవసాయ భూమితో పట్టాదారు పాసు పుస్తకం ఉంటేనే సీటు ఇచ్చేవారు. వ్యవసాయ శాఖ తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం.. ఎకరం భూమి ఉన్నవారికి సీట్లలో రిజర్వేషన్ వర్తిస్తుంది. విద్యార్థి అమ్మమ్మ, తాత, నానమ్మ పేరు మీద పట్టాదారు పాసు పుస్తకం ఉంటే.. ఇది వర్తించదు.

సగానికి పైగా మూడెకరాల్లోపు వారే..

రాష్ట్రవ్యాప్తంగా 72 లక్షల మంది రైతులు ఉన్నారు. 70 శాతం మంది రైతులకు అరెకరం నుంచి మూడెకరాలలోపు భూమి ఉన్నవారే ఉన్నారు. ఈ 70 శాతంలో ఎకరంకంటే తక్కువ భూమి ఉన్నవారు 20 శాతానికి పైగా ఉన్నారు. గతంలో 70 శాతం మంది రైతుల పిల్లలు వ్యవసాయ విద్య కోర్సుల్లో సీట్లను నష్టపోతే తాజా నిబంధనతో 20 శాతం మంది రైతుల పిల్లలు నష్టపోతున్నారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకునే వ్యవసాయ విశ్వవిద్యాలయం.. అరెకరం భూమి ఉన్నా రిజర్వే షన్ వర్తించేలా చూడాలని వ్యవసాయ శాఖకు ప్రతిపాదనలు పంపింది. అయినా వ్యవసాయ శాఖ దాన్ని ఎకరం భూమికి పరిమితం చేసింది.

పుస్తకం ఉంటే చాలు.. వర్సిటీ తీర్మానం

కుటుంబాల్లో భూముల పంపకం వల్ల భూముల విస్తీర్ణం ఒక్కొక్కరి పేర్ల మీద తగ్గుందని వర్సిటీ తేల్చిచెప్పింది. ఇందుకు అనుగుణంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి రైతు కోటా రిజర్వేషన్ పొందేందుకు భూవిస్తీర్ణం పరిమితిని పూర్తిగా రద్దు చేయాలని వర్సిటీ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపింది.

కొద్దిరోజుల క్రితం నిర్వహించిన వర్సిటీ విద్యామండలి సమావేశంలో ఈ అంశంపై లోతుగ చర్చించారు. ఎంత భూమి ఉన్నా.. దానికి పట్టాదారు పాసుపుస్తకం ఉంటే.. రిజర్వేషన్ వర్తింపజేయాలని విద్యామండలి తీర్మానం చేసింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ దీనిపై సమాలోచనలు చేసి అరెకరం భూమి ఉన్నవారికి రిజర్వేషన్ వర్తింపజేయాలని మొదట భావించారు. కానీ ఇంతలో ప్రభుత్వం నుంచి మార్గదర్శకాల ఆధారంగా ఎకరం భూమి ఉండాలనే నిబంధనను పెట్టింది. దీని కారణంగా ఎకరంలోపు భూమి ఉన్న రైతుల పిల్లలు నష్టపోనున్నారు.

కౌలు రైతుల పిల్లలకు మొండిచేయ్యి..

ఎకరంలోపు భూవిస్తీర్ణం ఉన్నవారితో పాటు భూమిలేకున్నా వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న వారికి, ఏండ్ల తరబడి కౌలుకు సాగు చేస్తున్న రైతుల పిల్లలకు 40 శాతం కోటాలో సీటు దక్కడంలేదు. అధికారిక లెక్కల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. వీరితో పాటు ఎకరంలోపు భూమి ఉన్న 18 లక్షల మంది రైతుల పిల్లలు ఉన్నారు. అంటే ఈ లెక్కన ప్రతి సంవత్సరం వ్యవసాయ విద్యలో 30 లక్షల మంది విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు అనర్హులుగా మారుతున్నారు. ఏదిఏమైనా రిజర్వేషన్లేవీ.. బడుగు, బలహీన వర్గాలకు లబ్ధి చేకూర్చేవి ఉండాలి కానీ.. ఇలావారిని చదువుకు దూరం చేసే విధంగా ఉండొద్దనేది మేధావుల అభిప్రాయం. కనీసం అరెకరం లోపు భూవిస్తీర్ణం లేదా ఎంతోకొంత భూమితో పట్టాదారు పుస్తకం ఉంటే రిజర్వేషన్ వర్తింపజేయాలని చాలామంది అభిప్రాయపడుతున్నారు. దీనిపై ప్రభుత్వం, వ్యవసాయ శాఖ పునరాలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హరీశ్ పార్టీ మారడం మేలు

- ఆయన టీఆర్ఎస్‌లో ద్వితియ శ్రేణి పౌరుడే
- బీజేపీలో చేరేందుకే అమిత్ షా ను కలిశారు
- కేటీఆర్ కోసమే హరీశ్‌ను వెనక్కునెడుతున్నారు
- కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 10(మనం ప్రతినిధి): టీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ద్వితియ శ్రేణి పౌరుడు మాత్రమేనని కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా హాల్ రేవంత్ శనివారం మాట్లాడారు. హరీశ్ పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ఆయన వివరణ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వార్తలను ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఓ మంత్రిగా ఆయన పోలీసులను ఆదేశిస్తే బాగుండేదన్నారు. తాను పార్టీ మారడం లేదంటూ మామ కేసీఆర్‌కు వివరణ ఇస్తున్నట్లుగా హరీశ్ తీరు ఉందన్నారు. సోషల్ మీడియాలో ఇతరులపై దుష్ప్రచారం చేయడంలో కేసీఆర్, హరీష్ రావు అల్లుడు ఆణిముత్యం, మామ స్వాతిముత్యం అన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో ఎవరో ఏదో పెడితే, తాను టీఆర్ఎస్‌లోనే పుట్టాను, ఇందులోనే చనిపోతాను అంటూ పెద్ద పెద్ద మాటలు ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. 2008లో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు హరీశ్‌రావు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారని రేవంత్ చెప్పారు. శాసన సభా పక్ష నేతగా తన పేరును ప్రకటించలేదన్న కోపంతోనే హరీశ్‌రావు పార్టీ మారాలనుకుంటున్నారని రేవంత్ ఆరోపించారు. టీఆర్ఎస్‌లో కేసీఆర్, కేటీఆర్ తప్ప మిగిలిన శాసన సభ్యులు, పలు జిల్లాల అధ్యక్షులతో సహా పార్టీ మారాలని హరీశ్‌రావు నిర్ణయించుకున్నారని చెప్పారు. వైఎస్ మరణంతో హరీశ్‌రావు పార్టీ మారలేకపోయారన్నారు. తాజాగా మరోసారి పార్టీ మారేందుకు తన బంధువు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శితో మంతనాలు ప్రారంభించారని, ఇందులో భాగంగానే రెండు సార్లు అమిత్ షాను కలిశారని రేవంత్ ఆరోపించారు. ఈ విషయాన్ని పసిగట్టడంలో విఫలమైనందుకే ఇంటలిజెన్స్ చీఫ్‌ను ముఖ్యమంత్రి తప్పించారని ఆరోపించారు. గత ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఇతర పార్టీల ఎమ్మెల్యేలపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసి, వారిని మానసికంగా ఇబ్బంది పెట్టి, కేసులు పెట్టి, భయపెట్టి తమ పార్టీలో చేర్చుకున్నారని రేవంత్ ఆరోపించారు. ఇదే ప్రచారం మీపైనే వచ్చే సరికి నొప్పి తెల్సిందా అని ప్రశ్నించారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకే టీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ప్రాధాన్యతను తగ్గిస్తున్నారని , మునిగిపోతున్న టీఆర్ఎస్ నావలో ఉండే కంటే ఆయన బయటకు రావడమే మంచిదన్నారు.

ఈటల సమాధానం చెప్పాలి

ఈటల రాజేందర్ పై తాను చేసిన అవినీతి ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై సరైన సమాధానం చెప్పకుండా ఈటల తనను ఇష్టం వచ్చినట్లు దూషిస్తే సరిపోదన్నారు. 30 జిల్లాల ప్రకటన వచ్చిన తరువాత, తెలిసే పది జిల్లా పేర్లతో రేషన్ కార్డులు ప్రింట్ చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ కుంభకోణంలో రూ.150 కోట్ల అవినీతి జరిందని రేవంత్ ఆరోపించారు. వీటి చెల్లింపుల విషయంలోనే కమిషనర్‌కు , ఈటల కు విబేధాలు వచ్చాయన్నారు. తాను చేసిన ఆరోపణలపై విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని, ఈ అంశంపై చర్చకు వచ్చినా తాను సిద్ధమేని రేవంత్ ప్రకటించారు.

కాంగ్రెస్‌ది దొంగల అంగడి యాత్ర

- పట్టణాల్లో యాత్రకు దక్కని ప్రజాదరణ
- తెలంగాణలో కాంగ్రెస్‌ది అసమర్థ పాత్ర
- మే 15 తర్వాత గాంధీభవన్‌కు టులెట్ బోర్డు: జీవన్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 10(మనం ప్రతినిధి): దేశంలో ఏ ప్రతిపక్ష పార్టీ పోషించని అసమర్థ పాత్రను తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పోషిస్తోందని ఆర్మూర్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. బస్సు యాత్ర పేరిట అలీబాబా నలభై దొంగల బ్యాచ్ బయలుదేరి వారు నోటికొచ్చిన భాష మాట్లాడారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓ బెయిల్ పార్టీ అని సోనియా, రాహుల్, రేవంత్ లాంటి నేతలందరూ బెయిల్‌పై ఉన్న వాళ్ళేనని ఆరోపించారు. ఈ సందర్భంగా శనివారం టీఆర్ఎస్ఎల్పీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్మూర్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే అశన్నగారి జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బస్సు యాత్రకు అంగడి యాత్రగా పేరొచ్చిందని పలికారు. తెలంగాణ పట్టణాల్లో అంగడి రోజు జనం సందడి కనిపిస్తుందని అదేరోజు తెలివిగా బస్సు యాత్రలు ప్లాన్ చేశారని ఎద్దేవాచేశారు. బోధన్‌లో అదే జరిగిందన్నారు. అయినా జనాలు లేక బస్సు యాత్ర ఫెయిల్ అయ్యిందన్నారు. హరీష్ రావును ఒక కాంగ్రెస్ నేత బహిరంగంగా చంపేస్తా అని ప్రకటన చేశాడని.. కాంగ్రెస్ సంస్కృతి ఇదేనా? అని నిలదీశారు. మంత్రులు కేటీఆర్,ఈటల రాజేందర్‌పై...కాంగ్రెస్ నేతలు, జైల్లో చిప్పకూడు తిన్న రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడమేంటి? అని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి నోటికి హద్దే లేకుండా పోతోందన్నారు. కాంగ్రెస్ నేతల మానసిక స్థితికి స్పెషల్ స్టేటస్ ఇచ్చి అర్జంటుగా వారిని పిచ్చాసుపత్రిలో చేర్పించాలన్నారు. కాంగ్రెస్‌లో నలభై మంది బస్సు యాత్రకు బయలుదేరితే 33 మంది సీఎం అభ్యర్థులేనని చురకలు అంటించారు. మే 15 తర్వాత గాంధీ భవన్‌కు టులెట్ బోర్డు తగిలించుకోవాల్సిందేనని చెప్పారు. ఇప్పటికే టీడీపీ టులెట్ బోర్డు పెట్టుకుని హోల్ సెల్ అమ్మకానికి బోర్డు తగిలించుకుందన్నారు. మంత్రి కేటీఆర్‌కు నీతులు చెప్పే జానారెడ్డి అడ్డగోలు భాష మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలకు నీతులు చెప్పరా? అని ప్రశ్నించారు.



నీటిపారుదల శాఖ ఇ.ఎన్.సి. మురళీధర్ కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావు తదితరులు

భద్రాద్రి రామయ్య పెళ్లి పత్రిక

- ఆవిష్కరించిన అల్లోల, తుమ్మల
- త్వరలోనే ఆలయ పునర్నిర్మాణం

హైదరాబాద్, మార్చి 10: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రచల క్షేత్రంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని మంత్రులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఈ నెల 26న జరగనున్న స్వామివారి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక, గోడ పత్రికను మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఎర్రమంజిల్‌లో ఆవిష్కరించారు. మిథిల ప్రాంగణంలో జరిగే కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని వెల్లడించారు. స్వామి వారి కళ్యాణానికి అందరు అహ్వానితులేనని ఆహ్వానం పలికారు. ప్రభు త్వం తరపున సీఎం కేసీఆర్ సతీసమేతంగా స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిసా, కర్నాటక రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల కోసం సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కాగా, యాదాద్రి తరహాలోనే భద్రాద్రి పుణ్యక్షేత్ర పునర్నిర్మాణ పనులు చేపడతామని మంత్రులు వివరించారు. ఉగాది పర్వదినం సందర్భంగా సీఎం కేసీఆర్, త్రిదండి శ్రీ చినజీయర్ స్వామితో సంప్రదించి ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు.



సీతారాముల కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న మంత్రులు

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

- క్రీమిలేయర్‌ను కేంద్రం రద్దు చేయాలి: జాజుల



హైదరాబాద్, మార్చి 10(మనం ప్రతినిధి): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లు ప్రవేశపెట్టే విధంగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని దేశోద్ధారక భవన్లో బీసీ ఉపాధ్యాయ సంఘం నేతలు శ్రీనివాసరావ్, తాళ్లపల్లి సురేష్‌తో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టేలా బీసీ ప్రజాప్రతినిధులంతా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పదోన్నతులలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో 50 శాతం బీసీలున్నా ఉద్యోగ రంగంలో కేవలం 8శాతం మాత్రమే ఉండటం విచారకరమన్నారు. సీపీఎస్ విధానం బీసీ ఉద్యోగులకు శాపంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో సకల జనుల సమ్మెకు ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. క్రీమిలేయర్‌ను కేంద్రం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్రీమిలేయర్‌తో బీసీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గురుకులాలు, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించాలన్నారు. బీసీ విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను ఇవ్వాలన్నారు. బీసీ ఉపాధ్యాయుల ఫోరంను, తెలంగాణ రాష్ట్ర బీసీ ఉపాధ్యాయ సంఘంలో వీలినం చేసిన ట్టుగా తెలిపారు. బీసీ టీచర్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌గౌడ్‌ను సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా నియమిస్తున్నట్టు ప్రకటించారు.



టీడీఎల్పీలో విలేకరులతో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

20వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్

- కొత్తగా రెండొందల బీసీ స్టడీ సర్కిల్స్ పెట్టాలి:కృష్ణయ్య

హైదరాబాద్, మార్చి 10(మనం ప్రతినిధి): ఈ ఏడాది బడ్జెట్‌లో బీసీ సబ్‌ప్లాన్‌కు రూ.20 వేల కోట్లు కేటాయించాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. అసెంబ్లీలోని టీడీఎల్పీలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీల అభివృద్ధిపై గతేడాది డిసెంబర్‌లో 3రోజులపాటు చర్చలు జరిపిన కేసీఆర్, నేటికీ బీసీ సబ్‌ప్లాన్ ప్రకటించకపోవడం దారుణమన్నారు. పార్టీలకు అతీతంగా బీసీ ప్రజా ప్రతినిధులతో జరిపిన ఈ చర్చల్లో రెండొందలకుపైగా ముసాయిదా తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారని కృష్ణయ్య తెలిపారు. ఆయా తీర్మానాల మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల పథకాల కోసం రూ.10వేల కోట్లు కేటాయించాలని కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పథకాల్లో జనాభా లెక్కన బీసీలకు 52శాతం కేటాయింపులు చేయాలని ఆయన కోరారు. బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లకు రూ.2వేల చొప్పున, గీత, మత్స్యకారుల కార్పొరేషన్లకు రూ.వెయ్యి కోట్ల చొప్పున, వడ్డెర, రజక , నాయి బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, శాలివాహన, వాల్మీకి, దర్జీ, సగర, మేదర, పూసల ఫెడరేషన్లకు రూ.250 కోట్ల చొప్పున, బట్రాజు, తదితర ఫెడరేషన్లకు రూ.100 కోట్ల చొప్పున బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. మేర/దర్జీ ఫెడరేషన్‌ను బీసీ సంక్షేమశాఖ పరిధిలోకి తీసుకురావాలని ఆయన కోరారు. కులాంతర వివాహాలు చేసుకున్న బీసీలకు ఇచ్చే నగదు ప్రోత్సాహాన్ని రూ.10 వేల నుంచి రూ.2 లక్షలకు పెంచాలని కృష్ణయ్య డిమాండ్‌చేశారు. బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను రూ.250 కోట్లకు పెంచాలని కోరారు. జిల్లా కేంద్రాల్లో హాస్టళ్ల డిమాండ్ పెరిగిన నేపథ్యంలో కొత్తగా రెండొందలు బీసీ హాస్టళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వమే చెల్లించాలని, పాఠశాల స్థాయి నుంచే బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేయాలని కృష్ణయ్య కోరారు.

స్త్రీ, పురుష సమానత్వంతోనే అభివృద్ధి

- మహిళలకు మరింత స్వేచ్ఛ: శాంతా సిన్హా
- ప్రోత్సహిస్తే మహిళలు అద్భుతాలు చేస్తారు: నేరెళ్ల శారద

హైదరాబాద్, మార్చి 10(మనం ప్రతినిధి): స్త్రీ, పురుష సమానత్వంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని నేషనల్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ మాజీ చైర్మన్ శాంతా సిన్హ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం గాంధీభవన్‌లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాంతాసిన్హ హాజరై ప్రసంగించారు. పితృస్వామ్య ధోరణి పోవాలన్నారు. లింగవివక్ష ఇంకెన్నాళ్లని ప్రశ్నించారు. జాతీయోద్యమంలో మహిళల పాత్ర మరువలేనిదన్నారు. రాజ్యాంగంలో స్త్రీ, పురుషులు సమానమేనని, సమాన ఓటు హక్కు ఉందన్నారు. ఎంతో మంది గ్రామీణ ప్రాంతాల నుంచి బతుకు దెరువుకోసం హైదరాబాద్‌కు వచ్చి సేల్స్‌గర్ల్స్‌గా, ఇతరత్రా పనులు చేస్తున్న యువతులకు కనీసం వేతనం అందటం లేదన్నారు. మహిళలకు మరింత స్వేచ్ఛ రావాలని ఆకాంక్షించారు. పార్టీల్లోనూ 33 శాతం రిజర్వేషన్ కాదు, సమానత్వం వచ్చే విధంగా ఆయా పార్టీల అధిష్టానాలు చర్యలు తీసుకోవాలన్నారు. సేఫ్టీ పేర ఆడపిల్లలను కంట్రోల్ చేస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. అమ్మాయిలు బయటకు వెళ్లాలంటే ఆంక్షలుండటం విచాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయంలో ఎన్నో చట్టాలు వచ్చాయని, మహిళల కోసం వచ్చిన చట్టాల గుర్తించి ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించేవిధంగా మహిళా సంఘాలు మరింతగా కృషి చేయాలని సూచించారు. కాగా, మహిళలను ప్రోత్సహిస్తే అద్భుతాలు చేస్తారని కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారద అన్నారు. శానిటరీ నాప్‌కిన్లకు కేంద్రం జీఎస్టీ వర్తింప చేయటాన్ని నిరసిస్తూ ఆందోళనలను చేపట్టనున్నట్టు తెలిపారు.

నిర్బంధాలతో ఆపలేరు

ఆపగలిగితే తెలంగాణ వచ్చేదికాదు

- సర్కారు కావాలనే ఉద్రిక్తతలు సృష్టిస్తోంది
- రాష్ట్రవ్యాప్తంగా 3,500 మందిని అరెస్టు చేశారు
- ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదు: కోదండరాం
- జేఏసీపట్ల కక్ష సాధింపు ఎందుకు?
- నిర్బంధాలతో ఏం సాధించారని ప్రశ్న
- సర్కారుపై నైతిక విజయం మాదే: చాడ

హైదరాబాద్, మార్చి 10(మనం ప్రతినిధి): పోలీసులనుపయోగించి ప్రజా ఉద్యమాలను అణిచివేసేందుకుయత్నిస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని టీజేఏసీ చైర్మన్ కోదండరాం హెచ్చరించారు. 'మిలియన్ మార్చ్ స్ఫూర్తి' సభను పురస్కరించుకుని తార్నాకలోని తన నివాసం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఇలాగే చేసి ఉంటే తెలంగాణ వచ్చి ఉండేదికాదని కోదండరాం పేర్కొన్నారు. నాటి ప్రభుత్వాలకంటే టీఆర్ఎస్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న మఖ్దూం మొయినుద్దీన్ విగ్రహం వద్ద శాంతియుతంగా సభ నిర్వహించాలని భావించామని, టీఆర్ఎస్ సర్కారు కావాలనే ఉద్రిక్తతలను పెంచుతోందని ఆరోపించారు. ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాల్సిన ప్రభుత్వం, పోలీసులను ఉపయోగించే ఉద్యమకారులను నిర్బంధిస్తోందని ఆరోపించారు. అరెస్ట్ చేసిన వారికి కనీసం తిండి కూడా పెట్టకుండా హింసిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉద్యమకారులకేదైనా జరిగితే ప్రభుత్వానిదే భాధ్యతన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,500 మందికిపైగా ఉద్యమకారులను పోలీసులు అరెస్ట్ చేశారని కోదండరాం ఆరోపించారు. అరెస్ట్ చేసి 24 గంటలు గడిచినప్పటికీ కోర్టులో హాజరుపర్చకపోవడం రాజ్యాంగం ప్రకారం నేరమనే విషయాన్ని గుర్తెరగాలన్నారు. ఈ నిర్బంధకాండపై కోర్టుకు వెళ్తామని ఆయన తెలిపారు. తెలంగాణలో నిరుద్యోగ, రైతాంగ సంక్షోభం నెలకొందని చెప్పారు. ప్రజా సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ విశ్రమించేదిలేదన్నారు. అనంతరం సభకు బయల్దేరిన కోదండరాంను పోలీసులు అరెస్ట్ చేసి బొల్లారం స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా టీజేఏసీ కార్యకర్తలు నినాదాలు చేశారు. వారిని కూడా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.



తార్నాకలోని తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న కోదండరాం



బారికేడ్లతో టాంక్‌బండ్ రోడ్డును మూసేసిన పోలీసులు

నైతికంగా మేం గెలిచాం

నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ప్రభుత్వాలు అణిచివేయలేవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభకు బయలుదేరే ముందు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యమాన్ని ఉపయోగించుకుని ముఖ్యమంత్రి అయిన కేసీఆర్, తెలంగాణ ఉద్యమ త్యాగాలను మాత్రం గుర్తించడంలేదని విమర్శించారు. తెలంగాణను పోలీసు రాష్ట్రంగా మార్చి ఉద్యమకారుల పట్ల కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని చాడ దుయ్యబట్టారు. జేఏసీ పట్ల అంత కక్ష సాధింపు ఎందుకని చాడ కేసీఆర్‌ను ప్రశ్నించారు. నాడు ఉద్యమకారులను ఉపయోగించుకుని.. అధికారంలోకి వచ్చాక అణివేతలు, నిర్బంధాలా అంటూ కేసీఆర్‌పై చాడ మండిపడ్డారు. నిర్బంధాలు పెట్టి కేసీఆర్ ఏంసాధించారని ఆయన ప్రశ్నిం చారు. ప్రజా ఉద్యమాలను ప్రభుత్వాలు అణిచివేయలే వన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులను ప్రభుత్వం అరెస్ట్ చేయించి నప్పటికీ ట్యాంక్‌బండ్‌పైకి ఉద్యమకారులు చేరుకున్నారని, నైతికంగా తాము విజయం సాధించామని చాడ తెలిపారు. అమరుల ఆకాంక్షలను నెరవేర్చేవరకు తమ పోరాటం ఆపబోమన్నారు. అనంతరం పోలీసులు చాడను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. మఖ్దూం మొయినుద్దీన్ విగ్రహం వద్దకు చేరుకునేందుకు ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్‌ను ట్యాంక్‌బండ్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు.



'మిలియన్ మార్చ్ స్ఫూర్తి' యాత్ర కోసం టాంక్‌బండ్ వైపు వస్తున్న చాడ వెంకటరెడ్డి తదితర నేతలు, మహిళా కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

మోదీపై టీఆర్ఎస్, ఎంఐఎం కుట్ర

- రాజ్యాంగం ప్రకారమే రిజర్వేషన్లు
- టీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు
- బీజేపీ నేత, ఎమ్మెల్యే కిషన్ రెడ్డి



హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న కిషన్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (మనం ప్రతినిధి): ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా టీఆర్ఎస్, ఎంఐఎం కుట్ర చేస్తున్నాయనని బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్లు అడ్డుకుంటున్నారంటూ ఆ పార్టీల నేతల మోదీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, లేని సమస్యను సృష్టించి పార్లమెంట్ ను అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. మోదీ ప్రభుత్వం రిజర్వేషన్ల చట్టం తీసుకురాలేదని, రాజ్యాంగం ప్రకారమే రిజర్వేషన్లు అమలవుతున్నాయని ఆయన స్పష్టంచేశారు. దారుసలేం నుంచి వచ్చిన ఆజ్ఞల ప్రకారమే ఎంఐఎం, టీఆర్ ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ధర్నా చేస్తున్నారని ఆరోపించా రు. తెలంగాణ ప్రజలు మతపరమైన రిజర్వేషన్లు వ్యతిరేకిస్తున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. మతపరమైన రిజర్వేషన్లపై ప్రజాభిప్రాయ సేకరణ చేయడానికి టీఆర్ఎస్ సిద్ధమేనా అని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్రంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు చేయొద్దు, ఊరేగింపులు చేయకూడదు, కానీ టీఆర్ఎస్ నాయకులు మాత్రం పార్లమెంట్‌ను అడ్డుకోవచ్చు, ధర్నాలు చేయచ్చు, కేసీఆర్ ద్వంద్వ నీతికి ఇదే నిదర్శనమన్నారు. దేశంలో పెత్తందార్లు ఉన్న ఏకైక పార్టీ టీఆర్ఎస్ అని విమర్శించారు. ఎన్నికలు హామీలు మాటలకే పరిమితమయ్యాయని, దళితులను తీవ్రంగా మోసం చేశారని ఆయన అన్నారు. నాలుగు సంవత్సరాల కాలంలో కేవలం 17 సార్లు మాత్రమే కేసీఆర్ సచివాలయానికి వచ్చారని, దేశంలో ఏ ముఖ్యమంత్రి ఇలా చేసి ఉండరని ఆయన వ్యాఖ్యానించారు. బంగారు తెలంగాణ బదులు రాష్ట్రాన్ని మద్యం తెలంగాణగా మారుస్తున్నారన్నారు. తాగునీటి ప్రాజెక్టులపై అంచనాలు పెంచి, రీడిజైనింగ్ పేరుతో కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కమీషన్‌లు వసూలు చేస్తున్నారన్నారు. కేంద్రం గ్రామ పంచాయతీలకు ఇస్తున్న నిధులను పక్కదారి పట్టించి, పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఇస్లామిక్ దేశాల్లోనూ మహిళా మంత్రులున్నారని, కానీ టీఆర్ఎస్ కేబినెట్‌లో ఒక్క మహిళ కూడా లేదన్నారు. తెలంగాణలోని 2 కోట్ల మంది ఆడపడుచులు రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు సరైన జవాబిస్తారని అన్నారు. టీఆర్ఎస్ నాయకులు అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

మాట తప్పడమే కేసీఆర్ మోడల్: శ్రీధర్ రెడ్డి

దేశానికే తెలంగాణ మోడల్ కావాలని సీఎం కేసీఆర్ అంటున్నారని, మాట తప్పడం, ధర్నా చౌక్‌ను రద్దు చేయడం కేసీఆర్ మోడలా అని బీజేపీ అధికార ప్రతినిధి శ్రీధర్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ పుణ్యాన తెలంగాణ భాష అంటే తిట్లు, శాపనార్థాలని ప్రజలు అనుకునే స్థాయికి దిగజారిందన్నారు.

ఎమ్మార్పీఎస్ బంద్‌కు మావోయిస్టుల మద్దతు

హైదరాబాద్, మార్చి 10(మనం ప్రతినిధి): ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో ఈ నెల 13న ఎమ్మార్పీఎస్ తలపెట్టిన తెలంగాణ బంద్‌కు మావోయిస్టు పార్టీ మద్దతు ప్రకటించింది. మావోయిస్టు రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ ఈ మేరకు పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. వర్గీకరణ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతున్న మంద కృష్ణను టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్బంధించటం అన్యాయమన్నారు. ఉద్యమాల ద్వారా అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేస్తున్న వారి పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుండటం పట్ల నిరసన వ్యక్తంచేశారు.

ఏప్రిల్ నుంచి రైతులకు బీమా: పోచారం




హెదరాబాద్, మార్చి 10 (మనం ప్రతినిధి): రాష్ట్రం లోని ప్రతి రైతుకు కల్పించే రూ.5 లక్షల బీమా పథకాన్ని వచ్చే ఏప్రిల్ నుంచి ప్రారంభిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బంజారా హిల్స్‌లోని తన అధికారిక నివాసంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఎల్ఐసీ సంస్థ ప్రతినిధులతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరీంనగర్‌లో నిర్వహించిన ప్రాంతీయ రైతు సమన్వయ సమితి సమావేశంలో సీఎం కేసీఆర్ ప్రతి రైతుకు రూ.5 ల క్షల బీమా కల్పిస్తామని ప్రకటించార ని గుర్తుచేశారు. దురదృష్టవశాత్తు రైతు మరణించినా బీమా మొత్తం రూ.5 లక్షలు ఆ కుటుంబానికి వస్తాయని, ఆర్థిక ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఈ పథకానికి సంబంధించి అందరి అభిప్రాయాలు, సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి రైతుకు బీమా వర్తించేలా మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశించారు. త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈ నివేదికను సమర్పించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ప్రజా ప్రయోజనాలు పట్టవా?

- డీఎంఈ నియామకంలో మంత్రి ఇష్టారాజ్యం
- హైకోర్టులో అక్షింతలు పడ్డా తీరు మారలే
- పైకోర్టుకు వెళ్లే ప్రయత్నం సిగ్గుచేటు: మల్లు రవి

హైదరాబాద్, మార్చి 10: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(ఇంచార్జ్) నియామకం విషయంలో నిబంధనలను తుంగలో తొక్కి మంత్రి లక్ష్మారెడ్డి తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి విమర్శించారు. పదోన్నతులకు సంబంధించి సీనియారిటీని పట్టించుకోకుండా తన అనుచరుడైన రమేశ్ రెడ్డికి మంత్రి పట్టం కట్టారని ఆరోపించారు. దీనిపై ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. ఈ నియామకం చెల్లదంటూ హైకోర్టు కొట్టివేసిందని చెప్పారు. అయితే, ఈ తీర్పుపై పై కోర్టుకు వెళ్లేందుకు మంత్రి ప్రణాళికలు వేస్తున్నారని, ఇది సంస్థకు నష్టం చేస్తుందని మల్లు రవి తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్‌లాంటి కీలకమైన పోస్టుల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా భర్తీ చేయాలని పేర్కొన్నారు. ఈ స్థాయి పదవిని మంత్రి తన అనుచరులకు కట్టబెట్టడమేంటని ప్రశ్నించారు. దీనిపై హైకోర్టు అక్షింతలు వేసినా మంత్రికి సిగ్గు రాకపోవడం శోచనీయమని అన్నారు. సంస్థ బాగును కాంక్షించే వారు ఇప్పటికైనా సీనియర్లకు ఆ పదవి ఇవ్వాలని మల్లు రవి డిమాండ్ చేశారు. రమేశ్ రెడ్డి కంటే సంస్థలో దాదాపు 53 మంది సీనియర్లు ఉన్నారని వారు ముందుగానే సీఎస్‌కు, ఇతర ఉన్నతాధికారులకు రమేశ్ రెడ్డి నియమాకాన్ని వ్యతిరేకిస్తూ లేఖలు అందజేశారని అయినా ప్రభుత్వం పట్టించుకోకుండా కొనసాగించడంతో వారు కోర్టుకు పోతే కోర్టు ఆ ఉత్తర్వులను కొట్టి వేసిందన్నారు. ఈ విషయంలో ఎస్.సి, ఎస్.టి ఉద్యోగులు ఈ విషయంలో ఇప్పటికే అనేకసార్లు ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారని చెప్పారు. ఇప్పటికైనా సంస్థ బాగుగోలు ఆలోచించి సీనియర్లకు అవకాశమిచ్చి వైద్య సంస్థను కాపాడాలని మల్లు రవి డిమాండ్ చేశారు. కాగా, బస్సు యాత్రతో టీఆర్ఎస్ పార్టీలో వెన్నులో చలి పుట్టిందని, ఓడిపోతామనే భయంతో టీఆర్ఎస్‌ను వెంటాడుతోందని దాంతోనే పార్టీ నేతలు మతి స్థిమితం కోల్పోయి పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని మల్లు రవి ఆరోపించారు.



ఇద్దరు చంద్రులు.. ఒక మోదీ

గత రెండు వారాలుగా రాజకీయ వేడి మండే సూర్యుడితో పోటీపడుతోంది. పేరులో చంద్రుడిని పెట్టుకున్న ఇద్దరు ముఖ్య మంత్రులు హాట్‌హాట్ కామెంట్లు చేస్తూ కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారుపై తొడగొడుతున్నారు. దీంతో అసలేం జరుగుతోందో అర్థం కాని పరిస్థితిలో తెలుగు ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. చూడబోతే కేసీఆర్ సరైన ముహూర్తం పెట్టుకోకుండా థర్డ్ ఫ్రంట్ ప్రకటన చేసినట్లుంది. ఇప్పుడు ఉన్నట్టుండి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కొత్తపాట పాడారు. బీజేపీని ఓడించడానికి కాంగ్రెస్ పార్టీ తమలాంటి ప్రాంతీయ పార్టీలతో కలవాలని ఆమె పిలుపునిచ్చారు. అంటే బీజేపీ-కాంగ్రెసేతర పక్షంలో తాను ఉండబోనని పరోక్షంగా చెప్పేసినట్లే. ఇక ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తొలుత ఒకసారి మద్దతు పలికినట్లు చెప్పినా, ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్‌తోనే పొత్తు ఉండొచ్చని సెలవిచ్చారు. ఇటీవలి కాలంలోనే ఎన్డీయే నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించిన శివసేన లాంటి పార్టీలు ఈయనకు ఎంతవరకు మద్దతిస్తాయో చూడాలి.



సమయమంత్రి చంద్రశేఖర శర్మ

మననం



తెలుగు రాష్ట్రాలు వర్సెస్ కేంద్ర ప్రభుత్వం.. గత రెండు వారాలుగా రాజకీయ వేడి మండే సూర్యుడితో పోటీపడుతోంది. పేరులో చంద్రుడిని పెట్టుకున్న ఇద్దరు ముఖ్యమంత్రులు హాట్‌హాట్ కామెంట్లు చేస్తూ కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారుపై తొడగొడుతున్నారు. దీంతో అసలేం జరుగుతోందో అర్థం కాని పరిస్థితిలో తెలుగు ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు.

ఉరుములేని పిడుగులా ఒక్కసారిగా ఉన్నట్టుండి థర్డ్ ఫ్రంట్ పెడతానంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రకటించారు. వయసు సహకరించకపోయినా తాను జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని, సమాఖ్య వ్యవస్థకు సరికొత్త అర్థం చెబుతానని అన్నారు. దేశానికి ఒక కొత్త ఎజెండాతో దిశానిర్దేశం చేస్తానని; రిజర్వేషన్లు, నదీ జలాల పంపిణీ, ఉపాధి హామీ నిధుల లాంటి విషయాలలో కేంద్ర ప్రభుత్వ పెత్తనం అనవసరమని; అవన్నీ రాష్ట్రానికి సంబంధించిన విషయాలని చెప్పారు. దాదాపు నాలుగేళ్ల పాటు నరేంద్రమోదీ సహా కేంద్ర మంత్రివర్గంలో అందరితో సత్సంబంధాలు కొనసాగించి, తన తనయుడు రామారావును కూడా కేంద్రమంత్రుల వద్దకు పంపుతూ వాళ్ల దగ్గర 'రామ్' మంచి మార్కులు కొట్టేలా తగినంత గ్రూమ్ చేసిన కేసీఆర్ ఉన్నట్టుండి కేవలం ఒక్క రిజర్వేషన్ల కోసమే ఇదంతా చేస్తున్నారా అంటే ఎవరూ నమ్మలేని పరిస్థితి. రాష్ట్రపతి ఎన్నికలు, ఉప రాష్ట్రపతి ఎన్నికల లాంటి సందర్భాలతో పాటు, పెద్దనోట్ల రద్దు నిర్ణయాన్ని కూడా స్వాగతించిన వారిలో అందరికంటే ముందున్న వ్యక్తి కేసీఆర్. అలాంటిది ఇప్పుడు ఉన్నట్టుండి ఆయన జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాలని ఎందుకు అనుకుంటున్నారో, తనతో పాటు ఇంకా మరి కొంతమంది పార్టీ సీనియర్ నాయకులను కూడా ఎంపీలుగా పోటీచేయించి కేంద్రంలోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారో ఎవరూ అర్థం చేసుకోలేకపోతున్నారు. కేసీఆర్‌కు ఈ ఆలోచన రావడం, బయటకు ప్రకటించడం అవ్వగానే మొట్టమొదట స్పందించిన వ్యక్తి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ. ఇందులో లోగుట్టు ఒకటి ఉందని వినిపిస్తోంది. ప్రస్తుతం కేసీఆర్ వద్ద ఉన్నవారిలో అత్యంత సీనియర్, చాపకింద నీరులా ఉంటూనే తెరవెనక పనులన్నింటినీ చక్కబెట్టే సామర్థ్యం ఉన్న వ్యక్తి కేశవరావు. గతంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు పశ్చిమబెంగాల్ వ్యవహారాల ఇన్‌చార్జిగా వ్యవహరించారు. దాంతో ఆయనకు స్వతహాగానే ఆ రాష్ట్రంలో ప్రముఖ నాయకురాలైన మమతా బెనర్జీతో సత్సంబంధాలు ఉండే అవకాశం ఉంటుంది. బహుశా ఆయనే ముందుగా కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ యోచనను దీదీ చెవిలో ఊది ఆమెతో పలికించి ఉండొచ్చని అంటున్నారు. కానీ, చూడబోతే కేసీఆర్ సరైన ముహూర్తం పెట్టుకోకుండా థర్డ్ ఫ్రంట్ ప్రకటన చేసినట్లుంది. ఎందుకంటే, ''తమ్ముడూ.. నువ్వు ఎలా చెబితే అలా'' అన్న దీదీ, ఇప్పుడు ఉన్నట్టుండి కొత్తపాట పాడారు. బీజేపీని ఓడించడానికి కాంగ్రెస్ పార్టీ తమలాంటి ప్రాంతీయ పార్టీలతో కలవాలని ఆమె పిలుపునిచ్చారు. అంటే బీజేపీ-కాంగ్రెసేతర పక్షంలో తాను ఉండబోనని పరోక్షంగా చెప్పేసినట్లే. ఇక ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తొలుత ఒకసారి మద్దతు పలికినట్లు చెప్పినా, ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్‌తోనే పొత్తు ఉండొచ్చని సెలవిచ్చారు. కేసీఆర్ గతంలో కేంద్రమంత్రిగా కూడా పనిచేశారు. ఆ సమయంలో ఆయనకు వివిధ ప్రాంతీయ పార్టీల నాయకులు, జాతీయ నాయకులందరితో మంచి పరిచయాలు ఉన్నాయి. వాళ్లందరినీ కూడగట్టుకుని బీజేపీ, కాంగ్రెసేతర పార్టీలతో మూడోకూటమిని ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. ఇటీవలి కాలంలోనే ఎన్డీయే నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించిన శివసేన లాంటి పార్టీలు ఈయనకు ఎంతవరకు మద్దతిస్తాయో చూడాలి. ఇక తెలంగాణ ముఖ్యమంత్రి చెబుతున్న థర్డ్ ఫ్రంట్‌లో ఎదురుకాబోయే అతిపెద్ద సమస్య- బహునాయకత్వం. కూటమికి ఎవరు నాయకత్వం వహిస్తారు, ఒకవేళ నిజంగా అధికారంలోకి వచ్చేంత మెజారిటీ వస్తే వాళ్లలో ఎవరు ప్రధానమంత్రి పీఠం అధిష్ఠించాలనేది చాలా పెద్ద సమస్య అవుతుంది.

ప్రధాని పదవిపై చాలామందికి ఆశలు

వివిధ రాష్ట్రాలలో చాలామంది సీనియర్ మోస్ట్ నాయకులున్నారు, వాళ్లలో చాలా మందికి ఎర్రకోట మీద జెండా ఎగరేయాలన్న ఆశ ఉంది. ''...అను నేను దేశ ప్రధాన మంత్రిగా'' అని ప్రమాణస్వీకారం ఎప్పుడు చేస్తామా అన్న కోరిక మదిలో మెదులుతూనే ఉంటుంది. ఇంతమంది నాయకుల మధ్య నెగ్గుకురావడం, తన నాయకత్వానికి వాళ్ల ఆమోదం పొందడం చిన్న విషయం కాదు. అందులో తెలంగాణ చంద్రుడు ఎంతవరకు విజయం సాధిస్తారన్నది చూడాలి. ఇక ఆయన తనతోపాటు తన మేనల్లుడు హరీశ్‌రావు, ఆర్థికమంత్రిగా బాధ్యతలు మోస్తూనే చాలా లో ప్రొఫైల్‌లో ఉండే తన కుడిభుజం లాంటి ఈటల రాజేందర్, సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు.. ఇలాంటి కొందరు గట్టి నాయకులను కూడా జాతీయ రాజకీయాల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నారని వినిపిస్తోంది. ఇప్పటికే ఆయన కుమార్తె కవిత నిజామాబాద్ ఎంపీగా పార్లమెంటులో మంచిపేరు సాధించారు. ఇక ఇప్పుడు తన సైన్యంలోని ప్రధాన బలగాన్నంతటినీ అక్కడకు తీసుకెళ్తానంటున్న కేసీఆర్.. ఏదో పెద్ద ప్లానే వేస్తున్నట్లు కనపడుతోంది. ఇప్పటికే పలురంగాల ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు, ఇపుడున్న అధికారులతో కూడా ఆయన మంతనాలు మొదలుపెట్టారు.

మళ్లీ రెండుకళ్ల సిద్ధాంతం

ఇక తెలుగుదేశం పార్టీ జాతీయాధ్యక్షుడు, ప్రధాని నరేంద్రమోదీ కంటే... ఇంకా ఆ మాటకొస్తే దేశ రాజకీయాల్లోనే అత్యంత సీనియర్ నాయకుడిగా చెప్పుకొంటున్న చంద్రబాబు నాయుడిది మరో కథ. నాలుగేళ్ల పాటు బీజేపీతో భుజాలు కలిపి పయనించి, వాళ్లు హోదా ఇవ్వం మొర్రో అని మొదటి నుంచి చెబుతున్నా ఏదో దింపుడు కల్లం ఆశతో ఇన్నాళ్లూ ఉండి ఇప్పుడు తాజాగా సగం విడాకులు తీసుకున్నారాయన. సగం విడాకులు అని ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే, కేంద్ర మంత్రివర్గంలో ఉన్న తన ఇద్దరు మంత్రులతో రాజీనామాలు అయితే చేయించారు గానీ, ఇంకా ఎన్డీయే నుంచి పూర్తిస్థాయిలో వైదొలగలేదు. స్వయంగా తాను కూడా ఎన్డీయే కన్వీనర్‌గానే ఉంటున్నారు. ఇలా రెండు పడవల మీద కాళ్లేయడం ఎందుకో అర్థం కావట్లేదు. ప్రత్యేక హోదా, రాష్ట్రాభివృద్ధి ఈ రెండూ తనకు 'రెండు కళ్లు' అని చంద్రబాబు చెప్పగానే చాలామందికి రాష్ట్ర విభజన సమయం నాటి డైలాగు మరోసారి గుర్తుకొచ్చింది. అప్పట్లో కూడా ఆయన తనకు తెలంగాణ, ఆంధ్ర రెండు కళ్లని, వాటిలో ఏది వదులుకుంటావని అడిగితే ఏం చెప్పాలని అన్నారు. విభజనను సమర్థిస్తారా, వ్యతిరేకిస్తారా అన్న ప్రశ్నకు ఆయనతో సమాధానం చెప్పించాలని జాతీయ మీడియాకు చెందిన సీనియర్ జర్నలిస్టులు తలకిందులుగా తపస్సు చేసినా సాధ్యం కాలేదు. తనకు రెండు ప్రాంతాలూ ముఖ్యమేనని ఆయన అప్పట్లో చెప్పారు. ఇప్పుడు మరోసారి ఆయన రెండుకళ్ల సిద్ధాంతం తెరమీదకు వచ్చింది. 29 సార్లు ఢిల్లీ వెళ్లి వచ్చి దాదాపు నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వంలో తన పార్టీని భాగస్వామిగా ఉంచిన తర్వాత మరో ఏడాది లోపే ఎన్నికలు ముంచుకొస్తున్నాయనగా ఇప్పుడే బీజేపీ సర్కారు ప్రత్యేక హోదా ఇవ్వడం లేదన్న విషయం ఆయనకు అర్థమైంది. కేంద్రాన్ని గట్టిగా అడగాలని, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ప్రతిపక్షాలే కాదు, సొంత పార్టీలోని సీనియర్ నాయకులు ఎన్నిసార్లు ఎంత గట్టిగా చెప్పినా పట్టించుకోని చంద్రబాబు, ఉన్నట్టుండి జైట్లీ ప్రెస్ మీట్ పెట్టిన తర్వాత అదే రోజు రాత్రి 10.45 గంటల వరకు ఎంపీలు, మంత్రులు, ముఖ్యనేతలందరితో పలు దఫాలుగా చర్చించి అప్పుడు తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఆయన మాటకు విలువనిచ్చి తమ పదవులను వదులుకున్న కేంద్ర మంత్రులిద్దరిలో చూడగానే పెద్దమనిషి, చాలా గౌరవం ఇవ్వాలనిపించే వ్యక్తి అశోక్ గజపతిరాజు. పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉండి కూడా సాధారణ ప్రయాణికుల్లాగే క్యూలైన్లో వచ్చి, చెకిన్ చేసి ఎకానమీ క్లాసులో ప్రయాణించే వ్యక్తి ఆయన. సాధారణంగా అవతలి వ్యక్తిని 'దద్దమ్మ' అనాలంటే కూడా అదేదో బాగా పెద్దతిట్టుగా భావించే వ్యక్తి. అలాంటి రాజుగారు కూడా పార్లమెంటులో సహచర ఎంపీలతో కలిసి ప్రత్యేక హోదా కోసం నిలబడి నినదించారు.

> ఉన్నట్టుండి జైట్లీ ప్రెస్ మీట్ పెట్టిన తర్వాత అదే రోజు రాత్రి 10.45 గంటల వరకు ఎంపీలు, మంత్రులు, ముఖ్యనేతలందరితో పలు దఫాలుగా చర్చించి అప్పుడు చంద్రబాబు తన నిర్ణయాన్ని ప్రకటించారు. కేంద్ర మంత్రివర్గం నుంచి బయటకు వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు ఏంచేస్తారన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. ఆయన కూడా తోటి తెలుగు ముఖ్యమంత్రిలాగే జాతీయ రాజకీయాల్లోకి వెళ్తారా... థర్డ్ ఫ్రంట్‌కు మద్దతితస్తారా అన్న విషయంలో ఇంతవరకు ఎక్కడా బయటపడలేదు. 2050 నాటికి రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలబెడతానని ఆయన అంటున్నారు. కాబట్టి అప్పటివరకు రాష్ట్ర రాజకీయాల్లో ఉండి దిశానిర్దేశం చేయాల్సిందే. అందువల్ల లెక్క ప్రకారం చూసుకుంటే మాత్రం చంద్రబాబు నాయుడు జాతీయ రాజకీయాల దిశగా ఆలోచన చేసేలా లేరు.

తరువాత అడుగు ఎటు?

కేంద్రమంత్రివర్గం నుంచి బయటకు వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు ఏంచేస్తారన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. ఆయన కూడా తోటి తెలుగు ముఖ్యమంత్రిలాగే జాతీయ రాజకీయాల్లోకి వెళ్తారా... థర్డ్ ఫ్రంట్‌కు మద్దతిస్తారా అన్న విషయంలో ఇంతవరకు ఎక్కడా బయటపడలేదు. ఒకవేళ ఆయన జాతీయ రాజకీయాల్లోకి వెళ్తే అందరికంటే సీనియర్‌ను తానే అని ఎటూ అనుకుంటున్నారు కాబట్టి ప్రధానమంత్రి కంటే తక్కువ పదవి ఏదైనా ఆయన తీసుకోరు గాక తీసుకోరు. కానీ, ఒకవైపు అమరావతి లాంటి అద్భుతమైన రాజధాని నిర్మాణం, పెండింగులోనే ఉన్న బోలెడన్ని ప్రాజెక్టులు, సాగునీటి సంకల్పం, విజయవాడ, విశాఖపట్నం మెట్రోరైళ్లు.. ఇలా ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి కాబట్టి అసలు రాష్ట్రాన్ని వదిలిపెట్టి జాతీయ రాజకీయాల్లోకి చంద్రబాబు వెళ్తారా అన్నది అనుమానమే. 2050 నాటికి రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలబెడతానని ఆయన అంటున్నారు. కాబట్టి అప్పటివరకు రాష్ట్ర రాజకీయాల్లో ఉండి దిశానిర్దేశం చేయాల్సిందే. అందువల్ల లెక్క ప్రకారం చూసుకుంటే మాత్రం చంద్రబాబు నాయుడు జాతీయ రాజకీయాల దిశగా ఆలోచన చేసేలా లేరు. తన తనయుడు లోకేశ్‌ను కూడా అటు పంపే ఉద్దేశం ఆయనకు ఉన్నట్లు ఎక్కడా ఇప్పటివరకు వినిపించ లేదు. కొత్త పొత్తుల గురించి ఏమైనా ఆలోచిస్తారా.. లేదా సొంతంగానే ఎన్నికల బరిలోకి దిగుతారా అనేది మాత్రం చూడాల్సి ఉంది.

దర్శనం

అలగ్జాండ్రియా అద్వితీయ విజ్ఞానసేవ!

ధనాన్ని దోచుకోవచ్చు; ఆస్తుల్ని దోచుకోవచ్చు; కానీ విద్యను మాత్రం ఎవరూ దోచుకోలేరు. ఆస్తులు శత్రువులను తెచ్చిపెడితే, విద్య మిత్రులను సంపాదించి పెడుతుంది. నేటి విద్యార్థులు జ్ఞానసముపార్జనకు కేవలం ఇంటర్‌నెట్, వాట్స్‌అప్‌ల మీదే ఆధారపడుతున్నారు. అలా కేవలం వాటిపైనే కాకుండా వారికి తమ విద్యాసంస్థల్లో గ్రంథాలయాలను ఏర్పాటుచేయడం ద్వారా వారిని నడిపిస్తే అపార జ్ఞానసంపద వారి సొంతమవుతుంది. ఇందుకు వారికి ఆయా విద్యాసంస్థల సహకారం కూడా అవసరం. శాస్త్రీయ దృక్పథంతో కూడిన అధ్యయనం మేధోసంపత్తిని పెంచుతుంది. నూతన జ్ఞాన ఆవిష్కరణలు జరగాలంటే విజ్ఞాన సముద్రంలో ఈదవలసిందే! మనకంటే ముందుతరం జ్ఞానవంతుల భుజాలపై మనం ఉన్నాం. వారు మనకు అందించిన జ్ఞానాన్ని అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణలకు ముందడుగువేస్తే భవిష్యత్ తరాల వారికి మన ద్వారా మరింత విజ్ఞానం అందించగలం. అయితే, ఇక్కడ మనం గమనించాల్సిన అంశం ఒకటి ఉంది. మనం నేర్చుకునే, అధ్యయనం చేసే విజ్ఞానమంతా కొంతమంది కార్పొరేట్ శక్తుల చేతుల్లో బందీ అయివుంది. ఎన్నో శాస్త్రీయ సంబంధమైన అధ్యయనాలను తన గుప్పెట్లో పెట్టుకుని ఉంది బ్రిటన్‌కు చెందిన రీడ్ ఎల్సెవీర్ కంపెనీ. ప్రపంచవ్యాప్తంగా శాస్త్రజ్ఞులు రూపొందించిన అధ్యయనాలను తన ఆధీనంలో ఉంచుకుని వాటికి తానే యజమానిలా వ్యవహరిస్తోంది. గతంలో భారత్‌ను బానిసత్వ పాలనలో ముంచెత్తడానికి కారణమైన ఈస్ట్ ఇండియా కంపెనీలా ఈ ఎల్సెవీర్ కంపెనీ కూడా ప్రపంచ శాస్త్రవేత్తల కృషిఫలితంగా సముపార్జించిన అధ్యయనాలతో వ్యాపారం చేస్తూ 2016లో 6,895 బిలియన్ల (అక్షరాలా 62,000 కోట్ల రూపాయలు) జీబీపీని సంపాదించింది. శాస్త్రీయ అధ్యయనాల ప్రచురణల ద్వారా చేసిన వ్యాపారంలో 39 శాతం లాభాలార్జించింది. ఈ కంపెనీ శాస్త్రీయ రంగంలోనే కాకుండా ఆరోగ్య, సాంస్కృతిక రంగాల్లో అధ్యయనాలను కూడా సేకరిస్తుంది.లాభాపేక్షలేని సంస్థ క్రాస్‌రెఫ్ అంచనాల ప్రకారం, ప్రస్తుతం 94,841,081 మేధో పరిష్కృత అధ్యయనాలు అందుబాటులో ఉన్నాయి. అమెరికన్ మెడికల్ అసోసియేషన్, ఇండియన్ జర్నల్ ఆఫ్ సైంటిఫిక్ రీసెర్చ్ వంటి మొత్తం సుమారు 56,726 జర్నల్స్ అందుబాటులో ఉన్నాయి. మేధో సంపత్తి విజ్ఞాన అధ్యయనాలు సంపాదించాలంటే ఎంతో ఖర్చుతో కూడుకుని ఉన్నాయి. ఉదాహరణకు ఒక్కొక్క పేపర్ విలువ 1,941 రూపాయల (30 అమెరికన్ డాలర్లు) ఉంటుంది. ఇంత ధరపెట్టి సంపాదించినా వాటి వినియోగానికి పరిమితులుంటాయి. 2011లో కజికిస్థాన్‌కు చెందిన అలెగ్జాండ్రా ఎల్‌బక్యాన్ అనే డిగ్రీ విద్యార్థిని తనకు అవసరమైన ముఖ్య అధ్యయనాలను సంపాదించలేకపోయింది. దాంతో తీవ్ర నిరాశ చెందిన ఆమె, ఎస్‌సీఐ-హబ్ అనే వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా 67 మిలియన్ల జర్నల్ ఆర్టికల్స్‌ను సేకరించింది. ఈ వెబ్‌సైట్ ద్వారా సేకరించిన అధ్యయనాలన్నీ కానీ ఖర్చులేకుండా అవసరమైనవారు వినియోగించుకునే అవకాశం కల్పించింది. ఈ వెబ్‌సైట్‌ను భారతీయులు ఎక్కువగా వినియోగించుకుంటారు.



13,143,462 మంది విద్యార్థులు ఈ వెబ్‌సైట్‌ను తరచుగా ఉపయోగించుకుంటారు. బ్రె జిల్, ఇరాన్, ఇండోనేసియా, రష్యాకు చెందినవారు కూడా తరచూ ఈ వెబ్‌సైట్‌ను వినియోగించుకుంటున్నారు. విజ్ఞాన సంబంధమైన అధ్యయనాల పై తమకు సంపూర్ణ కాపీరైట్లున్నాయంటూ పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలు తమ లాయర్లను తీసుకుని అలెగ్జాండ్రా ఎల్‌బక్యాన్‌ను సంప్రదించాయి. అమెరికా కోర్టుల్లో ఆమెపై ఎన్నో మిలియన్ డాలర్లకు కేసులు వేసి, కోర్టుల నుంచి నష్టపరిహారం ఉత్తర్వులతో ఎల్‌బక్యాన్ కోసం వెతకడం మొదలెట్టాయి. అప్పటికే ఆమె అజ్ఞాతం లోకి వెళ్లిపోయారు అయినప్పటికీ వెబ్‌సైట్ కార్యకలాపాలు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయి. అంటే అరచేతిని అడ్డుపెట్టి సూర్యోదయా న్ని ఎలా ఆపలేమో విజ్ఞానాన్ని గుప్పెట్లో పెట్టుకునే ప్రయత్నాలు ఫలించవు.

◆ తాడేపల్లి శివరామకృష్ణారావు

ఉద్యమంతోనే అవినీతికి కట్టడి

లంచగొండితనం దంపతుల ప్రాణాలను బలితీసుకుంది. అభంశుభం తెలియని ఇద్దరు పిల్లలను అనాథలను చేసింది. దేవు డు వరమిచ్చినా పూజారి కనికరించలేదన్న చందంగా ఆ రైతన్నకు కార్పొరేషన్ నుంచి రుణం మంజూరు అయినా, రెవెన్యూ కార్యాలయ లంచగొండి అధికారి అడ్డుతగిలాడు. నేను లంచం ఇచ్చుకోలేను సారు అని మొరపెట్టుకున్నా కనికరించలేదు. ఓ వైపు లంచం ఇవ్వనందుకు రుణం ఆగిపోయింది. మరో వైపు అప్పుల భారం పెరిగిపోయింది. చివరికి అవినీతి అన్నదాత ప్రాణాన్ని బలిగొంది. మంచిర్యాలలో జరిగిన ఈ ఘటనలో ఆ రైతు భార్య, పిల్లలకు విషమిచ్చి తనూ ఆత్మహత్య చేసుకున్నాడు. పిల్లలిద్దరూ అదృష్టవశాత్తూ బతికి బయటపడ్డారు. ఈ అవినీతి సమాజంలో అనాథలుగా బతకడం అదృష్టమెలా అవుతుందని ఆ పిల్లలు మైనంగా ప్రశ్నిస్తున్నారు.

ఈ దేశంలో అవినీతి వ్యవస్థీకృతం కాబడిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అవినీతి అంతం మా పంతం అంటూ ప్రధానులు, ముఖ్యమంత్రులు పెద్దపెద్ద మాటలు చెప్పడమే తప్ప, ఆచరణలో చిత్తశుద్ధి చూపిందిలేదు. అసలు అవినీతి మంత్రులులేని ప్రభుత్వాలు ఈ దేశంలో ఉన్నాయా అనేది పాలకులు తమను తాము ప్రశ్నించుకోవాలి. వేలకోట్ల బ్యాంకు కుంభకోణాలు కళ్లముందు కదలాడుతుంటే తప్పు మీ హయాంలో జరిగిందంటే, లేదు మీ హయాంలోనే అంటూ ప్రభుత్వ, ప్రతిపక్షాలు ఆరోపణలు గుప్పించుకోవడం, ప్రజలను మభ్యపెట్టడం మినహా, ఆ అవినీతి దొంగలను శిక్షించిన దాఖలాలు ఉన్నాయా? అన్నది ఈ దేశ ప్రజలు ప్రశ్నించుకోవాలి. ఒక సినిమాలో చెప్పినట్టు గుండుపిన్ను నుంచి రాఫెల్ విమానాల కొనుగోలు వర కూ ప్రతిదాంట్లో అవినీతి.. లంచం.. క్విడ్‌ప్రోకో. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ అనే సంస్థ ప్రపంచవ్యాప్తంగా 180 దేశాల్లో అవినీతిపై చేసిన సర్వేలోనూ ఇదే వెల్లడైంది. భారతదేశంలో లంచగొండితనం ఏ మాత్రమూ తగ్గలేదని ఆ సంస్థ నివేదికలో పేర్కొంది. అవినీతి నిర్మూలనలో 40 మార్కులతో భారత్ బార్డర్ పాస్ మాత్రమే అయిందనేది ఆ నివేదిక సారాంశం. పక్కదేశం చైనా, మన ఆర్థికసాయం పొందుతున్న భూటాన్ కంటే కూడా మన దేశంలో అవినీతి ఎక్కువ ఉండడం సిగ్గుపడాల్సిన విషయం. పాలకులు మాత్రమేకాదు, మౌనంగా ఉంటూ లంచగొండులకు ఊతమిస్తున్న ఈ దేశ పౌరులు కూడా సిగ్గుపడాలి.




పాలకులు ఎలాగూ సిగ్గుపడరు. ఎందుకంటే వాళ్లకు కావాల్సింది అధికారం. అధికారాన్ని తెచ్చిపెట్టేది డబ్బు మాత్రమే. అవినీతికి పాల్పడకుండా అనతికాలంలో లక్షల కోట్లలో డబ్బు రాదు. డబ్బు లేకపోతే ఈ ధనస్వామ్యంలో అధికారం చేజిక్కదు. ఎటు తిరిగి సిగ్గు పడాల్సింది మనమే. ఎన్నికల సమయంలో డబ్బులు తీసుకుంటున్నందుకు, మద్యానికి జై కొడుతున్నందుకూ సిగ్గుపడాలి. బర్త్ సర్టిఫికెట్ నుంచి డెత్ సర్టిఫికెట్ వరకూ లంచమిచ్చి తెచ్చుకుంటున్నందుకు సిగ్గుపడాలి. లంచమడిగిన అధికారులను నిలదీయకుండా ఉంటున్నందుకు సిగ్గుపడాలి. తోటి అధికారి లంచాల కోసం ప్రజలను పీడిస్తుంటే చూస్తూ మిన్నకుండిపోతున్న ప్రభుత్వ అధికారి సిగ్గుపడాలి. పాలకులు తప్పుచేస్తున్నా బయటపెట్టని సివిల్ సర్వీస్ అధికారులు సిగ్గుపడాలి. ఈ దేశం నుంచి అవినీతిని తరిమేందుకు ఆ సిగ్గులోంచి ఓ ఉద్యమం ఊపిరోసుకోవాలి. తెలంగాణ ఉద్యమం కంటే పదిరెట్ల పెద్ద ఉద్యమం ఈ దేశంలో సాగాలి. పాలకుల గుండెల్లో గుబులు పుట్టాలి. తమ అవినీతికి అనుగుణంగా రాజకీయ అవినీతిపరులు నిబంధనలు మా ర్చుకునే ధోరణి మారాలి. కఠినమైన చట్టాలు రావాలి. అవినీతి ఆరోపణలు వస్తే ప్రధానినైనా సరే ప్రశ్నించే వ్యవస్థ రావాలి. అలాంటి వ్యవస్థ రావాలంటే అన్నా హజారే అనే పెద్దాయన చెబుతున్న పటిష్టమైన లోక్‌పాల్ వ్యవస్థ ఈ దేశంలో ఉండాలి. ఇదంతా జరగాలంటే ఈనాటి నుంచే నువ్వు ఉద్యమించాలి. మార్పు మనతోనే మొదలవ్వాలి. ఇది అవినీతి సమాజం కాదు, మీరు అదృష్టవంతులేనని ఆ పిల్లలిద్దరికీ గర్వంగా సమాధానం చెప్పుకునే ఓ రోజు రావాలి.

◆ డేగ కుమార్

ఆదివాసీ ధ్రువతార

భారత తొలి స్వాతంత్ర్య సంగ్రామం నుంచి జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న భూమి పుత్రులను బ్రిటిష్ పాలకులు బలితీసుకున్నారు. కొందరిని బానిసలుగా, పీడితులుగా మార్చారు. రాజ్యదురాక్రమణదారులైన తెల్లదొరలు ఆదివాసులపై కుట్రలు, కుతంత్రాలతో యుద్ధం ప్రకటిస్తూ తాంతీయా భీల్, రాణి దుర్గావతి, రాణి మా గైడిన్ల్యూ, బిర్సాముండా, రాంజీ గోండ్ మొదలైన ఆదివాసీ యోధులను బలిగొన్నారు. మధ్య భారతదేశంలో క్రీ.శ. 1240-1749 మధ్య మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఏర్పడిన ఆదివాసీ గోండ్వానా రాజ్యంలో రాజులుగా వెలుగొందిన గోండు గిరిజన పాలకులకు, జమీన్‌దారులను, మోకాసాలను బలిగొన్నారు. గోండ్వానా సమర శీలురలో పులిలాంటి యోధుడు పులిసూర్ బాబురావ్ సెడ్మాకీ. గోండ్వానా రాజ్యంలో సెడ్మాకీ 'ఆదియోధుడు'. గోండ్వానా ప్రాంతమైన చంద్రాపూర్ (మహారాష్ట్ర)లోని గోండులు సెడ్మాకీ ఆధ్వర్యంలో తిరుగు బాటు (1856-58), మరోవైపు ఆదిలాబాద్ సరిహద్దుల్లో మార్సికోల్ల రాంజీగోండ్ బ్రిటిష్ సైన్యాలపై రోహిల్లాలు, గోండుల తిరుగుబాటు (1857-60) ఉద్విగ్నంగా జరిగింది. భారత స్వాతంత్ర్య సమరంలో ఆరి పోతున్న దీపాలను వెలిగిస్తున్నట్లు నేలకొరిగిన వీరుని స్థానంలో మరొక రిని ఎదిగేలా చేసి తెల్లదొరతనంపై ఎదురుదాడికి సిద్ధం చేశాడు. ఎన్నో సవాళ్ళను, ప్రతిబంధకాలను ఎదుర్కొంటూ గోండ్వానా రాజ్య సంరక్షణ సమరానికి నాయకత్వం వహించిన గోండ్వాన వీరుడు సెడ్మాకీ. గోండ్వానాలో అంతర్భాగమైన మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా గోండి గ్రామంలో జమీందార్ కుటుంబంలో 1833, మార్చి 12న జన్మిం చిన సెడ్మాకీ బాల్యం నుంచే అస్త్ర, శస్త్రవిద్యల్లో నైపుణ్యం సాధించి 28 ఏళ్ళకు జమీందారీ వారసుడిగా బాధ్యతలు తీసుకున్నాడు. దురాక్రమణ, దుశ్చర్యల నుంచి గోండ్వానా రాజ్యరక్షణకు ప్రతిజ్ఞ చేశాడు. తెల్లదొరల ఆకృ త్యాలను, వారి దాడులను తిప్పికొట్టడానికి కోయత్తోరులను, మరాఠీలు, ముస్లింలను కూడా ఏకం చేసి, తన సైన్యంతో తెల్లదొరలపై తొలిసారి 1858, మార్చి 22న యుద్ధం ప్రకటించాడు. ఆ యుద్ధంలో బ్రిటిష్ సైన్యాన్ని సెడ్మాకీ ఓడించాడు. బ్రిటిష్ కెప్టెన్ క్రికటన్ సారథ్యంలో సిగ్నాపూర్ పరిసరాలలో గోండులపై దండెత్తినా పరాజయం తప్పలేదు. పైగా చంద్రాపూర్ వైపు పారిపోయి తలదాచుకున్నారు. బ్రిటిష్ బలగాలను సెడ్మాకీని ఓడించడానికి బ్రిటిష్ సైన్యాధిపతి నెక్స్‌ఫియార్‌ను గోండుసైన్యాలు సంప్రదాయక ఆయుధాలతోనే ఎదుర్కొని ఓడించారు. యుద్ధంలో పరాజయాన్ని జీర్ణించుకోలేని బ్రిటి ష్ ప్రభుత్వం సెడ్మాకిని కొరియర్ ద్వారా నిర్బంధించడానికి ప్రణాళికలు చేసింది. క్రికటన్, నెక్స్పి యార్‌లు సెడ్మాకీని పట్టించిన వారికి కానుకగా జమీందారీగా నియమిస్తామని ప్రకటించారు. తనకు ఆమోదీ రాజపుత్రిక లక్ష్మీబాయి నమ్మినబంటు కావడంతో రక్షణార్థం ఆమె వద్దకు తరచూ వెళ్ళేవాడు. ఆమె సెడ్మాకీ పోరాట పటిమను ప్రశంసిస్తూ, తనవద్ద విశ్రాంతి తీసుకోవాలని కోరింది. నమ్మక ద్రోహంతో సైన్యానికి సమాచారం తెలపడంతో రాత్రికిరాత్రే నిద్రలోని సెడ్మాకీని బంధించి చంద్రాపూ ర్ తరలించారు. తెల్లదొరల కబంధ హస్తాల్లో 1858 అక్టోబర్ 21న ఉరితీయబడిన బాబురావ్ సెడ్మాకీ అజరామరుడు. స్వతంత్ర సంగ్రామంలో గోండ్వానా రాజ్యపరిరక్షణకు, గోండ్వానా స్వయంపాలనకు కృషిచేశాడు. సెడ్మాకీ ప్రపంచ ఆదివాసీల పోరాట చరిత్రలో ధ్రువతార. సెడ్మాకీ గోండ్వానా రాజ్య కోటలు నేటికీ చంద్రాపూర్‌లో దర్శనమిస్తాయి. సెడ్మాకీ నుంచి తెలంగాణలో కుమ్రంభీం దాకా ఆది వాసీలు తమ పోరాట వారసత్వాన్ని కొనసాగించిన యోధులు. స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్ళయినా ఆదివాసీలు తమ అస్థిత్వ, ఆత్మగౌరవ పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తూ జల్- జంగల్ -జమీన్ కోసం, స్వయంపాలనాధికారాల కోసం ఎదురు చూడటం తప్ప ఆదివాసీలకు వేరే గత్యంతరం లేదేమో!



◆ గుమ్మడి లక్ష్మీనారాయణ

ఆదివాసీ రచయితల సంఘం వ్యవస్థాపక కార్యదర్శి

(మార్చి 12న వీరబాబురావ్ సెడ్మాకీ జయంతి)





సినిమా అంటే కలల ప్రపంచం.. ఈ కలలను కళలతో వెండి తెరపై ఆవిష్కరించడంలో ముందుండే సాంకేతిక నిపుణుడే ప్రొడక్షన్ డిజైనర్. లార్జర్ దేన్ లైఫ్ సినిమాలను ఆవిష్కరించడం ఊహించనంత సులువు కాదు. అలాంటి కష్టతరమైన గురుతర బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారు మోనిక, రామకృష్ణ సబ్బాని. ఆర్ట్‌పై ఆసక్తితో రంగంలోకి అడుగు పెట్టి.. తాము మాట్లాడటం కాదు.. తమ సినిమాలే మాట్లాడుతాయంటున్నారు. త్వరలోనే 'రంగస్థలం' సినిమాతో 1985 గ్రామ వాతావరణాన్ని మన ముందు ఆవిష్కరించబోతున్న వీరి గురించి మనం ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ...

ప్రతిరోజూ కొత్తగా కష్టపడడానికి ఇష్టపడతాం

- రామకృష్ణ సబ్బాని

మనం ఎక్స్‌క్లూజివ్

సుకుమార్ సారీ!!



'రంగస్థలం' సినిమా కోసం మేం సుకుమార్‌గారిని కలవాల్సి వచ్చింది. ఆయన బిజీ షెడ్యూల్స్ వల్ల నాలుగైదు సార్లు మీటింగ్స్ క్యాన్సిల్ అయ్యాయి. ఒకరోజు స్టోరీ నెరేట్ చేశారు. ఇది డిసెంబర్‌లో జరిగింది. జనవరిలో నేను వెళ్లి 'సార్.. నాకు బాబు పుట్టాడు' అని చెప్పా. 'మీ వైఫ్ ప్రెగ్నెంటా!' అని అడిగారు. 'అవునండీ' అని అన్నా. 'సారీ అండీ.. నాకు ఆ విషయం తెలియను కూడా తెలియదు. తను ప్రెగ్నెంట్ అని తెలియక నేను అన్నిసార్లు వెయిట్ చేయించాను. సారీ' అని అన్నారు. ఇప్పటికీ తొమ్మిదో నెల్లో కూడా వర్క్ చేసిందని ఆయన ఎన్నిసార్లు చెప్తారో. ఆయనే కాదు.. మేం ముంబైలో పనిచేసినప్పుడు కూడా మోనికకు చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. ఇప్పుడు కూడా చాలా మంది 'సెట్లో మోనికా మేడమ్ కంపల్సరీగా ఉండాలి' అని అంటుంటారు.

డోంట్ అండర్ ఎస్టిమేట్ ద తెలుగు ఇండస్ట్రీ బాస్



'సవ్యసాచి'లో మాధవన్‌గారు ముఖ్య పాత్ర చేస్తున్నారు. ఆయన పాత్ర అందులో చాలా డిఫరెట్ పాత్ర. ఆయన చాలా విషయాల్లో పర్టిక్యులర్‌గా ఉంటారు. సినిమాలో ఓ హౌస్ సెట్ వేశాం. ఆయన సెట్ గురించి చాలా పర్టిక్యులర్‌గా ఉన్నారన్నమాట. ఆయన అంత పెద్ద ఆర్టిస్ట్ అనగానే నిర్మాతలు కూడా మాధవన్‌గారి గురించి మాతో చెప్పారు. మేం సెట్ వేశాం. ఫస్ట్ డే ఆయన సెట్లోకి వచ్చి 'ఫ్యాబులస్ వేరీస్ ద ఆర్ట్ డైరక్టర్' అని పిలిచి హగ్ చేసుకున్నారు. 'నెక్స్ నా ప్రొడక్షన్‌లో చేయబోయే సినిమాకు మీరే చేయాలి' అని కమిట్‌మెంట్ తీసుకున్నారు. మాధవన్‌గారు బాలీవుడ్‌లో యష్‌రాజ్ సినిమా కూడా చేస్తున్నారు. వాళ్లు ఏదో సెట్ ఇమేజ్ చూపించినట్టున్నారు. చూపించగానే ఈయన మా సెట్‌ని చూపించారట. వెంటనే వాళ్లు 'దక్షిణాదిన ఇంత మంచి సెట్లు వేసేవాళ్లున్నారా?' అని అన్నారట. 'డోంట్ అండర్ ఎస్టిమేట్ ద తెలుగు ఇండస్ట్రీ బాస్' అని మాధవన్‌గారు మా గురించి చెప్పారట. అంత పెద్ద నటుడు మా గురించి చెప్పడం గ్రేట్‌గా అనిపించింది.

నిజంగా సాహసమే



'సాహసం' ట్రెజర్ హంట్ సినిమా. ఆ స్క్రిప్ట్ లో నేచురల్‌గా చేసే లొకేషన్స్ ఏమీ లేవు. ప్రతిదీ రీ క్రియేట్ చేసి చేయాల్సిందే. అందులో వచ్చే చాంబర్ అయినా, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ అయినా, పాకిస్తాన్ అయినా... హైదరాబాద్ సెట్స్ అయినా అన్నీ రీక్రియేట్ చేసిందే. లడఖ్ వెళ్లి అక్కడ పాకిస్తాన్ సెట్స్‌ని రీ క్రియేట్ చేశాం. అక్కడే షూట్ చేశాం. అది ఫుల్ చాలెంజింగ్ వర్క్. పాకిస్తాన్ సెట్‌లో వెహికల్ సహా ప్రతిదీ క్రియేట్ చేయాలి. ప్లానింగ్ ప్రకారం చాలా జాగ్రత్తగా చేశాం. చందుగారు నాకు ముందే చెప్పింది ఏంటంటే.. 'సీజీకి చాలా స్కోప్ ఉంది. కానీ సీజీకి వెళ్లడం లేదు. అందువల్ల మాన్యువల్‌గా చేద్దాం' అన్నారు. నేను కూడా మాన్యువల్‌గా వెళ్దామని ఫిక్స్ అయ్యారు. చిన్న బడ్జెట్‌లోనే సినిమాకి 13-14 సెట్స్ చేశాం. అందులో బాక్స్ లాక్ ఓపెన్ చేయడం వంటిదంతా మాన్యువల్. అలా ప్రతి చిన్న వస్తువును క్రియేట్ చేశాం. మేం చేసిన మెకానికల్ థింగ్స్ అన్నీ సీజీ వర్క్ అని అనుకున్నారు. కానీ అంతా మెకానికల్‌గా మేం మాన్యువల్‌గా, సొంతంగా చేసినవే. ఇంకోటి ఏంటంటే.. ఇలాంటివాటిలో చాలా ఇన్వాల్వ్ అయి చేస్తాం. ఓ రకంగా ఆర్ట్ వర్క్‌లో సాహసమే చేశామనాలి.



'రంగస్థలం' చూడాల్సిందే..

గోదావరి అందాలతో కూడిన పాపి కొండలను చూడాలంటే 'రంగస్థలం' చూడాల్సిందే. ఈసినిమా తర్వాత మేం ఆ సినిమాను తీసిన పల్లెటూర్లు, పాపికొండల్లో కొన్ని ప్రాంతాలు పోలవరం ప్రాజెక్ట్ కారణంగా ఇకపై కనిపించకపోవచ్చు. రాబోయే తరాలకు గోదావరి అందమంటే ఇది అని 'రంగస్థలం' సినిమా చూపించి చెప్పుకోవచ్చు.









నేపథ్యం


నేను హైదరాబాద్‌లో పుట్టి పెరిగాను. ఇక్కడే బీఎఫ్ఏ (బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్) చదువుకున్నాను. నా శ్రీమతి మోనిక ఢిల్లీ అమ్మాయి. తను ఆర్కిటెక్ట్, ఇంటీరియర్ చేశారు. పూణే ఇన్‌స్టిట్యూట్‌లో ఇద్దరం ప్రొడక్షన్ డిజైనింగ్ అండ్ ఆర్ట్ డైరక్షన్ కోర్సు చేశాం. సాబుసిరిల్, సమీర్ చంద్ వద్ద పనిచేశాం. హిందీ సినిమాలు, యాడ్ ఫిలింస్‌కు పని చేశాం. మేం డిప్లొమాలో చేసిన ఫిలింస్‌కి నేషనల్, ఇంటర్నేషనల్ అవార్డ్స్ వచ్చాయి. 'అందాల రాక్షసి' సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చాం.

ఆ ఆలోచన అలా వచ్చిందే....

'అందాల రాక్షసి' స్టోరీని హను నెరేట్ చేసిన తర్వాత తను ముందుగా ..అందులోని సూర్య క్యారెక్టర్ పెయింటర్ అని అన్నాడు. కానీ నిజానికి పెయింటింగ్ చేసే హీరోలను మనం చాలా సినిమాల్లో చూశాం. అదీ కాకుండా హీరో క్యారెక్టర్ రఫ్‌గా ఉంది. అందువల్ల సినిమాలో ఏదైనా ఇన్‌స్టాలేషన్ ఆర్ట్ పెడితే బావుంటుంది అని అన్నా. ఈ డిస్కషన్ అయిన తర్వాత అతనికి నా వర్క్ మొత్తం చూపించాను. పైకి రఫ్‌గా కనిపించినా, లోపల సాఫ్ట్ నేచర్ ఉన్న హీరోని చూపించాలనుకున్నాం. అప్పుడు బాటిల్స్‌తో 22 అడుగుల బొమ్మను 22వేల బాటిల్స్‌తో చేశాం. ఐ బాల్‌కూడా బాటిలే ఉంటుంది. అందు కోసం చిన్న మెడిసన్ బాటిల్‌ని కూడా వాడాం. ఫస్ట్ టైమ్ షూటింగ్‌లో హడావిడి కారణంగా అది పడిపోయింది. టైమ్ లేదులే వద్దని అని అందరూ అన్నారు. కానీ నేను మళ్లీ 10 రోజులు సమయం తీసుకుని బాటిల్స్‌తో హీరోయిన్ బొమ్మను చేశాం. ఆ సీన్‌కు చాలా మంచి పేరు వచ్చింది. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా 'అందాల రాక్షసి' అనగానే ఆ బాటిల్ సీన్ గురించి చెబుతారు. తెలుగు పరిశ్రమలో ఒక పెద్ద సినిమాకు చేస్తే తప్ప ఆర్ట్ డైరక్టర్ గురించి మాట్లాడరు. కానీ తొలిసారి ఒక చిన్న సినిమాకు ఆర్ట్ డైరక్షన్ గురించి మాట్లాడారు. పరిశ్రమలోని ఆర్ట్ డైరక్టర్లు కూడా నాకు ఫోన్ చేసి మెచ్చుకున్నారు.

పరిశ్రమపై ఆసక్తితోనే...

నాకు సినిమా పరిశ్రమ అంటే చాలా ఆసక్తి. పెయింటింగ్, ఫొటోగ్రఫీ అంటే చాలా ఇష్టం. ఆల్ ఇండియా ఫొటోగ్రఫీ అసోసియేషన్‌లో నేను మెంబర్‌ని. నాకు విశ్వనాథ్‌గారు, జంధ్యాలగారు, మణిరత్నంగారు అంటే ఇష్టం. కేన్వాస్ మీద పెయింటింగ్ ఎలా ఇష్టమో, అదే కేన్వాస్‌ని పెద్దగా చూడాలని కూడా ఇష్టం. మా టీచర్ కూడా ఎం.ఎఫ్.ఎ చేసి ఆర్టిస్ట్‌గా ఎగ్జిబిషన్స్ పెట్టుకోమని నాతో చెప్పేవారు. కానీ నేను 'సినిమా ఇండస్ట్రీకి వెళ్తాను సార్' అని చెప్పాను. దానికి ఆయన 'మనం పనిని ఎమోషనల్‌గా చాలా ఇన్వాల్వ్ అయి చేస్తాం. కానీ సినిమా పరిశ్రమలో కమర్షియల్‌గా ఉంటారు. మన పనికి, దానికీ తేడా ఉంటుంది' అని చెప్పారు. కానీ నాకు సినిమా అంటే ఇష్టమని ఆయనతో చెప్పాను. అప్పటి నుంచే పూణేలో చదవాలని ఉండేది. నాకు వేరే ఫోకస్ లేదు. సినిమాలో పనిచేయాలి. నాకు తెలిసింది ఆర్ట్. కాబట్టే దానిపైనే ఫోకస్ పెట్టాను.



అలా చెప్పుకోవాల్సి వస్తుంది...

'అందాల రాక్షసి' ముందు వరకు కూడా నేనేం చేస్తున్నానో మా వాళ్లకి అర్థం అయ్యేది కాదు. పూణేలో చదువుతున్నానంటే వాళ్లకు అర్థం అయ్యేది కాదు. సినిమా పరిశ్రమ అంటే ఎవరికైనా డైరక్టర్, కెమెరామేన్ అనేది తెలిసేది. ఆర్ట్ డైరక్టర్‌గా చేస్తాను అని అవతలివారికి అర్థం చేయించడానికి చాలా కష్టమయ్యేది. ఇప్పటికీ ఆర్ట్ డైరక్టర్ అంటే పెద్దగా తెలియదు. కాకపోతే తెలుగు పరిశ్రమలో వస్తున్న విషయాల వల్ల ఇప్పుడు కొంచెం అర్థమవుతోంది. ఇంకో విషయం ఏంటంటే బెస్ట్ టెక్నీషియన్లు అంటే వాళ్లు తెలుగువాళ్లు కాదు అని మనవాళ్లు బాగా ఫిక్స్ అయిపోతున్నారు. ఈ మధ్య కూడా ఒక హీరో 'మీరు తమిళియనా' అని అన్నారు. మరి నా లుక్‌లో అలా కనిపిస్తుందో ఏమో నాకు అర్థం కాదు కానీ వెంటనే వాళ్లు అలా ఫిక్స్ అయిపోతున్నారు. అందువల్ల ఇప్పుడు నేను అందరి దగ్గరకు వెళ్లి 'నేను తెలుగువాడినే. హైదరాబాద్‌లో పుట్టి పెరిగాను. మా వాళ్లందరూ హైదరాబాద్‌లోనే ఉంటారు' అని చెప్పుకోవాల్సి వస్తోంది.



సపోర్ట్ ఉంటే ఆడపిల్లలు అద్భుతాలు చేస్తారు: మోనిక

ప్రతి విషయాన్ని మనం ఎలా చూస్తున్నామనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఉద్యోగం చేస్తున్న మహిళలకు పిల్లలు పుడితే ఉద్యోగం ముఖ్యమా? పిల్లలు ముఖ్యమా? అనే ప్రశ్న వస్తుంది. ఇక నా విషయానికి వస్తే నాకు అదే సమస్య ఎదురైంది. అయితే ఇక్కడ ఒక విషయం గమనిస్తే ఈ పరిశ్రమలో పనిచేసేవారు చాలా మంది ఉన్నారు.. జర్నలిస్ట్ అయినా, ఎడిటర్స్ అయినా, కాస్ట్యూమ్ డిజైనర్లు అయినా.. నేను వాళ్లలాగానే. వాళ్లు ఫ్యామిలీని ఎలా మేనేజ్ చేస్తారో అలాగే నేను కూడా మేనేజ్ చేసుకుంటూ వస్తున్నాను. ఇంట్లో ఓ పనిమనిషిని నియమించుకున్నాను. సమయం దొరికినప్పుడల్లా ఇంటికి వచ్చి పిల్లాడ్ని చూసుకుంటాను. అంటే మనకి కొన్నిటి మీద ప్యాషన్ ఉంటే మనం అన్నిటినీ మేనేజ్ చేయగలం. నాకు సినిమాలంటే ప్యాషన్. చిన్నప్పటి నుంచీ అంతే. మా నాన్న, నా భర్త నాకు సపోర్ట్ చేశారు. అందుకే నేను పని చేయగలుగుతున్నాను. చాలా సార్లు మనం భార్యలని, కూతుర్లను సమాజానికి తగ్గట్టు ప్రవర్తించమని ఫోర్స్ చేస్తుంటాం. కానీ అది తప్పు. కుటుంబంలో అబ్బాయిలు అమ్మాయిలకు కనుక సపోర్ట్ చేస్తే వండర్స్ చేస్తారు. బయట ఏదో సాధిస్తున్నాం కదా అని ఇంటిని కూడా వదులుకోరు. అన్నిటినీ మేనేజ్ చేసుకోగల సత్తా అమ్మాయిలకు ఉంది. మనం చేయాల్సింది అంతా సపోర్ట్ చేయడమే. ఆ పనిని సక్రమంగా చేయాలి. అమ్మాయిలు కేపబుల్ ఆఫ్ మెనీ థింగ్స్. అబ్బాయి సపోర్ట్ చేస్తే చాలా హ్యాపీ. అలాగే మా అబ్బాయికి నాలుగో నెల వచ్చినప్పటి నుంచీ నేనె సెట్‌కి వెళ్లి పనిచేసేదాన్ని. మా అబ్బాయి పుట్టిన తర్వాత కూడా మా అబ్బాయిని మాతో సెట్‌కి తీసుకెళ్తాం. సమయం ఉన్నప్పుడు తనతో గడుపుతాం. నేను నా ప్రొఫెషన్‌కు ఇంత సమయాన్ని కేటాయిస్తున్నానంటే కారణం నా భర్త, నా తండ్రి అందిస్తున్న సహకారమే.



ప్రేమ వివాహమే...

నాది, మోనికది లవ్ కమ్ అరేంజ్డ్ మేరేజ్. ఎఫ్‌టీఐలో మా రిలేషన్ మొదలైంది. అక్కడి నుంచి ముంబై వెళ్లి పని చేశాను. ఇన్‌స్టిట్యూట్‌లో నేను తనకన్నా రెండేళ్ల సీనియర్‌ని. మా ప్రేమ విషయం తెలిసిన తర్వాత మా కుటుంబాలు మాట్లాడుకుని పెళ్లి చేశాయి.

..మిగతా 8లో

- మోహన్ కుమార్ తుమ్మల



'మిలియన్' ఆంక్షలు



(మొదటిపేజీ తరువాయి)

మోహరించి అష్టదిగ్బంధనం చేశారు. ఉద్యమకారులను చెదరగొట్టేందుకు సిద్ధంగా వాటర్ కెనాన్లు, ముళ్ల కంచెలతో భారీ ఏర్పాట్లు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ నిర్వహిస్తామని ప్రకటించిన స్ఫూర్తి కమిటీ, చెప్పినట్టుగానే శనివారం ఆ దిశగా ప్రయత్నాలు చేసింది. సభకు అనుమతివ్వని పోలీసులు.. అనుకున్నట్టుగానే సభను అడ్డుకునేందుకు భారీగా రంగంలోకి దిగారు. శుక్రవారం నుంచే అరెస్టుల పర్వానికి తెర తేసిన పోలీసులు, శనివారం ఎక్కడికక్కడ నేతలను, కార్యకర్తలను అరెస్ట్ చేసి స్టేషన్లకు తరలించారు. టీజేఏసీ చైర్మన్ కోదండరాం ఇంటి చుట్టూ ఉదయం నుంచే పోలీసులు భారీగా మోహరించి, ఆయన్ను గృహ నిర్బంధం చేశారు. కోదండరాంను అరెస్ట్ చేసేందుకు ఇంటి వెనుక భాగం నుంచి లోపలికెళ్లేందుకు ప్రయత్నించగా, టీజేఏసీ కార్యకర్తలు అడ్డుకోవడంతో పోలీసులు వెనుదిరిగారు. చివరకు మధ్యాహ్నం 2 గంటల సమయంలో సభకు వెళ్లేందుకు కోదండరాం కారులో బయటకొచ్చారు. డ్రైవర్‌ను లాగిపడేసి కోదండరాంను ఆయన కారులోనే బొల్లారం పోలీస్ స్టేషన్‌స్టేషన్‌కు తరలించారు. తమ ఆకాంక్షల పట్ల ప్రజలకు సోయి వస్తే, ప్రశ్నిస్తారన్న భయంతోనే కేసీఆర్ పోలీసులతో నిర్బంధాలకు పాల్పడుతున్నారని కోదండరాం విమర్శించారు. ఉస్మానియా వర్సిటీ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, ఇందిరా పార్కు, వామపక్ష పార్టీల కార్యాలయాలు, హిమాయత్‌నగర్, లిబర్టీ, ఆర్టీసీ క్రాస్ రోడ్డు, అసెంబ్లీ, తదితర వందకుపైగా ప్రాంతాల్లో పోలీసు పహారా ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్యాంక్ బండ్‌పైకి రాకపోకలు నిలిపేశారు. ట్యాంక్‌బండ్‌పైకి చేరుకునే దారులన్నింటినీ ముళ్ల కంచెలతో మూసేశారు. ఆ రూట్లలో వెళ్లాల్సిన వాహనాలను పోలీసులు దారి మళ్లించారు. ఉస్మానియా వర్సిటీలో విద్యార్థులపై పోలీసులు శుక్రవారం నుంచే నిఘా పెట్టారు. ఆర్ట్స్ కాలేజీ, హాస్టళ్లు, తదితర ప్రాంతాల్లో పోలీసులను మోహరించారు. ఇంతటి ఆంక్షలు ఉన్నప్పటికీ ఉస్మానియా విద్యార్థులు కొంతమంది ట్యాంక్‌బండ్‌పైకి చేరుకునే ప్రయత్నం చేశారు. వర్సిటీ నుంచి ఉప్పల్‌కి వెళ్లి అక్కడ్నుంచి





హిమాయత్‌నగర్ గల్లీల నుంచి ట్యాంక్‌బండ్ చేరుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. హిమాయత్‌నగర్‌లో సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ వద్ద ఉదయం నుంచే పోలీసులు భారీగా చేరుకున్నారు. సభకు వెళ్లేందుకు మధ్యాహ్నం సమయంలో బయటకొచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, నగర కార్యదర్శి ఇ.టి. నరసింహా, తదితరులను పోలీసులు ఆ కార్యాలయం ముందే అరెస్ట్ చేసి బేగంబజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీపీఐ కార్యకర్తలకు పోలీసు వాహనాలు ముందుకు కదలకుండా అడ్డంపడి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, అమరుల ఆకాంక్షలు నెరవేరేదాకా తమ పోరాటం కొనసాగుతుందని చాడ పేర్కొన్నారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. నైతికంగా తామే విజయం సాధించామన్నారు. ట్యాంక్‌బండ్‌వైపు వస్తున్న ప్రజా గాయకురాలు విమలక్కను మధ్యలోని అడ్డుకుని పోలీసులు అరెస్ట్ చేశారు. దాదాపు 3,500కుపైగా ఉద్యమకారులను పోలీసులు అరెస్ట్ చేశారని నేతలు ఆరోపించారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ నేపథ్యంలో పంజాగుట్టలోని ముఖ్య మంత్రి క్యాంపు కార్యాలయం ప్రగతి భవన్ వద్ద పోలీసులు భారీ ఎత్తున మోహరించారు. ఉద్యమకారులెవరైనా ప్రగతి భవన్ వైపు వస్తే వెంటనే అరెస్ట్ చేసి తరలించేందుకు వీలుగా డీసీఎం వ్యాన్లు, ఇతర వాహనాలను సిద్ధంగా ఉంచు కున్నారు. మొత్తానికి అవాంచనీయ ఘటనలేవి జరగకుండా, అందర్నీ అరెస్ట్ చేసి పోలీసులు ఊపిరిపీల్చుకోగా, మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభను ప్రభుత్వమే ప్రచారం చేయడంతో నైతికంగా తాము విజయం సాధించామన్న భావనను ఉద్యమకారులు వెలిబుచ్చారు.



కోదండకు కోమటిరెడ్డి 'సపోర్టు'?


(మొదటిపేజీ తరువాయి)

'ఎలక్షన్ వైరస్'ను వ్యాపింపజేస్తున్నాయి.

కోదండరాం నేతృత్వంలో ఏర్పాటవుతుందని చెబుతున్న 'తెలంగాణ...' పార్టీ కేంద్రంగా కొన్ని సమీకరణల గురించిన సమాచారాలు వ్యాపిస్తున్నాయి. రెండు మూడు రోజుల్లో పేరు ప్రకటించనున్న ఈ పార్టీకి నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి సోదరులు 'టోటల్ ఫైనాన్స్' చేయనున్నట్లు ఊహాగానాలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. దీనికి బదులుగా వారు సూచించిన 20-25 మంది అభ్యర్థులకు కోదండరాం పార్టీ టిక్కెట్లు ఇస్తారు. కోమటిరెడ్డి బ్రదర్స్ కోరిన నియోజకవర్గాల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను బరిలోకి దింపుతారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన వెంకటరెడ్డి తనకు పార్టీని అప్పగిస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపిస్తానని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీతో గత నెలలో చర్చలు జరిపిన విషయం విదితమే. అయితే అక్కడ హామీ లభించిందీ.. లేనిదీ వెల్లడి కాలేదు. వెంకటరెడ్డి మాత్రం దానితోనే ఆగకుండా తన లక్ష్యసాధన కోసం వివిధ రకాల వ్యూహాలు పన్నుతున్నారు. సొంత పార్టీ కాంగ్రెస్‌లో పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొత్తగా వచ్చిన రేవంత్‌రెడ్డి వర్గానికి ఒక పక్క చెక్ పెడుతూ తన 'విలువ'ను పెంచుకునే ప్రయత్నాలు చేస్తూనే, మరోపక్క ఇతరత్రా ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. వీటిలో భాగంగానే కోదండరాం పార్టీకి ఆర్థిక సహాయం చేస్తున్నారని వినికిడి. ఎన్నికలు జరిగి టీఆర్ఎస్‌కు స్వల్ప మెజారిటీ వచ్చినా, లేక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా కోదండరాం పార్టీ నుంచి గెలిచిన అభ్యర్థులు కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అదనపు బలంగా ఉంటారు. ఆయనకు సీఎం అయ్యే అవకాశాలు పెరుగుతాయి. ఇలాంటి స్థితే వస్తే కాంగ్రెస్ అధిష్ఠానం కూడా ఆయనకే అధికారం కట్టబెడుతుందని విశ్లేషకుల అంచనా.

ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో కోమటిరెడ్డి బ్రదర్స్ తమ తరపున బరిలోకి దిగే అభ్యర్థులను ఖాయం చేసుకున్నారని తెలుస్తున్నది. వెంకటరెడ్డి కుడిభుజం లాంటి అనుయాయుడు, నల్లగొండ మునిసిపల్ చైర్‌పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యకు గురవడంతో నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తన స్థానంలో ఆమెను పోటీ చేయించి, తాను నల్లగొండ ఎంపీగా పోటీ చేయనున్నట్లు సమాచారం. చిరకాలంగా తాను కోరుకుంటున్న మునుగోడు నుంచి రాజగోపాల్‌రెడ్డిని పోటీకి దింపుతారని ఆయన అనుచరులంటున్నారు. అదేవిధంగా గత ఎన్నికల్లో భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి బరిలోకి దిగి ఓడిపోయిన రాజగోపాల్‌రెడ్డికి కాంగ్రెస్ తరపున ఈసారి ఆ సీటు వచ్చేలా లేదు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి వ్యూహంతో ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన విద్యార్థి నాయకుడికి ఆ సీటును కేటాయించినట్లు క్యాంపస్‌లో చెప్పుకొంటున్నారు.



అందుకే ఆయన కూడా నల్లగొండలోని మరో నియోజకవర్గానికి మారి భువనగిరిని ప్రస్తుతం టీఆర్ఎస్‌లో ఉన్న తమ సామాజికవర్గానికి చెందిన ఒకరికి కేటాయించేందుకు కోదండరాంతో ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

కోమటిరెడ్డి సోదరుల వ్యూహంలో భాగంగానే కోదండరాం పార్టీకి, కాంగ్రెస్ పార్టీకి పొత్తు కుదిరినట్లు ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. దీనిలో భాగంగానే కోదండరాం పార్టీకి 30 అసెంబ్లీ, రెండు లోక్‌సభ సీట్లు కేటాయించారన్న సమాచారం వెలువడుతోంది. ఇదే కోమటిరెడ్డి బ్రదర్స్ కోదండరాం పార్టీకి 'ఫైనాన్షియల్ సపోర్టు' చేస్తున్నారన్న వాదనకు బలం చేకూరుస్తోంది.

తమ సొంత సామాజికవర్గం కోసమే పార్టీ పెడుతున్నారని కోదండరాంపై ఇప్పటికే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కోమటిరెడ్డి సోదరుల ఆర్థిక సహాయం తీసుకున్నా, కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకున్నా అవి బలపడే అవకాశాలున్నాయి. కాబట్టి ఆయన దీనికి ఒప్పుకోరని ఒక వర్గం వాదన. అయితే పార్టీకి కావలసిన నిధుల కోసం ఎవరోఒకరిపై ఆధారపడక తప్పదు కాబట్టే కోదండరాం దీనికి ఒప్పుకొన్నట్లు తెలుస్తోంది. అంతేకాదు, ఒంటరిగా బరిలోకి దిగితే టీఆర్ఎస్‌ను ఎదుర్కోలేనన్న అంచనా కూడా ఆయనకున్నందునే కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకున్నారని అంటున్నారు. కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకున్నాక కోమటిరెడ్డి బ్రదర్స్ నుంచి ఆర్థిక సాయం తీసుకున్నా విమర్శలు రావని, వచ్చినా వాటికి అంత ప్రాధాన్యం ఉండబోదని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తున్నది.

గులాబి అసంతృప్తులకు గాలం

ఏప్రిల్‌లో టీఆర్ఎస్ ప్లీనరీ నాటికి కేసీఆర్ నామినేటెడ్ పదవులన్నీ భర్తీచేస్తారని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. అప్పటికీ పదవులు రాని వారిని, అసంతృప్తులను ఆకర్షించి తమ తరపున బరిలోకి దింపాలని కోదండరాం, కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రయత్నిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు టీఆర్ఎస్ నేతలు ఎంతోమంది వీరితో టచ్‌లో ఉన్నారు. ఈ పరిణామాలన్నీ గమనిస్తే టీఆర్ఎస్ ప్లీనరీ తరువాత రాష్ట్ర రాజకీయ రంగ దృశ్యం పూర్తిగా మారనుందని చెప్పుకోవచ్చు. ఘడియఘడియకూ, రోజురోజుకూ మారుతున్న రాజకీయాల్లో ఇవే కాకుండా ఇంకొన్ని మార్పులు కూడా చోటు చేసుకోవచ్చని రాజకీయ వ్యూహకర్తలు అంటున్నారు. ఈ ఊహాగానాలన్నీ నిజమవుతాయా? కొన్నే అవుతాయా? ఇంకేం జరుగుతుందన్నది చూడాలంటే ఏప్రిల్ రెండోవారం దాకా ఆగాలి...!!

థర్డ్ కాదు.. ఫస్ట్ ఫ్రంట్

భారత్ రెండు పార్టీల వ్యవస్థకాదు
రెండు పార్టీల పోరాటమూ కాదు
బహుళ పార్టీలు ఉన్న దేశమిది..
కాంగ్రెస్, బీజేపీకి మెజారిటీ రాదు
51వ స్కోచ్ సదస్సులో కేటీఆర్



హైదరాబాద్, మార్చి 10 (మనం ప్రతినిధి):

సీఎం కేసీఆర్ ప్రతిపాదించిన ఫ్రంట్ థర్డ్ ఫ్రంట్ కాదని, అది ఫస్ట్ ఫ్రంట్ అని మంత్రి కేటీఆర్ ఉద్ఘాటించారు. భారత్ అంటే రెండు పార్టీల వ్యవస్థ కాదని, బహుళ పార్టీల వ్యవస్థ ఉన్న దేశమని పేర్కొన్నారు. ఢిల్లీలో శనివారం జరిగిన 51వ స్కోచ్ సదస్సులో పాల్గొన్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. థర్డ్‌ఫ్రంట్‌పై మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా..'' దేశంలో ఉన్నది రెండు పార్టీల వ్యవస్థ కాదు. రెండు పార్టీల మధ్య పోరాటం అంతకన్నా కాదు. బహుళ పార్టీల వ్యవస్థ, ప్రాంతీయ పార్టీలు చాలా బలంగా ఉన్న మన దేశంలో గమనిస్తే రాబోయే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో ఏ ఒక్క పార్టీకీ పూర్తిస్థాయి మెజారిటీ రాదనేది అంతా రాజకీయంగా భావిస్తున్నారు. బీజేపీని చూసినా, కాంగ్రెస్‌ను చూసినా ఆ రెండు పార్టీలూ పూర్తి మెజారిటీ సాధించే పరిస్థితుల్లో లేవు. దేశంలో కేంద్రంలో కేంద్రీకృతమైన పెత్తనాన్ని ప్రశ్నించేవిధంగా, ఫెడరల్ వ్యవస్థకు ప్రతిబింబంగా ఓ కొత్త ప్రత్యామ్నాయం వస్తే మంచిదనే ఉద్దేశంతో ఓ చర్చకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయి, ఏ రకంగా ఈ కూటమి రూపుదిద్దుకుంటుందో చూడాలి అని పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్రీక తమైన పెత్తనాలు, అధికారాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని సుస్పష్టం చశారు. ఉపాధి హామీ కూలీల డబ్బులు కూడా ఢిల్లీలో వేస్తే గ్రామాల్లో తీసుకొనే పరిస్థితి ఎందుకు ఉండాలనేదానిపై కేసీఆర్ ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో కేంద్రానికి పనేంటని ప్రశ్నించారు. రాష్ట్రాలు బాగుంటే దేశం బాగుంటుందని, మొత్తం అధికారాలు కేంద్రీకృతమైతే దేశానికి అపారమైన నష్టం జరుగుతుంది కాబట్టే సీఎం కేసీఆర్ ఒక కొత్త చర్చకు లేవనెత్తారని అన్నారు. భవిష్యత్తులో ఇది మంచి పరిణామాలకు దారితీస్తుందని విశ్వసిస్తున్నానని చెప్పారు.

కేంద్రం నుంచి ఒక్క పైసా రాలేదు..

కేంద్రం నుంచి ఈ మూడున్నరేళ్లలో ఒక్క పైసా కూడా అదనంగా తెలంగాణకు రాలేదని, విభజన చట్టంలో చెప్పిన విధంగా ఒక్క ఇన్‌స్టిట్యూట్‌ను కూడా ఇవ్వలేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఏపీకైనా కొన్ని ఇచ్చారని, తెలంగాణకు మాత్రం ఒక్కటైనా ఇవ్వలేదన్నారు. ఒక్క కొత్త సంస్థ కూడా రాలేదని, ఇందుకు సంబంధించి తమ దగ్గర స్పష్టమైన లెక్కలు ఉన్నాయని చెప్పారు. అనేక అంశాలకు సంబంధించి గతంలో కేంద్రానికి అనేకసార్లు ప్రతిపాదించామని, కేంద్ర మంత్రులను కలిసి విన్నవించామని పేర్కొన్నారు. అయినా.. ఎలాంటి స్పందనలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైనట్లుందని, అందుకే వారు కేంద్ర ప్రభుత్వం నుంచి బయటికి వచ్చి ఉంటారని చెప్పారు. వాస్తవంగా చెప్పాలంటే ఎన్‌డీఏ కూటమిలో ఎవరూ మిగలలేదన్నారు. శివసేన, టీడీపీ బయటకు వచ్చేశాయమని, అత్యంత బలహీన పడిన అకాలీదళ్, బీజేపీ మాత్రమే కూటమిలో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర తన వైఖరిపై ఆలోచించుకోవాలని, కూటమి నుంచి ఒక్కో పార్టీ ఎందుకు వైదొలుగుతుందో తెలుసుకోవాలని హితవు పలికారు.

మరిన్ని సంస్కరణలు రావాలి: కేటీఆర్

దేశంలో మరిన్ని సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. దేశం అభివృద్ధి చెందుతున్నా.. మరో వైపు సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయన్నారు. అయితే అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. 51వ స్కోచ్ సదస్సులో పాల్గొన్న ఆయన రాష్ట్రంలో వృద్ధిరేటు, ప్రాంతాల అభివృద్ధి , నైపుణ్యాల అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. దేశంలోనే అన్ని రంగాల్లో తెలంగాణ ముందుకు వెళ్తోందని చెప్పారు. సీఎం కేసీఆర్ కృషితో విద్యుత్ సమస్యను అధిగమించామని, విద్యుత్ మిగులు రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని పేర్కొన్నారు. పెట్టుబడులకు తెలంగాణ అనువైన ప్రాంతమని పేర్కొన్నారు.

సింగరేణి కార్మికులకు తీపికబురు

(మొదటిపేజీ తరువాయి)

గుర్తింపుసంఘం ఎన్నికల్లో వారసత్వ ఉద్యోగాల స్థానంలో కారుణ్య నియామకాలు చేపట్టి కార్మికులకు న్యాయం చేస్తానని సీఎం కేసీఆర్ గతంలో హామీ ఇచ్చారు. ఇటీవల కోల్‌బెల్ట్‌లో పర్యటించిన సమ యంలోనూ కారుణ్య నియామకాలు చేపడ్తామని కేసీఆర్ పేర్కొన్న దాఖలాలున్నాయి. కారుణ్య నియామకాలపై యాజమాన్యం గతం లో ఇచ్చిన ఉత్తర్వులను సవరిస్తూ మరో ఉత్తర్వులను జారీ చేసింది. అనారోగ్యంతో బాధపడ్తున్న, మృతిచెందిన కార్మికుల పిల్లలకు కారుణ్య నియామకాలు వరంగా మారనున్నాయి. కారుణ్య నియా మకాలపై యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేయటం పట్ల సింగరేణి వ్యాప్తంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు సంబురాలు జరుపుకున్నారు. సీఎం కేసీఆర్‌తో పాటు ఎంపీ కవితకు టీబీజీకేఎస్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

దంతవైద్యులకు బంపర్ చాన్స్

(మొదటిపేజీ తరువాయి)

అవుతుంది. బీడీఎస్ చదివిన వారిని మూడేళ్ల బ్రిడ్జి కోర్సుకు అనుమతిస్తే వారు కోర్సు తర్వాత నాలుగు నుంచి ఐదేళ్ల పాటు దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తారని డీసీఐ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ దివ్యేందు మజుందార్ తెలిపారు. ఇందుకు సంబంధించి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ)ను కూడా అనుమతి కోరామని మజుందార్ చెప్పారు.

నోటి ఆరోగ్యానికీ బడ్జెట్

ఆరోగ్యానికి కేంద్ర ప్రభుత్వం పెద్దమొత్తంలో బడ్జెట్ కేటాయిస్తోందని, అందులోంచి నోటి ఆరోగ్యానికి ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాల్సిందిగా కోరామని మజుందార్ చెప్పారు. దంత వైద్యశాలలు, క్లినిక్‌లో చికిత్స సందర్భంగా చనిపోయిన రోగులకు సంబంధించి డెత్ సర్టిఫికేట్లు జారీచేసే అధికారం డెంటల్ సర్జన్‌లకు ఇవ్వాలని కోరుతూ డీసీఐ చేసిన ప్రతిపాదనలకు కేంద్రం ఇప్పటికే అంగీకారం తెలిపిందని మజుందార్ చెప్పారు.

పేరొందిన అధ్యాపకులతో విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించేందుకు డీసీఐ కృషి చేస్తోందన్నారు. ఇందుకోసం విద్యాసంస్థలు ఎలాంటి ఖర్చు చేయనవసరం లేదని, భారాన్ని డీసీఐ భరిస్తుందని మజుందార్ తెలిపారు.

బూచోడు కాదు.. మంచోడే

స్మార్ట్ ఫోన్ వ్యసనం కానే కాదు

(మనం సెంట్రల్ డెస్క్)

శ్రీనివాస్ కొడుకు ప్రణీత్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. రెండో సంవత్సరంలోకి రాగానే స్మార్ట్ ఫోన్ అడిగాడు. సరే కదాని శ్రీనివాస్ కొనిచ్చారు. ఆ తర్వాతి నుంచి పుస్తకాలు తక్కువ.. ఫోన్ ఎక్కువ అన్నట్లు అయిపోయింది ప్రణీత్ వ్యవహారం. రోజులో చాలాసేపు ఫోన్ పట్టుకుని గడుపుతున్నాడు. ఫోన్ ఎందుకు కొని చ్చానా అని మొదట్లో శ్రీనివాస్ చాలా కంగారు పడ్డారు. ఒక రోజు కొడుకును దగ్గర కూర్చో బెట్టుకుని సంగతేంటని నెమ్మదిగా ఆరాతీశాడు. ''నువ్వే చూడు నాన్నా.. ఇందులో సీక్రెట్లు ఏమీ లేవు.. నాకు గర్ల్ ఫ్రెండ్స్ అంతకన్నా లేరు'' అంటూ ఫోన్ తండ్రి చేతికిచ్చాడు. 'నాకు ఎందుకు గానీ నువ్వే చెప్పరా' అని అడిగారు శ్రీనివాస్. ''అమ్మమ్మ వైపు కజిన్స్ అంతా ఒక గ్రూపులోను, నానమ్మ వైపు కజిన్స్ అంతా మరో గ్రూపులోను ఉంటారు.. వాళ్లలో కొంతమంది బీటెక్ చేస్తుంటే మరికొందరు చిన్న క్లాసుల వాళ్లు. అందరితో నాకు మంచి రిలేషన్స్ ఉన్నాయంటే.. ఈ వాట్సాప్ వల్లే. అంతా కలిసి రకరకాల స్ట్రీమ్‌ల గురించి, ఆల్టర్నేట్ కోర్సుల గురించి డిస్కస్ చేసుకుంటాం. సురేశ్ బావ అయితే నన్ను బీటెక్ వద్దు, బీ ఫార్మసీ చేసి అమెరికాలో ఎంఎస్ చేయమంటున్నాడు. దానికి అక్కడ బాగా డిమాండు ఉందట. వెంటనే అక్కడే ఉద్యోగాలు కూడా వస్తున్నాయట. ఎటూ ఎంపీసీ నుంచి కూడా వెళ్లచ్చు కాబట్టి నేనూ ఆలోచిస్తున్నా.. ఒక డెసిషన్ తీసుకున్నాక నీకు చెబుదామని ఆగా..'' అంటూ చెప్పాడు. దాంతో శ్రీనివాస్ ఊపిరి పీల్చుకున్నాడు. మంచి ర్యాంకు రాకపోతే ఫీజులు, డొనేషన్లు కట్టి బీటెక్ ఎలా చదివించాలా అని పడుతున్న టెన్షన్ కాస్తా ఒక్కసారిగా చేత్తో తీసేసినట్లు పోయింది. స్మార్ట్ ఫోన్‌కు తొలిసారి థాంక్స్ చెప్పాడు.

సామాజిక సంబంధాలు మెరుగు

ఒక్క ప్రణీతే కాదు.. చాలామంది యువత ఇప్పుడు నిరంతరం సామాజిక సంబంధాలు కొనసాగించడానికి మొగ్గు చూపిస్తున్నారు. అంతేతప్ప వాళ్లు స్మార్ట్ ఫోన్‌లకు బానిసలు కావడం లేదన్నది స్మార్ట్ టెక్నాలజీపై ఇటీవలి కాలంలో జరిగిన పరిశోధనలలో వెల్లడైంది. ఫ్రాంటియర్స్ ఇన్ సైకాలజీ అనే పత్రికలో ఈ పరిశోధన పలితాలు ప్రచురితమయ్యాయి. స్మార్ట్ ఫోన్ కు బానిసలు అయినంత మాత్రాన వాళ్లు సంఘవ్యతిరేక శక్తులుగా తయారవుతారని అనుకోవక్కర్లేదని, సామాజికంగా చాలా చురుగ్గా ఉంటారని అందులో తేలింది. ఈ విషయంలో ప్రపంచవ్యాప్తంగా చాలామంది ఆందోళనకు గురవుతున్నారని, మనుషులతో మాట్లాడటం మానేసి ఫోన్లకు బానిసలుగా మారిపోతున్నారంటూ పిల్లలను తిట్టిపోస్తున్నారు గానీ.. నిజానికి అది వాస్తవం కాదని కెనడాలోని మెక్ గిల్ యూనివర్సిటీకి చెందిన శామ్యూల్ వైసైర్ చెప్పారు. చేతిలో ఫోన్ లేకుండా కొన్ని నిమిషాలు కూడా ఉండలేని పరిస్థితిలో చాలామందిని చూస్తున్నామని, వాళ్లు తరచు టెక్స్టింగ్ చేస్తూ సోషల్ మీడియాలో మునిగి తేలుతుంటారని ఆయన అన్నారు. ఇలా ఉండటం వల్ల సంఘానికి దూరంగా జరిగిపోతున్నారన్న ఆందోళన కనిపిస్తున్న మాట నిజమే అయినా.. వాళ్లు బానిసలు అవుతున్నది ఫోన్లకు కాదని.. సంభాషణలకేనని తెలిపారు.



సెల్ ఫోన్లు లేనపుడు..

స్మార్ట్ ఫోన్లు లేనపుడు, ఇంకా చెప్పాలంటే మొబైల్ కమ్యూనికేషన్ లేనపుడు కేవలం ల్యాండ్ లైన్ ఫోన్లు మాత్రమే ఉండేవి. వాటిలో కూడా అప్పుడప్పుడు మాట్లాడుకునేవారు గానీ, అప్పట్లో ఎస్టీడీ బిల్లులకు భయపడి.. రాత్రి 10 గంటల తర్వాతే దూరప్రాంతాలకు ఫోన్లు చేసేవారు. దాంతో ఫోన్లకు అతుక్కుపోవడం అనేది కనపడేది కాదు. తర్వాత మొబైల్ ఫోన్లలో తొలుత ఫీచర్ ఫోన్లు వచ్చాయి. వాటిలో ఫోన్ చేయడం, లేకపోతే ఎస్ఎంఎస్ పంపడం.. ఈ రెండే ఉండేవి కాబట్టి అంతలా వాటికి కూడా ఎక్కువగా బానిసలు కాలేదు. అంతేకాదు, మొదట్లో రేట్లు కూడా చాలా ఎక్కువగా ఉండేవి. నిమిషానికి ఇన్‌కమింగ్ రూ.3, ఔట్ గోయింగ్ రూ. 7 చొప్పున చార్జీలు ఉండటంతో చాలా అత్యవసరం అయితేనే మొబైల్ వాడేవారు. క్రమంగా పోటీ పెరగడం, చార్జీలు తగ్గడం, ఇప్పుడు అన్ లిమిటెడ్ కాలింగ్, రోజుకు 1.5 జీబీ వరకు డేటా ఉచితంగా ఉండటంతో స్మార్ట్ ఫోన్లను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఈమెయిళ్లు పంపడానికి, వచ్చినవి చూడటానికి, బ్యాంకింగ్ అవసరాలకు.. ఇలా అన్నింటికీ స్మార్ట్ ఫోన్ ఉపయోగపడటంతో.. దాన్నే చిన్నసైజు కంప్యూటర్‌లా వాడుకుంటున్నారు.

మంచిదే కానీ...

స్మార్ట్ ఫోన్ల వల్ల సామాజిక సంబంధాలకు మంచిదేనని, అవి ఒక ఆరోగ్యకరమైన అవసరం అని వైసైర్ చెప్పారు. అయితే కనెక్టివిటీ మరీ ఎక్కువగా ఉంటే మాత్రం మెదడు త్వరగా అలసిపోతుందని, దానివల్ల అనారోగ్యకరమైన బానిసత్వానికి దారితీస్తుందని ఆయన వివరించారు.

బయటపడటం ఎలా..

నోటిఫికేషన్లు నిరంతరం రాకుండా ఆఫ్ చేసుకుని, కావల్సిన సమయాల్లో మాత్రమే వచ్చేలా చేయడం, ఖాళీ సమయం ఎక్కువ దొరికినపుడే ఫోన్ చెక్ చేసుకోవడం లాంటి చర్యల ద్వారా ఫోన్ అడిక్షన్ నుంచి బయట పడొచ్చని వైసైర్ వివరించారు. ఆఫీసులలో అయితే వారాంతాలలోను, సాయంత్రం పూట అధికారిక ఈమెయిళ్లు పంపకుండా నిషేధం విధించాలని సూచించారు. ఇలాంటి విధానాల వల్ల ఉద్యోగుల మెదడు త్వరగా అలసిపోకుండా చూసుకోవచ్చని తెలిపారు. స్మార్ట్ ఫోన్లు, ఇతర గాడ్జెట్ల వాడకాన్ని నియంత్రించడానికి బదులు.. వాటిని ప్రోత్సహించాలని, అయితే అదే సమయంలో మరీ రోజుకు 24 గంటలూ అదేపనిగా కాకుండా.. అవసరం అయినపుడు మాత్రమే ఫోన్ స్క్రీన్ వైపు చూసేలా అలవాటు చేస్తే అన్నిరకాలుగా మంచిదని ఆయన సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ విషయంలో పిల్లలను సరిగ్గా గైడ్ చేస్తే పిల్లలు కూడా చక్కగా వింటారని ఆయన అన్నారు.

పాత కాలం నుంచి...

నిజానికి సామాజిక సంబంధాలను కొనసాగించడం అనేది ఇప్పుడు కాదు.. పురాతన కాలం నుంచి ఉంది. అయితే ఒక్కో కాలంలో ఒక్కోలా ఈ సంబంధాలు ఉంటున్నాయి. సాంస్కృతికంగా సరైన ప్రవర్తన కలిగి ఉండటానికి మనుషులు కొన్ని సమూహాలుగా తయారై.. ఒక్కో సమూహంలో సంభాషించుకోవడం, అవతలి సమూహాలతో సంబంధాలు పెట్టుకోవడం, వాళ్లతో కూడా ఏదో రకమైన కమ్యూనికేషన్ ద్వారా సంబంధాలు కలిగి ఉండటం కనిపించేది. ఇందుకోసం బొమ్మలు, సైగలు, చివరకు సంభాషణలు.. ఇలాంటివి వచ్చాయి. వీటన్నింటినీ జీవితానికి ఏదో ఒక అర్థం వెతుక్కోవడం, లక్ష్యాన్ని సాధించడం, తమకంటూ గుర్తింపు సాధించడం కోసం మొదలుపెట్టారు.

14 ఒప్పందాలు

భారత్, ఫ్రాన్స్ సంతకాలు.. కీలక రంగాల్లో పరస్పర సహకారం

- ప్రధాని మోదీతో మెక్రాన్ సమావేశం
- భారత్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడి పర్యటన

న్యూఢిల్లీ, మార్చి 10: భారత్, ఫ్రాన్స్ మధ్య రక్షణ, అణు ఇంధన సహకారం సహా 14 కీలక ఒప్పందాలు కుదిరాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయెల్ మెక్రాన్ సమక్షంలో ఇరు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. నాలుగు రోజుల భారత పర్యటన కోసం శుక్రవారం రాత్రి ఢిల్లీ వచ్చిన మెక్రాన్‌కు మోదీ స్వాగతం పలికారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఆర్థిక, రాజకీయ సంబంధాలను బలోపేతం చేసుకునే లక్ష్యంతో ఈ పర్యటన సాగుతుంది. శనివారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో మోదీ, మెక్రాన్ సమవేశామయ్యారు. ఇరు దేశాల నేతలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. రక్షణ, అణు ఇంధనం, విద్య, పర్యావరణం, పట్టణాభివృద్ధి, రైల్వేలు, ఇతర రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ద్వైపాక్షిక చర్చల అనంతరం మోదీ, మెక్రాన్ సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. ఫ్రాన్స్ ప్రజలు, భారతీయులు పరస్పరం ఇరు దేశాల గురించి మరింత తెలుసుకోవాలని మోదీ ఆకాంక్షించారు. మనం రెండు సుస్థిర దేశాల వారసులమన్నారు. హిందూ మహాసముద్రంలో విస్తృత సహకారానికి ఉమ్మడి వ్యూహాత్మక విజన్‌ను మోదీ ప్రకటించారు. భారత్, ఫ్రాన్స్ రక్షణ సహకారంలో నూతన చరిత్రను ఆవిష్కరించే ఒప్పందం కుదరడం హర్షణీయమన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భారీగా పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్‌ను మోదీ ఆహ్వానించారు.



మెక్రాన్ మాట్లాడుతూ.. ఇరు దేశాల మధ్య రక్షణ సహకారానికి కీలక ప్రాధాన్యం ఉందన్నారు. ఉగ్రవాదం, రెచ్చగొట్టి, ప్రేరేపించడం వంటి ముప్పులతో పోరాడాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు తెలిపారు.


నేడు ఐఎస్ఏ సదస్సు

భారత్-ఫ్రాన్స్ దేశాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ)ఆవిర్భావ సదస్సుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఢిల్లీ వేదికగా ఆదివారం ఈ సదస్సు జరగనుంది. ఇందులో మొత్తం 23 దేశాల అధినేతలు, ప్రతినిధులు పాల్గొననున్నారు.

మెక్రాన్‌కు ఘన స్వాగతం

భారత్ పర్యటనకు విచ్చేసిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ దంపతులకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధికారిక స్వాగతం పలికారు. శనివారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లో కోవింద్, ప్రధాని మోదీ వారిని స్వాగతించారు. అనంతరం మెక్రాన్ త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మెక్రాన్ మాట్లాడుతూ.. భారత్, ఫ్రాన్స్ చారిత్రక సత్సంబంధాలను కలిగి ఉన్నాయన్నారు. ఆ తర్వాత మెక్రాన్ దంపతులు రాజ్‌ఘాట్ చేరుకుని జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులర్పించారు.





మోదీ, మెక్రాన్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరు దేశాల రక్షణ శాఖ మంత్రులు నిర్మలా సీతారామన్, ఫ్లోరెన్స్ పార్లీ


పోటీతత్వంతోనే అభివృద్ధి

- విద్య, అభివృద్ధితో సామాజిక న్యాయం
- వెనుకబడిన జిల్లాల్లో కృషి: మోదీ
- జాతీయ ప్రజా ప్రతినిధుల సదస్సు

రాష్ట్రాల మాదిరిగానే దేశాల మధ్య కూడా పోటీ ఉంటుందని.. పోటీ తత్వం వల్లే రాష్ట్రాలు, దేశాలు అభివృ ద్ధి సాధిస్తాయని ప్రధాని మోదీ అన్నారు. శనివారం ఢిల్లీలో జాతీయ ప్రజాప తినిధుల సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజ న్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సదస్సులో కేంద్ర మంత్రులు, ఎంపీలు, రాష్ట్రాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సామాజిక న్యాయం, ప్రజాప్రతినిధుల బాధ్యతలపై మోదీ ప్రసంగించారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు పనిచేయడం వల్ల సామాజిక న్యాయం దిశగా ముందడుగు పడుతుందని అన్నారు. దేశ వ్యాప్తంగా 115 అత్యంత వెనుకబడిన జిల్లాలను గుర్తించి వాటిని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పిల్ల లంతా బడికి వెళ్తూ, అన్ని కుటుంబాలకు విద్యుత్ సదుపాయం అందినపుడు సామాజిక న్యాయం దిశగా ఓ అడుగు పడినట్లు భావించ వచ్చన్నారు. అభివృద్ధి జరగకపోవడానికి తగినంత బడ్జెట్, వనరులు లేకపోవడం కారణం కాదన్నారు. సుపరిపాలన లేకపోవడం వల్లే అభివృద్ధి జరగడం లేదన్నారు. సుపరిపాలన, పథకాలను సమర్థంగా అమలు చేయడం, శ్రద్ధతో కార్యకలాపా లను నిర్వహించడం వంటివాటి వల్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇక జిల్లాలో బాలబాలికలకు అందరికీ విద్య అందించి.. అన్ని గ్రామాలకు విద్యుత్ ఇవ్వగలిగినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఒక గ్రామానికి విద్యుత్ ఉండి మరో గ్రామానికి లేకపోతే అది సామాజిక న్యాయం కాదన్నారు. దీనిపై అన్ని రాష్ట్రాలు చర్చలు జరపాలని మోదీ సూచించారు. రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలు ఒకేలా ఉండవని, కొన్ని అభివృద్ధి చెందితే మరికొన్ని వెనుకబడి ఉంటాయన్నారు. వెనుకబడిన జిల్లాలు తమ లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలని, అభివృద్ధి చెందిన జిల్లాతో పోలిస్తే మనం ఎక్కడున్నామో గమనించాలని సూచించారు. ఇందులో జిల్లా కలెక్టర్ల పాత్ర కీలకమని మోదీ అన్నారు.

ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శిగా భయ్యాజీ జోషీ

- నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నిక



నాగ్‌పూర్, మార్చి 10: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రధాన కార్యదర్శిగా భయ్యాజీ జోషీ తిరిగి ఎన్నికయ్యారు. 2021 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. భయ్యాజీ ఆర్ఎస్ఎస్ జనరల్ సెక్రటరీగా ఎన్నికవడం ఇది వరుసగా నాల్గోసారి. ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ప్రచార్ ప్రముఖ్ మన్మోహన్ వైద్య జనరల్ సెక్రటరీగా భయ్యాజీ జోషీ ఎన్నికైనట్లు ప్రకటించారు. జనరల్ సెక్రటరీ పదవికీ ఇతర ఏ పేరు రానందున నలుగురు ఆఫీస్ బేరర్లు మద్దతు తెలిపినందున భయ్యాజీ ఏ పోటీ లేకుండానే తిరిగి ఎన్నికైనట్లు తెలిపారు. భయ్యాజీ 2009లో తొలిసారిగా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత రెండుసార్లు కూడా జోషినే ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఆరెస్సెస్ చీఫ్‌గా ఉన్న మోహన్ భగవత్ కూడా గతంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో కేఎస్ సుదర్శన్ చీఫ్‌గా ఉన్నారు.






గౌరీలంకేశ్ కేసులో ఎ1గా నవీన్

- కోర్టుకు తెలిపిన సిట్ బృందం
- మరో ఐదు రోజుల పోలీసు కస్టడీ

బెంగళూరు, మార్చి 10: ప్రముఖ పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ హత్యకేసులో ఎ1 నిందిగుడిగా కేటీ నవీన్‌కుమార్ అలియాస్ మొట్టె మాంజా (38)ను సిట్ పేర్కొంది. ఇప్పటివరకు అనుమానితుడిగా అతడిని విచారించిన సిట్.. తాజాగా ఈ కేసులో ఎ1 నిందితుడు అతడేనని బెంగళూరులోని సెషన్స్ కోర్టుకు తెలిపింది. దాంతో నవీన్‌ను మరో ఐదు రోజులు పోలీసు కస్టడీకి పంపుతూ కోర్టు ఆదేశాలిచ్చింది. గౌరీ హంతకులు తమ పని పూర్తి చేసేందుకు వారికి నవీన్ సాయం చేశాడని మాత్రమే సిట్ పేర్కొంది తప్ప, మిగిలిన వివరాలేమీ చెప్పలేదు. హిందూ యువసేన అధ్యక్షుడైన నవీన్.. మాండ్యా జిల్లాలోని మద్దూరుకు చెందినవాడు. అతడిని ఫిబ్రవరి 17న బెంగళూరులోని మెజిస్టిక్ ప్రాంతంలో సిట్ బృందం పట్టుకుంది. అతడివద్ద 15 లైవ్ బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సురేశ్ ప్రభుకు పౌర విమానయానం

- అదనంగా మంత్రిత్వ శాఖను కేటాయించిన మోదీ



న్యూఢిల్లీ, మార్చి 10: ఏపీకి ప్రత్యేక హో కోసం టీడీపీ మంత్రులు కేంద్ర కేబినెట్ నుంచి వైదొలగడం, వారి రాజీనామాలకు రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఆమోదించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అశోక్ గజపతిరాజు ఇప్పటివరకు నిర్వహిస్తూ వచ్చిన పౌర విమానయాన మంత్రిత్వ శాఖను అదనపుగా బాధ్యతగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభుకు అప్పగించారు. ప్రధాని మోదీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని రాష్ట్రపతి భవన్ ట్విట్టర్‌లో శనివారం వెల్లడించింది.



మహారాష్ట్రలో కూలిన నేవీ హెలికాప్టర్

ముంబై, మార్చి 10: మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో తీర ప్రాంత రక్షణ దళానికి చెందిన హెలికాప్టర్ కూలిపోయింది. మురుద్ సమీపంలో హెలికాప్టర్ కూలినట్లు అధికారులు వెల్లడించారు. అయితే హెలికాప్టర్‌లోని వారంతా క్షేమంగా ఉన్నారు. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో నలుగురు ఉండగా ముగ్గురు సురక్షితంగా బయటకు వచ్చారని, ఓ మహిళకు మాత్రం గాయాలైనట్లు అధికారులు తెలిపారు. హెలికాప్టర్ ల్యాండ్ అవుతుండగా ప్రమాదం జరినట్లు తెలుస్తోంది. అది గాల్లో ఉన్నప్పుడే సాంకేతిక లోపం తలెత్తినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చిన్నారులపై అత్యాచారానికి మరణశిక్షే

- చట్టం రూపొందించిన రాజస్థాన్



జైపూర్, మార్చి 10: పన్నెండేళ్లలోపు చిన్నారులపై అత్యాచారానికి పాల్పడ్డ వారికి మరణశిక్షే సరైనదని రాజస్థాన్ ప్రభుత్వం తేల్చింది. దీనికి అనుగుణంగా తీసుకొచ్చిన బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపింది. చిన్నారులపై అఘాయిత్యాలను నిర్మూలించే ఉద్దేశంతో ఈ బిల్లును తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. అసెంబ్లీ ఆమోదంతో చట్టంగా మారిన ఈ బిల్లు ప్రకారం.. 12 ఏళ్లలోపు చిన్నారులపై అత్యాచారం చేసిన వారికి ఉరిశిక్ష లేదా జీవితఖైదు విధించనున్నారు. మరణదండన లేదా చనిపోయే వరకు జైల్లో ఉంచుతారు. హోంమంత్రి గులాబ్ చంద్ కటారియా శుక్రవారం ప్రవేశపెట్టిన బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. కాగా, బాల నేరస్థుల విషయంలోనూ కఠినంగా వ్యవహరించాల్సిందేనని ఈ బిల్లులో పేర్కొన్నారు. ఎవరైనా మైనర్ ఈ తరహా నేరానికి పాల్పడితే ప్రస్తుత చట్టాల ప్రకారం గరిష్టంగా ఏడేళ్ల జైలు శిక్ష విధించేవారు. తాజాగా ఈ శిక్షను 14 సంవత్సరాలకు పెంచుతూ బిల్లులో మార్పులు చేశారు. అదేవిధంగా పసిపిల్లలపై సామూహిక అత్యాచారానికి తెగబడిన నిందితులకు గరిష్టంగా 20 ఏళ్ల జైలు శిక్ష విధించేలా బిల్లులో సవరణలు తీసుకొచ్చారు. దేశంలో మధ్యప్రదేశ్ తర్వాత ఈ చట్టాన్ని తీసుకొచ్చిన రెండో రాష్ట్రంగా రాజస్థాన్ నిలిచింది. జాతీయ నేర రికార్డుల నివేదిక ప్రకారం.. రాజస్థాన్‌లో చిన్నారులపై నేరాల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఒక్క 2016లోనే రాష్ట్ర వ్యాప్తంగా 4,034 కేసులు నమోదయ్యాయని సమాచారం. ఈ నేపథ్యంలో తాజా చట్టం ద్వారా ఈ నేరాలను అదుపుచేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

పెద్ద రుణాలకు పాస్‌పోర్టు తప్పనిసరి

- రూ. 50 కోట్లు దాటితే ఇవ్వాల్సిందే
- దేశం వదిలి పారిపోకుండా జాగ్రత్తలు
- ఆర్థిక మోసాల నేపథ్యంలో చర్యలు
- ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 10: బ్యాంకుల నుంచి భారీ మొత్తాల్లో రుణాలు తీసుకుని వాటిని తిరిగి చెల్లించకుండా మోసం చేసి విదేశాలకు పారిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం కొత్త నిబంధనలు పెట్టింది. రూ. 50 కోట్లు, అంతకంటే ఎక్కువ మొత్తంలో రుణాలు తీసుకునేవాళ్లు ఇక మీదట తప్పనిసరిగా తమ పాస్‌పోర్టు వివరాలను కూడా బ్యాంకులకు సమర్పించాలి. ఈ విషయాన్ని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి రాజీవ్ కుమార్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. కొత్తగా రుణాలు తీసుకునేవారితో పాటు ఇప్పటికే రూ. 50 కోట్ల పైబడి రుణాలు తీసుకున్న వారికి సంబంధించి కూడా పాస్‌పోర్టు వివరాలు తీసుకుని భద్రపరచాలని బ్యాంకులకు సూచించారు. మొత్తం భారీ రుణగ్రహీలందరి వివరాలను 45 రోజుల్లోగా సేకరించాలని తెలిపారు. ప్రస్తుతం రుణగ్రహీతలకు సంబంధించిన పాస్‌పోర్టు వివరాలు తమవద్ద లేకపోవడంతో కొన్నాళ్లుగా వాళ్లు రుణాలు తిరిగి చెల్లించకపోయినా, వాళ్లు దేశం వదిలి పారిపోకుండా బ్యాంకులు ఎలాంటి చర్య తీసుకోలేకపోతున్నాయి. అందుకే నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా, జై మెహతా లాంటి పలువురు భారీగా అప్పులు చేసి దేశం వదిలి పారిపోయారు. దాంతో వారి నుంచి రుణాలు తిరిగి వసూలుచేయలేక బ్యాంకులు తలపట్టుకుంటున్నాయి. అదే పాస్‌పోర్టు వివరాలు ముందే దగ్గర ఉంటే.. నాలుగైదు నెలలు రుణం కట్టడం మానేసిన వెంటనే ముందుగానే పోలీసులను, విమానాశ్రయాలు.. ఇతర మార్గాలను అప్రమత్తం చేసి వాళ్లు దేశం వదిలి పారిపోకుండా చూడటం లేదా పాస్‌పోర్టు బ్లాక్ చేయడం లాంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

ఆజమ్ ఖాన్..ఓ ఖిల్జీ

- నన్ను వేధించారు: జయప్రద



న్యూఢిల్లీ, మార్చి 10: సినీ నటి, మాజీ ఎంపీ జయప్రద సంచలన వ్యాఖ్యలు చేశారు. యూపీ ఎస్పీ నేత ఆజమ్ ఖాన్ తనను వేధించేవారని ఆమె ఆరోపించారు. తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్న సమయంలో ఆజమ్ ఖాన్ వేధింపులకు పాల్పడేవారన్నారు. పద్మావత్ చిత్రంలో ఉన్న ఖిల్జీ పాత్రతో ఆజమ్ ఖాన్‌ను పోల్చారామె. యూపీలోని రాంపూర్ ఎంపీ నియోజకవర్గం నుంచి జయప్రద పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. 2004 నుంచి 2014 వరకు ఆ నియోజకవర్గం నుంచే ఆమె గెలుపొందారు. అయితే అదే రాంపూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఆజమ్ ఖాన్ 9 సార్లు ఎన్నికయ్యారు. ఆజమ్ ఖాన్‌ది సమాజ్‌వాదీ పార్టీ కాగా, జయప్రదది రాష్ట్రీయ్ లోక్‌దళ్. 2009లో జరిగిన ఎన్నికల సమయంలో ఆజమ్ ఖాన్‌పై జయప్రద ఫిర్యాదులు చేసింది. తన ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ఆజమ్ ప్రయత్నిస్తున్నారని ఆమె గతంలో ఆరోపించారు. అయితే ఇవాళ జయప్రద ఆ ఆరోపణలను మరోసారి ధ్రువీకరించారు. పద్మావతి సినిమాలో విలన్ పాత్ర పోషించిన ఖిల్జీ క్యారెక్టర్.. ఆజమ్ ఖాన్‌ను గుర్తు చేసిందని జయప్రద అన్నారు. ఎన్నికల సమయంలో మార్ఫింగ్ చేసిన సీడీలను ఆజమ్ ఖాన్ సరఫరా చేశారని జయప్రద ఆరోపించారు.

ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లు

- జూన్ నాటికి దేశవ్యాప్తంగా అమలు
- జీఎస్టీ రిటర్న్స్ ఫైలింగ్ 3 నెలలు పొడిగింపు
- జీఎస్టీ మండలి సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 10: జీఎస్టీ ఎగవేతను నిరోధించేందుకు ప్రవేశపెట్టిన ఈ-వే (ఎలక్ట్రానిక్-వే) బిల్లు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఏప్రిల్ 1 నుంచి దశల వారీగా రాష్ట్రాల మధ్య జరిగే సరకు రవాణాకు ఈ-వే బిల్లు ఉంటుందని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. జూన్ 1 నాటికి దేశవ్యాప్తంగా ఈ-వే బిల్లు అమల్లోకి వస్తుంది పేర్కొంది. ఈ మేరకు శనివారం జరిగిన జీఎస్టీ మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.శనివారం ఢిల్లీలో 26వ జీఎస్టీ మండలి సమావేశం జరిగింది. కాగా.. జీఎస్టీ రిటర్న్‌ల సరళీకరణపై ఈ సమావేశంలోనూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సరళీకరణ ప్రక్రియపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మరోసారి ఈ అంశాన్ని వాయిదా వేశారు. దీంతో మరో మూడు నెలల పాటు జీఎస్టీఆర్ 3బీ ఫైలింగ్‌ను పొడిగిస్తున్నట్లు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. సమ్మరీ సేల్స్ రిటర్న్ జీఎస్టీఆర్-3బీని జూన్ వరకు దాఖలు చేయవచ్చునని తెలిపింది.




ఈ-వే బిల్లు అంటే..

రెండు రాష్ట్రాల మధ్య రూ.50వేలకు మించి విలువ గల సరకులు రవాణా చేయాలంటే ఈ-వే బిల్లు ఉండాలి. దీని ఆధారంగా సరకు ఎక్కడి నుంచి ఎక్కడికి రవాణా అవుతుందో ట్రాక్ చేసే అవకాశం ప్రభుత్వానికి ఉంటుంది. తక్కువ ఆదాయాన్ని చూపడం, పన్నుల ఎగవేత వంటి వాటిని ఈ ప్రక్రియ ద్వారా అరికట్టవచ్చు.

రైలు టికెట్లు బదిలీ చేయొచ్చు!

- కుటుంబ సభ్యుల పేరిట బదిలీకి అవకాశం
- ప్రయాణికులకు రైల్వే సరికొత్త సౌకర్యం

న్యూఢిల్లీ, మార్చి 10: రైల్వే ప్రయాణికులకు శుభవార్త. ఇకపై రైలు టికెట్లను వేరే వ్యక్తులకు బదిలీ చేసుకోవచ్చు. అందుకు అనుగుణంగా రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. అప్పుడెప్పుడో 1990వ దశకంలో దీనిపై నిబంధనలు రూపొందించినప్పటికీ విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో 1997లో ఒకసారి, 2002లో మరోసారి దానికి సవరణలు చేశారు. ఇప్పుడు తాజాగా కన్ఫర్మ్ అయిన రైలు టికెట్‌ను ఇంట్లో వాళ్లకు బదిలీ చేసుకునే వెసులుబాటును కల్పించింది రైల్వే శాఖ. తండ్రి, తల్లి, లేదంటే తోబుట్టువులు, పిల్లలు, భార్య పేరిట బదిలీ చేసుకోవచ్చు. అంతేగాకుండా ఆన్ డ్యూటీలో రైలులో ప్రయాణించే మరో ప్రభుత్వ ఉద్యోగికీ బదిలీ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇక, పెళ్లి బృందానికి సంబంధించి ఆ పెళ్లి పెద్ద విజ్ఞప్తి మేరకు ఆ బృందంలోని మరో వ్యక్తికి టికెట్‌ను ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. అయితే, టికెట్‌ను బదిలీ చేసుకోవాలంటే కనీసం రైలు బయల్దేరే 24 గంటల ముందే దానికి దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది.



మీది ఓ విఫల దేశం... మాకా 'హక్కుల' పాఠాలు చెప్పేది?

- మీ నుంచి నేర్చుకోవాల్సిన దుస్థితిలో లేం
- ఐరాసలో పాక్‌పై ధ్వజమెత్తిన భారత్

ఐక్యరాజ్యసమితి, మార్చి 10: కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ ఐక్యరాజ్య సమితిలో చేస్తున్న ఆరోపణలను భారత్ తిప్పి కొట్టింది. పాక్‌ను ఉగ్రవాద దేశంగా పరిగణిస్తూ భారత్ విమర్శలు చేసింది. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న మీరు మాకు పాఠాలు చెప్తున్నారా అని ప్రశ్నించింది. హక్కుల గురించి మీరు చెప్తే నేర్చుకోవాల్సిన పరిస్థితుల్లో భారత్ లేదని ఐరాసలో భారత కార్యదర్శి పాక్‌పై ధ్వజమెత్తారు. ఐరాసలో పాకిస్థాన్ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తింది. జమ్ముకశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ విషయమై వాదించింది. అదే విషయాన్ని నిన్న మరోసారి లేవనెత్తడానికి ప్రయత్నించడంతో ఐరాసలో భారత రెండో కార్యదర్శి మిని దేవి కుమమ్ పాక్‌పై తీవ్ర స్థాయిలో ఎదురుదాడికి దిగారు.''ఓ విఫలమైన దేశం నుంచి ప్రజాస్వామ్యం, మానవ హక్కులపై పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు. ఉగ్రవాదులను అరికట్టడంలో పాక్ విఫలమైన దేశం. అక్కడ ఉగ్రవాదులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అలాంటిది పాక్ భారత్‌లో మానవ హక్కుల పరిరక్షణ గురించి లెక్చర్లు ఇస్తోంది'' అని కుమమ్ పేర్కొన్నారు. అప్పుడు ఒసామా బిన్ లాడెన్‌ను పాక్‌లోనే దొరికాడు. తాజాగా ముంబై దాడుల కీలక సూత్రధారి హఫీజ్ సయీద్ అక్కడ స్వేచ్ఛగా తిరుగుతున్నాడని అన్నారు. 2008 ముంబయి దాడులు, 2016లో జరిగిన పఠాన్‌కోట్, ఉరి దాడుల్లో న్యాయం కోసం భారత్ ఎదురుచూస్తోందని, ఈ ఘటనలపై పాక్ కఠిన చర్యల తీసుకోవాలని డిమాండ్ చేశారు. సయీద్‌ను ఐరాసతో పాటు అమెరికా కూడా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. భారత్ సరిహద్దులో పాక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని కుమమ్ ఆరోపించారు. పాక్ కశ్మీర్ అంశంపై మాట్లాడడానికి ముందు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను ఖాళీ చేసి వెళ్లాలని అన్నారు. జమ్ముకశ్మీర్‌లో ఉన్న అసలైన సమస్య ఉగ్రవాదమని తెలిపారు. పాకిస్థాన్ నుంచి లేదా దాని ఆధీనంలోని ప్రాంతాల నుంచే ఉగ్రవాదులు ప్రవేశిస్తున్నారని పేర్కొన్నారు.



'ఎంఎల్‌ఏ' చిత్రంలో కాజల్, కల్యాణ్‌రామ్

'పెద్దపులి' అంటూ చిందేస్తున్న నితిన్



'నువ్వు పెద్ద పులినెక్కినావమ్మో గండిపేట గండి మైసమ్మ'' అనగానే ప్రతీ తెలుగు అభిమాని పూనకం వచ్చినట్టు డాన్సులు వేస్తారు. ఎందుకంటే ఆ పాటలో ఉన్న ఎనర్జీ అటువంటిది. ఇప్పుడీ పాటని నితిన్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్ రంగ'లో రీక్రియేట్ చేస్తున్నారు. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తుండగా, శ్రీమతి నిఖితారెడ్డి సమర్పణలో, పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్ మరియు శ్రేష్ఠ్ మూవీస్ పతాకాలపై నిర్మాణమవుతోంది. తెలంగాణ పెద్దమ్మ తల్లి గొప్పతనాన్ని చాటుతూ బోనాల సంబరాలలో పాడుకునే పాట 'పెద్ద పులి'. ఆ పాటని అంతే గొప్పగా, దాని స్థాయి ఏ మాత్రం తగ్గకుండా సంగీత దర్శకులు థమన్, రచయిత సాహితిగారు చాలా జాగ్రత్తగా రీక్రియేట్ చేశారు. పెద్ద పులిలాంటి పాట హీరో ఇంట్రడక్షన్ సాంగ్ అయితే, అదీ తెలంగాణ వాస్తవ్యుడైన నితిన్ 25వ చిత్రం అయితే, దానికి థమన్ తన ఫోక్ టచ్‌తో దానిని వేరే స్థాయికి తీసుకుని వెళ్తే, వీటన్నిటికీ మించి ఆ పాటకి శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో నితిన్ మాస్ స్టెప్స్ వేస్తే, ఇంకేముంది, థియేటర్లో ఫ్యాన్స్‌కి సంబరాలే. ఫోక్ సాంగ్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా మారిన రాహుల్ సిపిలిగంజ్ ఈ పాటని పాడారు. ఈ గీతం శుక్రవారం రాత్రి వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్‌లో యువత కేరింతలు, ఉత్సాహాల నడుమ విడుదల అయింది.

జూన్ 15న 'సమ్మోహనం'



● అదితిరావు, సుధీర్‌బాబు

అనూహ్యమైన కథాంశంతో ఆద్యంతం వినోదాత్మకంగా తెరకెక్కుతోన్న కొత్త తరం ప్రేమ కథా చిత్రం 'సమ్మోహనం'. జూన్ 15న ఈ సినిమా విడుదల కానుంది. సుధీర్‌బాబు హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. బాలీవుడ్ భామ అదితీరావు హైదరీ నాయిక. శ్రీదేవి మూవీస్ ప్రొడక్షన్ నెంబర్ 10గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సందర్భంగా నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ''ఫైనల్ షెడ్యూల్‌ని ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 3 వరకు హిమాచల్ ప్రదేశ్, ముంబైలో చేస్తాం. దాంతో షూటింగ్ పూర్తవుతుంది. ఏప్రిల్, మేలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు చేస్తాం. జూన్ 15న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చెప్పారు. దర్శకుడు మోహన కృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ ''కొత్త ఎత్తుగడ, కొత్త పోకడ ఉన్న ఈ నవతరం కథలో రొమాన్స్, హాస్యం సమ్మిళితమై ఉంటాయి. పి.జి.విందా ఫొటోగ్రఫీ, వివేక్ సాగర్ సంగీతం, రవీందర్ కళా దర్శకత్వం ఈ సినిమాలో స్పెషల్ హైలైట్స్. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తెరకెక్కిస్తున్నాం. మంచి కథ, కథనానికి చక్కటి నిర్మాణ విలువలు తోడయ్యాయి. టైటిల్‌కి తగ్గట్టుగానే సినిమా మొత్తం అందమైన ఫీల్ క్యారీ అయి సమ్మోహనంగా అనిపిస్తుంది'' అని అన్నారు.

అనుభూతినిచ్చే పెద్దారెడ్డి

సతీష్‌రెడ్డి, మౌర్యాని, ముంతాజ్ హీరో హీరోయిన్లుగా దర్శకుడు వి.జె.రెడ్డి రూపొందించిన చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి'. సిద్ధి విఘ్నేశ్వర క్రియేషన్స్ పతాకంపై సి.హెచ్.రఘునాథరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఆహ్లాదకరమైన ప్రేమకథగా ఈ సినిమా తెరకెక్కింది. చిత్ర నేపథ్యం భావోద్వేగాలతో ఉన్నా...కథనం ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. సెన్సార్ పూర్తి చేసుకొని యు/ఎ సర్టిఫికెట్ పొందిన ఈ చిత్రం మార్చి 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు వి.జె.రెడ్డి మాట్లాడుతూ ''పల్లె వాతావరణంలో సాగే కథ ఇది. పచ్చటి పైరుల అందాలు ప్రేక్షకులకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. ఇప్పటికే పాటలు శ్రోతల ఆదరణ పొందుతున్నాయి'' అన్నారు. హీరో సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ''నెల్లూరి పెద్దారెడ్డి పేరు అందరికీ తెలిసిందే. ఆ పెద్దారెడ్డి నవ్విస్తే....ఈ నెల్లూరి పెద్దారెడ్డి మీకు మర్చిపోలేని అనుభూతిని అందిస్తాడు'' అన్నారు.



● సతీష్‌రెడ్డి, మౌర్యాని



అంజలితో రెండో గీతాంజలి

హారర్ సినిమాల కంటే హారర్‌కి కామెడీని జోడించి రూపొందించిన సినిమాలు పెద్ద విజయాలు అందుకున్నాయి. అంజలి ప్రధాన పాత్రలో రాజకిరణ్ దర్శత్వంలో రూపొందిన 'గీతాంజలి' చిత్రం కూడా అదే కోవలోకి వస్తుంది. ఈ సినిమా కమర్షియల్‌గా పెద్ద విజయాన్ని సాధించింది. ఇప్పుడీ చిత్రానికి సీక్వెల్ రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు.

'గీతాంజలి 2' పేరుతో రూపొందే ఈ చిత్రం ద్వారా సుబ్బు దర్శకుడుగా పరిచయమవుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలోనే ఈ సీక్వెల్‌కి సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని కోన వెంకట్ నిర్మించనున్నారు. అంజలి, శ్రీనివాస్‌రెడ్డి ఈ సినిమాలో నటించబోతున్నారు. అంజలికి గీతాంజలి సినిమా మంచి పేరు తెచ్చి పెట్టింది. దానికి కొనసాగింపుగా ఈ సినిమా ఉంటుంది. మరి ఈ సినిమా అంజలికి ఎలాంటి పేరు తెస్తుందో చూడాలి.

వారి అప్రీసియేషన్ మరచిపోలేను...



చిరంజీవిగారు, రాజమౌళిగారు 'రంగస్థలం' సెట్ గురించి విని చూడటానికి వచ్చారు. రాజమౌళిగారైతే విలేజ్ సెట్‌లోని ప్రతి ఇంట్లోకి వెళ్లి చూశారు. ఇద్దరూ బాగా చేశామని అప్రిసియేట్ చేశారు. ఓ రోజు ప్రొడ్యూసర్‌గారు సెట్‌లోకి వచ్చారు. 'అసలు సెట్ ఎక్కడ' అని అడుగుతున్నారు. 'సార్..మీరు ఆల్‌రెడి సెట్‌లోనే ఉన్నారు' అని చెప్పగానే ఆయన థ్రిల్ అయ్యారు. సెట్‌ను అంత రియలిస్టిక్‌గా వేశారని అప్రిసియేట్ చేశారు. నేను పుట్టి పెరిగిందంతా.. హైదరాబాద్ సిటీలోనే, నా భార్య మోనిక ఢిల్లీకి చెందిన అమ్మాయి. ఇద్దరికీ అసలు 1985లో గ్రామాలు ఎలా



ఉంటాయనే దాని గురించి అవగాహనే లేదు. కానీ ఇద్దరం బాగా రీసెర్చ్ చేసి విలేజ్ సెట్‌ను డిజైన్ చేశాం. సాధారణంగా క్రియేటివ్ వర్క్ చేసేవారికి లాంగ్వేజ్, స్పేస్‌తో సంబంధం లేదు. ప్రతి విషయానికి ఓన్ చేసుకోవాలి. మేం ప్రతి చిన్న విషయాన్ని డీటెయిల్డ్‌గా రీసెర్చ్ చేసి దానికి తగినట్లు ప్లాన్ చేస్తాం. రియలిస్టిక్, ఫ్యూచరిస్టిక్, మెకానిజం ఇలా అన్నింటిపై మంచి అవగాహన ఉంది. ప్రతి విషయాన్ని చక్కగా విజువలైజ్ చేస్తాం.



తెలుగు సినిమా రేంజ్ పెరిగింది...

ఒకప్పుడు సౌత్ ఇండియన్ అంటే తమిళ్ అనే పేరు ఉండేది. కానీ ఇప్పుడు మారిపోయింది. హిందీని కూడా డామినేట్ చేస్తోంది తెలుగు పరిశ్రమ. మన సినిమా రేంజ్ పెరిగింది. సౌత్ ఫిలింస్ అనగానే ఇన్‌స్టిట్యూట్‌లో బాలచందర్‌వి, మలయాళం సినిమాలు వేసేవారు. నేను మాత్రం విశ్వనాథ్, బాపు, జంధ్యాల సినిమాలు ఉన్నాయని చెప్పేవాడిని. ఆ కోవలో చంద్రశేఖర్ ఏలేటి పేరు కూడా చెప్పేవాడిని. ఎందుకంటే నేను అమితంగా ఇష్టపడే దర్శకుల్లో ఏలేటిగారు ఒకరు. వ్యక్తిగా, డైరెక్టర్‌గా చాలా మంచివారు. మన ఇండియన్ సినిమాని ఇంటర్నేషనల్ లెవల్‌కి తీసుకెళ్లగల దర్శకుడు. ఆయన సినిమాలను నేను ఇష్టపడి చూస్తుంటాను. ఇప్పుడు యువతరంలో వస్తున్న దర్శకులు కొత్తగా ఆలోచిస్తున్నారు.



నాపై ఉన్న నమ్మకంతోనే..

సీనియర్ ఆర్ట్ డైరెక్టర్స్ అయితే ఆల్రెడి కొన్ని సినిమాలకు ఇలాంటి పల్లెటూరి సెట్స్ వేసుంటారు. కాబట్టి నిర్మాతలు ఈ సినిమాకు పెద్ద ఆర్ట్ డైరెక్టర్స్‌తో 'రంగస్థలం' సినిమా చేద్దామని అనుకున్నారు. కానీ సుకుమార్‌గారికి నాతోనే సినిమా చేయాలని ఉండటంతో.. నేనే కావాలని నిర్మాతలతో అన్నారు. ఆయన జడ్జ్‌మెంట్ రాంగ్ కాదని ఆయనకు ఉన్న బలమైన నమ్మకం ఉడటంతో నన్ను సినిమాలో భాగం చేశారు. రాజమండ్రిలో భారీ షెడ్యూల్ జరిగింది. తర్వాత విలేజ్ సెట్‌ను హైదరాబాద్‌లో క్రియేట్ చేశాం. సుకుమార్‌గారికి ఏం కావాలో నాకు తెలుసు కాబట్టి.. నేను వేసిన సెట్‌ను చూసి ఆయన షాక్ అయ్యారు.





'నేనెదైతే ఊహించుకున్నానో అలాగే సెట్‌లో ఉంది. సాధారణంగా సెట్ పూర్తయిన తర్వాత సెట్‌లో ఏది ఎక్కడ ఉండాలనే దానిపై డైరెక్టర్ టీంతో కష్టపడాల్సి ఉంటుంది. కానీ నాకు ఆ సమస్య లేకుండా ఇలా వచ్చి అలా షూట్ చేసుకుని వెళ్లిపోయేలా ఎక్కడ ఏది ఉండాలో అక్కడ అది ఉంది..చాలా బాగా సెట్ వేశావ్' అన్నారు.

బాధ్యతగా ఫీలవుతాం...

అవుట్‌పుట్ విషయంలో ఇద్దరం బాధ్యతగా ఫీలవుతాం. క్వాలిటీ పరంగా ఇద్దరం సెట్స్‌లో కాంప్రమైజ్ అవలేం. అలాగని ఒకరిపై ఒకరు అరుచుకోవడమనేది కూడా ఉండదు. అర్థమయ్యేలా వివరించుకుంటుంటాం. మా టీంలో పనిచేసే సభ్యులతో కూడా కూల్‌గానే బిహేవ్ చేస్తుంటాం. ఏదైనా సమస్య వస్తే.. దాన్నెలా పరిష్కరించుకుంటే బావుంటుందనే విషయంపై ఫోకస్ పెడతాం. ఏదైనా టెన్షన్ పడే పాయింట్ ఉన్నా కూడా.. ఆ టెన్షన్ కూడా మేమే తీసుకుంటాం. అలా చేయడం వల్ల మనతో పనిచేసే సభ్యులు కూడా వారి తప్పేంటో తెలుసుకుంటారు. అలాగే మరోసారి ఆ తప్పు చేయరు.

నేర్చుకోవడంతోనే అప్‌డేటింగ్...

ప్రతి సినిమాలో మేం చేసే రీసెర్చ్ వల్ల తెలిసే విషయాలతోనే అప్‌డేట్ అవుతుంటాం. ఉదాహరణకు 'రంగస్థలం' సినిమా కోసం విలేజ్ సెట్ వేశాం. మా ఇద్దరికీ పల్లెటూర్లు ఎలా ఉంటాయనే సంగతే తెలియదు. రీసెర్చ్ చేయడం వల్ల చాలా విషయాలు తెలుసుకున్నాం. ప్రతి రోజూ కొత్తగా కష్టపడటాన్ని ఇష్టపడుతుంటాం.







పండుగలు, పుట్టినరోజులు కూడా జరుపుకోం. ఎందుకంటే ఆ సమయంలో సినిమాకు సంబంధించిన పనుల్లో బిజీగా ఉంటుంటాం. మనం చేసే పనిపై ఆసక్తి, ప్రేమ ఉంటే ఆటోమెటిక్‌గా మనం కొత్త విషయాలు నేర్చుకోవడానికి రెడీ అయిపోతుంటాం.

తదుపరి చిత్రాలు...

సెలక్టెడ్ సినిమాలనే చేస్తుంటాం. స్వర్గీయ ఎన్టీఆర్ బయోపిక్ 'యన్.టి.ఆర్'తో పాటు, వరుణ్‌తేజ్, సంకల్ప్ మూవీలు చేయబోతున్నాం. ఇక్కడ ప్రస్తావించాల్సిన విషయమేమంటే ఎన్టీఆర్‌గారి బయోపిక్ 1950-60కి చెందింది. అలాగే వరుణ్, సంకల్ప్ మూవీ స్పేస్ మూవీ. రెండు సినిమాలు వేటివకే ప్రత్యేకమైనవి. ఒకదానికొకటి సారూప్యత లేదు.

ప్రత్యేక హోదా – ఆంధ్రుల హక్కు


- గళమెత్తిన కర్ణాటకలోని తెలుగు ప్రజా సంఘాలు
- పక్కరాష్ట్రాలతో సఖ్యత దెబ్బతీసేలా జైట్లీ ప్రకటన
- ఇప్పటి వరకు చేసేందే ఎక్కువన్న మోదీపై ఆగ్రహం

బెంగళూరు, మార్చి 10: ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని కర్ణాటక రాష్ట్రంలోని తెలుగు ప్రజా సంఘాలు గళమెత్తాయి. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించకపోవడంతో రాష్ట్రానికి, ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని బెంగళూరులో ప్రవాసాంధ్రులు అధికంగా ఉండే కృష్ణరాజపురం అసెంబ్లీ నియోజకవర్గం వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా –ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో స్థానిక రామ్మూర్తి నగర్‌లో నిర్వహించిన సమావేశంలో పలు తెలుగు సంఘాల నాయకులు, ప్రతినిధులు, తెలుగు భాషాభిమానులు, రాజకీయ నాయకులు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు జరిగిన అన్యాయంపై తమ గళం వినిపించారు. ఈ నష్టం ఎందుకు జరిగింది, ఎవరి వల్ల జరిగింది అనే అంశంపై పలువురు తమ వాదనలు వినిపించారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయము, చేయలేమంటూ కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ మార్చి 6న తేల్చి చెప్పారని, అంతేకాక పక్కనున్న రాష్ట్రాలకు కూడా లేని ఆలోచనలు రేపి, ఏపీకి ఆయా రాష్ట్రాలతో ఉన్న సక్యతను చెడగొట్టే విధంగా ఆయన ప్రకటన ఉందని పలువురు అన్నారు. ప్రత్యేక హోదాతో పారిశ్రామిక రాయితీలు వస్తాయని, అనివార్యంగా పరిశ్రమలు ఏర్పడుతాయని, మన యువతకు ఉపాధి దొరుకుతుందని, కేంద్ర సంస్థలు, విద్యా సంస్థలు ఏర్పాటవుతాయని పలువురు పేర్కొన్నారు. ప్రత్యేక హోదా వల్ల తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మాదిరి కేంద్రం నుంచి సుమారు 100 కోట్ల నిధులు వచ్చే అవకాశం ఉందని, ఈ నిధులతో తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి వికాసం సాధ్యమవుతుందని, భాష అభివృద్ధితోనే జాతి మనుగుడ సాధ్యమని పలువురు అభిప్రాయ0వ్యక్తంచేశారు. ఇవేవి చేయకపోగా, ఇప్పటివరకు చేసిందే ఎక్కువని చెబుతున్న మోదీపై పలువురు నిప్పులు చెరిగారు. మనం ఏమి చేయాలో తేల్చుకోవాల్సిన అవసరముందని, స్వాతంత్ర్యం నుంచి విశాఖ ఉక్కు వరకు అన్ని పోరాటంతో సాధించుకున్నవే అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని కోరుతున్న ప్రతిఒక్కరూ గొంతు వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేత, ఆర్‌ఆర్ స్టీల్ అధినేత దామోదర్ రాజు, తెలుగు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సిద్ధం నారయ్య, తెలుగు మిత్రులు ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, తెలుగు సాంస్క తిక సమితి నాయకుడు జోగి బుజ్జిబాబు, వెంకటేశ్వర్లు, దాసు, రైల్వే యూనియన్ నాయకులు కట్టా రామయ్య, తెలుగు అసోసియేషన్ ఆఫ్ కర్ణాటక (టా కా)నాయకులు సుబ్బారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వీరా రెడ్డి, తెలుగు తేజం సంపాదకులు బొగ్గవరపు మాల్యాద్రి, పెద్ద సంఖ్యలో తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.



తమిళనాడులో ‘తెలుగు అకాడమీ’

- ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు కృషి
- లింగ్విస్టిక్ మైనారిటీ ఫోరంతో చంద్రబాబు



అమరావతి, మార్చి 10 (మనం ప్రతినిధి): తమిళనాడులో తెలుగు అకాడమీ, సాంస్కృతిక కేంద్రం ఏర్పాటుకు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ప్రయత్నిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. శనివారం సచివాలయంలో ఆయనతో లింగ్విస్టిక్ మైనారిటీ ఫోరం ఆఫ్ తమిళనాడు అధ్యక్షుడు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి నేతృత్వంలో పలువురు ప్రతినిధులు భేటీ అయ్యారు. తమిళనాడులో మాతృ భాషలో విద్యాభ్యాసం జరిగేలా తమిళనాడు ప్రభుత్వాన్ని ఒప్పించే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. అందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఏటా కోర్టు ఆదేశాల మేరకు తమిళేతరులకు మాతృ భాషలో పదో తరగతి పరీక్షలు రాసేందుకు తమిళనాడు ప్రభుత్వం అనుమతిస్తోందని ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి వ్యక్తులు దేశంలో మరొకరు లేరని ప్రతినిధులు అన్నారు. తమిళనాడులో నలభై శాతం ఇతర భాషలవారు వారివారి మాతృ భాషలో విద్యనభ్యసించేందుకు ఆసక్తి చూపుతున్నారని ప్రతినిధులు వివరించారు. తమిళనాడులో తెలుగు, ఉర్దూతో పాటు పలు ఇతర భాషావాదులు మాతృ భాషలో చదుకోవడంలో వివక్షకు గురవుతున్నారని ప్రతినిధులు సీఎంకు వివరించారు.

రాఫెల్ డీల్‌కు అవినీతి మరక

- విమానాలకు అధిక మొత్తం చెల్లింపు
- ఆరోపణలు ఎదురైతే దాక్కోవడమెందుకు?
- కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డ కాంగ్రెస్



న్యూఢిల్లీ, మార్చి 10: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో ఎన్‌డీఏ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఫ్రాన్స్ అధ్యక్షుడి భారత పర్యటన నేపథ్యంలో తాజాగా మరోసారి రాఫెల్ డీల్ వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చింది. ఈ డీల్‌లో ఒక్కో విమానం కొనుగోలుకు ఫ్రాన్స్‌కు ఎక్కువ మొత్తం చెల్లించారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి టామ్ వడక్కన్ ఆరోపించారు. ఫ్రాన్స్ నుంచి అవే యుద్ధ విమానాలను ఈజిప్ట్, ఖతార్ తక్కువ మొత్తానికే కొనుగోలు చేస్తే భారత్ మాత్రం ఒక్కో విమానంపై దాదాపు 351 కోట్లు ఎక్కువ చెల్లించిందని విమర్శించారు. ఈ మొత్తం ఎవరి జేబుల్లోకి వెళ్లిందని అడుగుతున్న ప్రజలకు మోదీ ప్రభుత్వం జవాబివ్వాలని అన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ మూడు రోజులుగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నా.. ప్రభుత్వ పెద్దల్లో ఉలుకూ పలుకు లేదని వడక్కన్ మండిపడ్డారు. అయితే, రాఫెల్ డీల్‌లో ఎలాంటి అవినీతి చోటుచేసుకోలేదని బీజేపీ స్పష్టం చేసింది. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలను ప్రచారం చేస్తూ ప్రజల్లో అయోమయం రేకెత్తించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. యుద్ధ విమానాల కొనుగోలు ప్రక్రియపై బాధ్యతారాహిత్యంగా కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు గుప్పిస్తోందని నితిన్ గడ్కర్ విమర్శించారు. ఈ డీల్‌లో అవినీతి ఎక్కడుందని ఆయన ప్రశ్నించారు. దీనిపై కాంగ్రెస్ మరోసారి స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వ వ్యవహారం ‘పిల్ల కళ్లు మూసుకుని పాలు తాగిన చందం’గా ఉందని ఎద్దేవా చేసింది. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన డీల్‌లో జరిగింది అవినీతి కాకపోతే మరేంటని ప్రభుత్వాన్ని నిలదీసింది. ఫ్రాన్స్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఈ డీల్‌కు అవినీతి మరకలు అంటకపోతే కేంద్ర ప్రభుత్వం, రక్షణ శాఖ తమ నిజాయితీ నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కానీ ఆరోపణలు ఎదురైతే దాక్కోవడమెందుకని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి టామ్ వడక్కన్ ప్రశ్నించారు.

తుపాకీతో సెల్ఫీ.. ప్రాణం తీసింది!

- ప్రమాద వశాత్తు పేలిన తుపాకీ.. ఢిల్లీలో ఘటన

న్యూఢల్లీ, మార్చి10 : సెల్ఫీ పిచ్చి ప్రాణాలు తీస్తున్నా జనాలు మాత్రం ఆ ప్రాణాంతక పోకడను మాత్రం వీడట్లేదు. ఢిల్లీలో తుపాకీతో సెల్ఫీ తీసుకున్న ఘటనలో ఓ వ్యక్తి మరణించాడు. అన్నాచెల్లెళ్లు (కజిన్స్) తుపాకీతో సెల్ఫీ తీసుకుంటుండగా.. ప్రమాదవశాత్తూ అది పేలి వ్యక్తి మతిచెందాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పాళి గ్రామానికి చెందిన ప్రశాంత్ చౌహాన్ (23).... గురువారం ఢిల్లీలోని సరితా విహార్‌లోగల తన బాబాయి ఇంటికి వెళ్లాడు. అక్కడ తన సోదరి (17)తో కలిసి సెల్ఫీలు తీసుకున్నాడు. అయితే, ఆ అమ్మాయి తన తండ్రి వాడే తుపాకీని తీసుకొచ్చి సెల్ఫీ తీసుకోవడానికి ప్రయత్నించింది. అయితే, అది కాస్తా బెడిసికొట్టడంతో తుపాకీ మిస్‌ఫైర్ అయి బుల్లెట్ ప్రశాంత్ చౌహాన్‌కు తగిలింది. దీంతో వెంటనే అతడిని ఆమె కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. ప్రశాంత్ చౌహాన్ షాహ్దారాలో కాంట్రాక్ట్ టీచర్‌గా పనిచేస్తుండేవాడు. కాగా, ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ అమ్మాయి తండ్రి నిర్లక్ష్యంగా వ్యవహరించాడా అన్న దానిని ఆరా తీస్తున్నారు.

సిమెంటు ధరల మంట

ఐరన్.. ఇసుకదీ అదే దారి.. పేదోడి సొంతింటి కలపై నీళ్లు

- ఆకాశాన్నంటుతున్న నిర్మాణ ఖర్చు
- కేబినెట్ కమిటీతోనూ ఫలితం సున్నా
- మరింతగా పెరిగిపోతున్న ధరలు
- కఠిన చర్యలకు ప్రభుత్వానికి మొర



విశాఖపట్నం, మార్చి 10 (మనం న్యూస్ బ్యూరో): సొంత ఇల్లు.. ప్రతి సామాన్యుడి కల. ఆ స్వప్నం పేద, మధ్య తరగతి జీవికి అందనంత ఎత్తుకు పోతోంది. రోజు రోజుకూ పెరిగిపోతున్న సిమెంటు, ఐరన్ ధరలు ఆ కలను కలగానే మిగిల్చేస్తున్నాయి. నిర్మాణ వ్యయం భారీగా పెరుగుతుండడంతో సొంతింటి ఆలోచనే పేదోడి గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తోంది. పెరిగిన ధరల కారణంగా పనులు ఆగిపోతుండడంతో నిర్మాణ కార్మికులకూ దిక్కు తోచని స్థితి ఏర్పడింది. పనులు లేక కూలీలు పస్తులుండాల్సివస్తుంది. పొరుగు రాష్ట్రాల్లో లేని విచిత్రమైన ఈ సమస్య ఏపీ ప్రజలనే వేధిస్తోంది. దీంతో రాష్ట్రంలో నిర్మాణ రంగం పడకేసింది.

ఒక్కసారిగా పెరిగిన సిమెంటు, ఐరన్ ధరలు

రాష్ట్రంలో సిమెంటు, ఐరన్ ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. ఐరన్ మార్కెట్, ధరల విషయంలో దేశమంతా ఒకే రకమైన పరిస్థితి నెలకొన్నప్పటికీ సిమెంటు ధరలు మాత్రం రాష్ట్రానికి ఒక రకంగా ఉంటున్నాయి. రెండు నెలల క్రితం రూ.37 వేల వద్ద ఉన్న టన్ను ఐరన్ ఇప్పుడు రూ.50 వేల కు చేరింది. ఇది ఇంకా పెరిగే అవకాశాలున్నాయని నిర్మాణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఇక నెల క్రితం రూ.270 నుంచి రూ.290 మధ్య ఉన్న బస్తా సిమెంటు ధర ఇప్పుడు రూ.310 నుంచి రూ.320 మధ్యకు చేరింది. కంపెనీలు కుమ్మక్కై బస్తాకు రూ.40 నుంచి రూ.50 వరకూ పెంచాయి. ఇళ్లు నిర్మించుకొనే పేద, మధ్య తరగతి వర్గాల వారితోపాటు చిన్న కాంట్రాక్టర్లు, బిల్డర్లు కూడా ఈ ధరలతో నిర్మాణాలు చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. పనులు ఆగిపోతున్న కారణంగా కూలీలు రోడ్డున పడుతున్నారు.

సరిహద్దు రాష్ట్రాల నుంచి అక్రమ దిగుమతులు

ఆంధ్రాలో సిమెంటు ధరలు ఎక్కువగా ఉండడంతో సరిహద్దు రాష్ట్రాలైన ఒడిశా, తమిళనాడు, తెలంగాణ నుంచి సిమెంటు అక్రమంగా దిగుమతి అవుతోంది. అధికారుల కన్నుకప్పి పెద్ద పెద్ద బిల్డర్లు యధేచ్ఛగా తమ పని కానించేస్తున్నారు. ఒడిశాలో సిమెంటు బస్తా ధర రూ.260గా ఉండడంతో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల వారు అక్రమంగా జీప్‌లు, వ్యాన్‌లతో దిగుమతి చేసుకొంటున్నారు. ఇలా దిగుమతి చేసుకొంటున్న సిమెంటును విజయనగరం అధికారులు నాలుగు రోజుల క్రితం పట్టుకొన్నారు. అక్రమ సిమెంటు రవాణాపై నిఘా పెట్టనున్నట్లు చెప్పారు. తమిళనాడు నుంచి సరిహద్దు జిల్లాలకు సిమెంటు దిగుమతులు యధేచ్ఛగా సాగుతున్నాయి. ఎటొచ్చి చిన్న కాంట్రాక్టర్లు, సామాన్యులే ఇబ్బందుల పాలవుతున్నారు.

సిమెంటుకు తోడు ఇసుక

ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తామని ప్రకటించినప్పటికీ కిందిస్థాయి అధికార పార్టీ నేతలు, అధికారుల అడ్డదారులు తొక్కుతున్నారు. దీంతో ఇసుక కూడా తడిసి మోపెడవుతోంది. లారీ ఇసుక రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పలుకుతోంది. ట్రాక్టర్లు, బళ్ల మీద తరలించే ఇసుకకు కూడా లంచాలు చెల్లించాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వం దీనిపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు వాపోతున్నారు. నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరగడంతో తమ సొంతింటి కల అటకెక్కుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ కమిటీలతో ప్రయోజనమేదీ?

గతంలో సిమెంట్ ధరలను అమాంతం పెంచేసినప్పుడు తెలంగాణ ప్రభుత్వం కంపెనీ ప్రతినిధులను సమావేశపరిచి గట్టి హెచ్చరించి ధరలు తగ్గించేలా చర్యలు తీసుకుంది. ఏపీలోనూ ఈ తరహాలో కొంత మేర ప్రయత్నం జరిగింది. ప్రజలు, బిల్డర్ల నుంచి సిమెంటు ధరల పెంపుదలపై ఒత్తిడి రావడంతో ముగ్గురు మంత్రులతో కూడిన సబ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. సిమెంటు కంపెనీల యాజమాన్యాలతో చర్చలు జరిపి ధరలను తగ్గింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు కూడా నిర్వహించింది. కానీ ప్రయోజనం శూన్యం. ధరలు తగ్గలేదు కదా.. ఇంకా పైపైకి పోతున్నాయి. ప్రభుత్వ చిత్తశుద్ధి లోపం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని నిర్మాణ రంగ నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుని.. సిమెంటుతో పాటు ఇతర నిర్మాణ సామగ్రి ధరలు కూడా తగ్గేలా చొరవ తీసుకోవాలని ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.



టీడీపీతో పొత్తు వల్ల నష్టపోయాం

- బీజేపీ యువ మోర్చా ఏపీ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (మనం ప్రతినిధి): బీజేపీతో పొత్తు వల్ల తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి లబ్ధి పొందిందని, బీజేపీ మాత్రం నష్టపోయిందని బీజేపీ యువ మోర్చ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రమే నిధులు కేటాయిస్తుంటే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.9వేల కోట్లు ఎందుకు కేటాయించారో రాష్ట్ర ప్రజలకు వివరించాలన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, వారి తప్పులను కప్పిపుచ్చుకోవడానికి బీజేపీపై నెపం వేస్తున్నారన్నారు. రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, హోంగార్డుల జీతాలు పెంపు వంటి అంశాల్లో టీడీపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రత్యేక హోదా పేరుతో కొత్త డ్రామాను తెరపైకి తెచ్చారని ఆయన విమర్శించారు. ప్రజా ప్రయోజనాలే ముఖ్యం అనుకుంటే, రాయలసీమ, ఉత్తరాంధ్ర సమస్యలను పరిష్కరించాలని రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని అన్నారు. ఇవన్నీ నెరవేర్చని పక్షంలో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, 2019 ఎన్నికల్లో బీజేపీ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. పొత్తులు, ఎత్తులతో సంబంధం లేకుండా రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక రకాలుగా సహకరిస్తూనే ఉందన్నారు.

కాలిఫోర్నియాలో కాల్పుల మోత



వెటరన్ హోంలో ముగ్గురు మహిళల కాల్చివేత

లాస్‌ఏంజిలిస్, మార్చి 10: అమెరికాలో మళ్లీ కాల్పుల మోత వినిపించింది. కాలిఫోర్నియాలో ఉన్న అతిపెద్ద వెటరన్స్ హోం(మాజీ సైనికుల హోం)లో సాయుధుడైన దుండగుడు ముగ్గురు మహిళలను కాల్చి చంపాడు. దుండగుడు కూడా చనిపోయి కనిపించాడని కాలిఫోర్నియా హైవే గస్తీ పోలీసులు వెల్లడించారు. తొలుత దుండగుడు ముగ్గురు వ్యక్తులను నిర్బంధంలోకి తీసుకున్నట్లు పోలీసులు భావించారు. పోలీసులకు, దుండగుడికి మధ్య కొద్దిసేపు కాల్పులు జరిగాయి. తర్వాత హోంలో పరిశీలించి చూడగా దుండగుడు సహా నలుగురు మరణించి కనిపించారు. అయితే వెటరన్స్ హోంలో ఉన్న ఆ ముగ్గురు మహిళలనే దుండగుడు ఎందుకు చంపాడనే విషయం తెలియరాలేదు. వారితో దుండగుడికి ఏదైనా సంబంధం ఉందా అనే విషయం స్పష్టం కాలేదు. దుండగుడి వివరాలను గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. చనిపోయిన ముగ్గురు మహిళలు వెటరన్స్ హోంలోని పాత్‌వే హోం ఉద్యోగులని గుర్తించారు. పలు యుద్ధాల్లో పాల్గొని మానసిక ఒత్తిడితో బాధపడుతున్న సైనికులకు పాత్‌వే హోం కౌన్సిలింగ్ ఇస్తారు. అమెరికాలోనే అతి పెద్ద వెటరన్స్ హోం ఇది. దీన్ని 1984లో ప్రారంభించారు. ఇందులో వృద్ధులు, వికలాంగులు దాదాపు వెయ్యి మంది ఉంటారని అక్కడి వెటరన్స్ అఫైర్స్ విభాగం వెల్లడించింది. రెండో ప్రపంచ యుద్ధం, కొరియా యుద్ధం, వియత్నాం యుద్ధం, ఇరాకీ ఆపరేషన్స్ తదితర వాటిల్లో పాల్గొన్న వారు ఈ వెటరన్స్ హోంలో ఉంటున్నారు. ఇందులో 1200 సీట్లతో థియేటర్, గోల్ఫ్ కోర్స్, బేస్‌బాల్ స్టేడియం, బౌలింగ్ లేన్స్, స్విమ్మింగ్ పూల్ తదితర ఎన్నో సదుపాయాలు ఉంటాయి.

రాజస్థాన్‌లో మహిళపై గ్యాంగ్‌రేప్

- వీడియోను సోషల్‌మీడియాలో పెట్టిన నిందితులు

జైపూర్, మార్చి 10: రాజస్థాన్‌లో బారన్ జిల్లాలో ఓ 40 ఏళ్ల మహిళపై గ్యాంగ్‌రేప్ జరిగింది. ఆరుగురు యువకులు మహిళపై దుశ్చర్యకు పాల్పడ్డారు. ఈ దారుణాన్ని వీడియో తీసి దానిని సోషల్ మీడియాలో పెట్టారు. దాదాపు నెల రోజుల క్రితం ఈ ఘటన జరిగింది. వీడియో ఇంటర్నెట్‌లో ఉన్నదన్న విషయం తెలుసుకున్న బాధిత మహిళ ఎట్టకేలకు పోలీసులను ఆశ్రయించింది. బారన్ జిల్లాలోని మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె చెప్పిన వివరాల ఆధారంగా పోలీసులు ఆ యువకులపై ఐపీసీ సెక్షన్ 376 కేసుతో పాటు ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. అయితే ఆ యువకులు పరారీలో ఉన్నారు. బాధిత మహిళ కోటా గ్రామ సమీపంలో రహదారి పక్కన ఉండే ఓ డాబాలో పని చేస్తోంది. నెల రోజుల క్రితం బారన్‌లోని తన బంధువుల ఇంటికి ఆమె వెళ్లింది. నిందితుల్లో ఒక్కరైన చేతన్ మీనా(21) సంసాపూరా గ్రామం వద్ద బాధిత మహిళను తన బైక్‌పై ఎక్కించుకున్నాడు. బాగా తెలిసిన వ్యక్తి కావడంతో ఆమె అతని వాహనం ఎక్కింది. మీనాతోపాటు మరో ఐదుగురు కలిసి తనపై అత్యాచారానికి పాల్పడ్డారని, అదంతా వీడియో తీశారని బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొంది. తర్వాతి రోజు ఉదయం ఆమెను తిరిగి తన బంధువుల ఇంటి వద్ద వదిలిపెట్టారు. విషయం ఎవరికైనా చెబితే తన కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించారు. వీడియో ఇంటర్నెట్‌లో ఉందని తెలిసి ధైర్యం తెచ్చుకుని ఆమె పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాహ్మణ కోపాగ్నికి ఆహుతైపోతావ్

ఐవైఆర్ తీరుపై ఆనంద్ సూర్య మండిపాటు




అమరావతి, మార్చి 10 (మనం ప్రతినిధి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐవైఆర్ కృష్ణారావును గౌరవించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని చేసి తదుపరి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించారని.. ఆయన బ్రాహ్మణులకు సేవ చేయటం బదులు వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డికి అమ్ముడుబోయారని, సొంత ఎజెండాతో కార్పొరేషన్‌ను భ్రష్టు పట్టించారని ప్రస్తుత చైర్మన్ ఆనంద్ సూర్య అన్నారు. శనివారం విజయవాడలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని గురించి, ప్రత్యేక హోదా గురించి వివిధ వేదికల మీద మొసలి కన్నీరు కారుస్తున్న ఐవైఆర్ ఖబడ్దార్ అని హెచ్చరించారు. అర్చకుల విషయంలో పూర్తిగా అవగాహన లేకుండా ప్రభుత్వంపై అర్థరహిత విమర్శలు చేస్తూ అర్చకులను, బ్రాహ్మణులను తప్పుదోవ పట్టించేలా జగన్ తొత్తుగా వ్యవహరించటం చాలా దురదృష్టకరమని అన్నారు. ఇటీవల కాలంలో అర్చకుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ప్రభుత్వం కొన్ని సానుకూల నిర్ణయాలు తీసుకుందని ఆనంద్ సూర్య అన్నారు. అర్చకులను తప్పుదోవ పట్టించే విధంగా ఐవైఆర్ మాట్లాడటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. గతంలో అర్చకుల సమస్యలను మరిచిన ఐవైఆర్ ఇప్పుడు బ్రాహ్మణ, అర్చక సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న టీడీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుపై విమర్శలు చేయడం సరికాదని తెలిపారు. రాజధాని గురించి, ప్రత్యేక హోదా గురించి ఐవైఆర్ వివిధ సందర్భాల్లో ముఖ్యమంత్రిపై అవాకులు, చెవాకులు పేలుస్తున్నారని, ఇంకోసారి ఇలా జరిగితే మర్యాద దక్కదని హెచ్చరించారు. ప్రత్యేక హోదా కోసం చేస్తున్న పోరాటంలో ముఖ్యమంత్రి అగ్రభాగాన ఉన్నారని తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాల వలన ప్రత్యేక హోదా ఇవ్వలేకపోయినా, అంతే స్థాయిలో చట్టబద్ధతతో కూడిన ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామంటే ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల మేలు కోసం ఒప్పుకున్నారని, ప్రత్యేక హోదా వద్దని ఎప్పుడూ అనలేదని ఆయన తెలిపారు. అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పుడు.. ప్రత్యేక హోదాయే ముఖ్యమంత్రి ముఖ్య అజెండా అని, హోదాపై కేంద్ర ప్రభుత్వం మీద ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రజానీకం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఐవైఆర్ లాంటి వ్యక్తులు వేదికలపై ఇలాగే వ్యవహరిస్తే అధోగతి పాలవటం తథ్యమని, ఇది గుర్తుంచుకుని మసలుకోవాలని హితవు చెప్పారు. లేకపోతే బ్రాహ్మణుల కోపాగ్నికి ఆహుతైపోతారని హెచ్చరించారు.


గుజరాత్ వద్దంటే.. మనకెందుకు?


కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రంతో ప్రమాదం.. ప్రజాభిప్రాయానికి గుజరాత్ సీఎం పెద్దపీట.. సస్యశ్యామలమైన భూములు ఇవ్వడం ఎందుకు.. సీఎం చంద్రబాబుకు ఈఏఎస్ శర్మ లేఖాస్త్రం


విశాఖపట్నం, మార్చి 10 (మనం న్యూస్‌బ్యూరో): గుజరాత్‌లో ఏర్పాటుచేయదలచిన అణువిద్యుత్ కేంద్రాన్ని అక్కడి ప్రజలు వద్దని వ్యతిరేకిస్తే... వెస్టింగ్ హౌస్ అనే అమెరికా కంపెనీ పెట్టే ఆ అణు విద్యుత్ ప్రాజెక్టును శ్రీకాకుళం జిల్లా కొవ్వాడలో పెట్టాలని ఏపీ ప్రభుత్వం అడగడం హాస్యాస్పదంగా ఉందని ఫోరం ఫర్ బెటర్ విశాఖ కన్వీనర్ ఈఏఎస్ శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఒక లేఖ రాశారు. గుజరాత్ శాసన సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. అణువిద్యుత్ కేంద్రం వద్దని స్థానికులు వ్యతిరేకిడంతో దాన్ని రద్దుచేసినట్లు గుజరాత్ సీఎం విజయ్ రూపాని అసెంబ్లీలో చెప్పారని శర్మ అన్నారు. అందుకే మిథ్తీ వీర్ది లేదా గుజరాత్‌లో ఎక్కడా కూడా ఆ తరహా ప్లాంటు పెట్టకూడదని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అదే వెస్టింగ్ హౌస్ కంపెనీ దాదాపు దివాలా తీసేదశకు చేరుకుని.. ఎలాగా అని ఆలోచిస్తున్నపుడు ఏపీ ప్రభుత్వం వారికి అండగా నిలబడి.. ఏపీలోని సస్యశ్యామలమైన కొవ్వాడ ప్రాంతంలో గల వ్యవసాయ భూములను బలవంతంగా సేకరించి వారికి కట్టబెట్టిందని ఈఏఎస్ శర్మ ఆ లేఖలో ఆరోపించారు. వ్యవసాయం మీదే ఆధారపడే వందలాది ప్రజల ఉపాధికి, సంప్రదాయ మత్స్యకారుల జీవితాలకు భంగం కలిగించడం ఏ మాత్రం సమంజసమో చిత్తశుద్ధితో ఆలోచించాలన్నారు. జపాన్‌లోని ఫుకుషిమా అణు విద్యుత్ కేంద్రంలో జరిగిన ఘోర ప్రమాదాన్ని కొవ్వాడ ప్రజలు కూడా టీవీలలో చూసి, పత్రికలలో చదివారని.. దాంతో ఇప్పుడు వారు కూడా గుజరాత్ ప్రజల్లాగే భయాందోళనలకు గురవుతున్నారని ఆయన చెప్పారు. గుజరాత్ ప్రభుత్వం ప్రజల ఉద్దేశాలను గౌరవించి స్పందించిదని, అదే ఏపీ ప్రభుత్వం మాత్రం ప్రజల మనోభావాలను పక్కన పెట్టి వెస్టింగ్ హౌస్ కంపెనీకి లాభాలు కలిగించేలా స్పందిస్తోందని మండిపడ్డారు. ఈ కేంద్రాల వల్ల ఉపాధి అవకాశాలు చాలా తక్కువని, కానీ దీనివల్ల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గుజరాత్ సీఎం అక్కడ అసెంబ్లీలో చెప్పిన విషయాలను దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన కోరారు.



(ఫైల్ ఫొటో)







ఆధారం: మినిస్ట్రీ ఆఫ్ స్టీల్



చెన్నై: ప్రచురణ సంస్థ పల్సస్ గ్రూప్ తన సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో చెన్నై సెజ్‌లో నూతన పెట్టుబడులు పెడుతున్నట్టు ప్రకటించింది. పల్సస్ సంస్థ బహుళ భాషల్లో సైంటిఫిక్ జర్నల్స్, ఫార్మాకోవిజిలెన్స్ రంగాలపై దృష్టి సారించి ఉపాధి కల్పించడంలో గొప్ప విజయాలు సాధించింది.

చెన్నైలో పల్సస్ కేంద్రం

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు

పల్సస్ ఇప్పటికే హైదరాబాద్‌లో 5 వేల ఉద్యోగాలు కల్పించింది. ప్రస్తుత విస్తరణతో 2 వేల మంది ఫార్మా, లైఫ్ సైన్సు గ్రాడ్యుయేట్లకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. చెన్నైలోని పల్సస్ కేంద్రాన్ని శుక్రవారం కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేశ్ ప్రభు మాట్లాడుతూ పల్సస్ సంస్థ భారత దేశంలోకి తగినన్ని పెట్టుబడులు తీసుకురావడంలో నిబద్ధతతో ఉందని ప్రశంసించారు. దీని ద్వారా చెన్నైలో ముఖ్యమైన సైంటిఫిక్ అండ్ హెల్త్ కేర్, జర్నల్స్ రంగంలో 2 వేల నూతన అవకాశాలు అదనంగా సమకూరాయని తెలిపారు. తమిళనాడుకు నవకల్పన, సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో సమర్ధ చరిత్ర ఉందని, ఈ కొత్త వెంచర్‌తో తమిళనాడు ప్రజలు, పల్సస్ సంస్థ కూడా లబ్ధిపొందగలవని తెలిపారు. పల్సస్ సంస్థను చెన్నైతో పాటు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలతో కలుపుతూ ప్రాథమిక సైన్స్ అంశాలు, డ్రగ్ సేఫ్టీ పరిశోధనలకు ముఖ్య కేంద్రంగా రూపొందించడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్టు పల్సస్ ప్రధాన కార్యనిర్వహణాధికారి డాక్టర్ శ్రీనుబాబు గేదెల తెలిపారు. స్థానిక భాషల్లో సైన్స్, హెల్త్ కేర్ రచనలకు విస్తృత డిమాండ్ ఉందని, ప్రజలు వీటికోసం ఇంగ్లిష్ తో పాటు , స్థానిక భాషల్లో శోధిస్తున్నారని తెలిపారు. సైన్స్ పరిశోధనలు అందరికీ అందుబాటులో తీసుకురావడంతో పాటు , వినియోగించేలా చేస్తామని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరిశోధనలు, జర్నల్స్ ను తమిళం, హిందీ, గుజరాతీ, మలయాళం, తెలుగులతో పాటు స్థానిక భాషలలో అకడమిక్, సైన్స్ అండ్ హెల్త్ కేర్ పరిశోధకులకు అందజేస్తామని తెలిపారు. కెనడాకు చెందిన పల్సస్ గ్రూపును డాక్టర్ శ్రీనుబాబు కొనుగోలు చేశారు. ఈ సంస్థకు లండన్, అంటారియో, సింగపూర్, హైదరాబాద్ లలో కార్యాలయాలున్నాయి. ప్రస్తుతం చెన్నై, గుర్గాంవ్ లో కార్యాలయాలు ప్రారంభించడంతో పాటు, విశాఖపట్నం లో కార్యాలయం నెలకొల్పేందుకు సన్నాహాలు చేస్తోంది. రూ. 1000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన పల్సస్ కంపెనీ రానున్న ఐదేళ్లలో 10 వేలమంది కి ఉపాధి కల్పించడం లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

ప్రస్తుతం అన్ని సైన్స్ పరిశోధన వ్యాసాలు చందాలు చెల్లించి కొనుగోలు చేసే సైన్స్ జర్నల్స్ లోనే ప్రచురిస్తున్నారు. వీటి ఖరీదు బాగా ఎక్కువగా ఉంటుంది. దీంతో అవి పరిశోధకులు, పరిశోధక విద్యార్థులకు, ప్రజలకు అందుబాటులో లేవు. పల్సస్ సంస్థ వీటిని 50 నుంచి 60 శాతం తక్కువ ధరకే అందుబాటులోనికి తీసుకువస్తోంది.



కంపెనీల రంగం విలవిల


పి.ఎన్.బి బాగోతంతో రుణాల మంజూరుకు వెనుకాడుతున్న ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులు

ముంబయి: కీలక సమయమైన ఆర్థిక సంవత్సరం చివరలో భారతీయ కంపెనీల రంగం రుణాల పంపిణీ జరగక నిధుల కోసం వెదుకులాడుతోంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పి.ఎన్.బి)లో కుంభకోణం వెలుగు చూశాక, బ్యాంకులు, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు ఆత్మరక్షణలో పడ్డాయి. 'స్రెస్సడ్ ఎసెట్ల' పునర్నిర్మాణానికి సంబంధించి కొత్త నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రభావాన్ని మదింపు చేయవలసి రావడం కూడా బ్యాంకుల సమయాన్ని హరించివేస్తోంది. సాధారణంగా, ఆర్థిక సంవత్సరం చివరి నెల అయిన మార్చిలో కార్యకలాపాలు చాలా వేగంగా సాగుతూంటాయని ప్రభుత్వ రంగ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. కానీ, ప్రస్తుతం, చాలా బ్యాంకుల, ముఖ్యంగా ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంకుల మేనేజ్‌మెంట్‌కి పెద్ద మొత్తాలతో కూడిన రుణాలపై దృష్టి కేంద్రీకరించే సమయం చిక్కడం లేదు. భారతదేశంలో 70 శాతం బ్యాంకింగ్ ప్రభుత్వ రంగ బ్యాంకుల చేతుల్లోనే ఉంది. పి.ఎన్.బిలో చోటుచేసుకున్న మోసంతో వ్యాపార (రుణాల పంపిణీ) వృద్ధికి ప్రాధాన్యం అట్టడుగుకు చేరుకుంది. పి.ఎన్.బి బాగోతం తర్వాత, నియమ నిబంధనలను పాటించిందీ లేనిదీ పరిశీలించడంలో ఆడిటర్లు కూడా కచ్చితంగా వ్యవహరిస్తున్నారు. పద్దుల సంవత్సరం ముగియడానికి ముందు పనుల వేగంపై అది ప్రభావం చూపుతోంది. మొత్తం వాతావరణమంతా అస్తవ్యస్తమైపోయిందని మరో బ్యాంకర్ చెప్పారు. పి.ఎన్.బిలో జరిగిన మోసం గురించి కమ్యూనికేషన్ వ్యవహరణలో ప్రభుత్వ పాత్రగానీ, నియంత్రిత సంస్థ పాత్రగానీ ఉండాల్సిన స్థాయిలో లేవని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. మొత్తం నిందను బ్యాంకుల మీదకే నెడుతున్నారని అన్నారు. ఇది బ్యాంకింగ్ వ్యవస్థ విశ్వసనీయతపై ప్రభావం చూపుతోందని, బ్యాంకర్లపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆ అధికారి అన్నారు. పరిశ్రమలకు రుణాల వృద్ధి తిరిగి పెరగడం ప్రారంభించిన సమయంలో పి.ఎన్.బిలో అవకతవకలు బయటపడ్డాయి.



మూడేళ్ళుగా ఇదే పరిస్థితి

రకరకాల కారణాల రీత్యా, మూడేళ్ళుగా పరిశ్రమలకు రుణాల మంజూరు మందగొడిగానే ఉంది. 2017 డిసెంబరు త్రైమాసికం మెరుగైన వ్యాపార (పరిశ్రమలకు రుణ వృద్ధి) ఆశతో మొదలైంది. కాకతాళీయంగా, ఆర్థిక కార్యకలాపాల్లో రికవరీ కనిపించడంతో ఇక పరిస్థితులు కుదుటపడతాయనుకున్నారు. కానీ, పి.ఎన్.బి బాగోతంతో ఆ పాల పొంగుపై నీళ్ళు చల్లినట్లు అయింది. మార్చి త్రైమాసికంలో రుణాల పంపిణీని ఇది మరింత బలహీనపరుస్తుందని ఎస్.బి.ఐ ఎగ్జిక్యూటివ్ చెప్పారు.



అయితే, సువ్యవస్థితమైన కంపెనీలకు, రుణాల చెల్లింపులో మచ్చలేని చరిత్ర ఉన్నవాటికి రుణాలను నిరాకరించడం లేదని ఆయన చెప్పారు. కానీ, బోర్డరు లైన్ కేసులలో, కొంత ఎక్కువ లివరేజి ఎకౌంట్లతో వస్తున్న ప్రతిపాదనల విషయంలో రిస్కు (ఆమోదించి, రుణాలు మంజూరు చేసేందుకు) తీసుకునేందుకు అధికారులు సంశయిస్తున్నారు. ప్రతికూల పరిస్థితులు సడలిపోయేందుకు మరో మూడు నుంచి ఆరు నెలలు పడుతుందని ఆయన చెప్పారు.

రుణ వృద్ధిపై ప్రభావం పడిందని రేటింగ్ ఏజన్సీలు కూడా భావిస్తున్నాయి. రుణం మంజూరు చేసి, పంపిణీ చేయడానికి బ్యాంకులు సాధారణ గడువుకన్నా ఎక్కువ సమయం తీసుకుంటున్నాయని వివిధ పరిశ్రమల విభాగాల నుంచి ఫిర్యాదు లొస్తున్నాయని ఒక టాప్ రేటింగ్ కంపెనీలో ఫైనాన్షియల్ రంగ రేటింగ్స్ విభాగ అధిపతి ఒకరు చెప్పారు. సత్వర దిద్దుబాటు చర్య (పి.సి.ఎ) కిందనున్న బ్యాంకులు కూడా ఆంక్షలతో పనిచేస్తున్నాయి. అవి ఇప్పుడు విదేశీ మారక ద్రవ్య వ్యాపార విషయంలో కూడా నెమ్మదిగా వ్యవహరించక తప్పదు. ట్రేడ్ క్రెడిట్ పొడిగించడం, గ్యారంటీలు, లెటర్ ఆఫ్ క్రెడిట్‌లు ఇవ్వడం వంటి కార్యకలాపాల స్థాయిని ప్రభుత్వ రంగ బ్యాంకులు బాగా తగ్గించేసుకున్నాయని విదేశీ బ్యాంక్ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఇది అవి చేసే విదేశీ వ్యాపార వేగంపై ప్రభావం చూపిస్తుంది.

గుబులు రేపుతున్న దర్యాప్తు సంస్థలు

పి.ఎన్.బిలో మోసం బయటపడ్డ తర్వాత, దర్యాప్తు సంస్థలు, విజిలెన్స్ యంత్రాంగం సభ్యులు రెట్టించిన శక్తితో పని చేస్తున్నారు. దాంతో పెద్ద మొత్తాలలో రుణాలు ఇచ్చేందుకు లేదా రుణ పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపట్టేందుకు బ్యాంకర్లు భయపడుతున్నారు. తర్వాత, తమను విచారణకు పిలుస్తారేమోనని సంశయిస్తున్నారు. ''కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కేసులో ఐ.డి.బి.ఐ బ్యాంక్ మాజీ ఉన్నతోద్యోగులు పొందిన కష్టాల జ్ఞాపకాలు ఇంకా మది నుంచి చెరిగిపోలేదు. పదవీ విరమణ తర్వాత, దర్యాప్తును ఎదుర్కొనే చేదు అనుభవాలను ఎవరూ కోరుకోరు. తీసుకున్న నిర్ణయాలలోని మంచి చెడులను ఎవరికి వారే చెప్పి సమర్థించుకోవాల్సి ఉంటుంది. రిటైర్మెంట్ తర్వాత, చేతిలో వనరులు కూడా పరిమితంగానే ఉంటాయి'' అని దశాబ్దాల అనుభవం ఉన్న మరో ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ చెప్పారు.

ప్రైవేటు రంగ బ్యాంకుల ఉన్నత స్థాయి అధికారులను ఇటీవల ప్రశ్నించడానికి పిలిపించడం, చాలా ఏళ్ళ తర్వాత మొదటిసారిగా జరిగింది. అటువంటివాటి విషయంలో, సాధారంగా, ప్రభుత్వ రంగ బ్యాంకుల అధికారులను మాత్రమే పిలిపిస్తూంటారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ అర్థ భాగంలో మొత్తంమీద రుణ పంపిణీలు కొంత మెరుగుదలను చూశాయి. కానీ, పరిశ్రమలకు రుణ అడ్వాన్సులు నామమాత్రపు స్థాయిలోనే ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్.బి.ఐ) మొత్తం రుణంలో వృద్ధి 2017 ఫిబ్రవరిలో ఉన్న 4.4 శాతం నుంచి 2018 ఫిబ్రవరి మధ్య కాలానికి 10.7 శాతానికి మెరుగుపడింది. పరిశ్రమలకిచ్చిన రుణం 2017 జనవరిలో 5.5 శాతంగా ఉండి, గత ఏడాది అక్టోబరులో అడంగుకు చేరింది. అది ఇప్పుడిప్పుడే కాస్త మెరుగవడం మొదలుపెట్టింది.

బిస్లెరి నుంచి మ్యాంగో ఫాంజో

ముంబయి: ఆ సోదరుల దారులు వేరైై ఇరవై ఐదేళ్ళు అయింది. ఈ వేసవిలో ఒకే మార్కెట్‌లో భాగం కోసం చౌహాన్ సోదరులు రమేశ్, ప్రకాశ్‌లు పోటీ పడబోతున్నారు. రమేశ్ నేతృత్వంలోని బిస్లెరి ఇంటర్నేషనల్ బిస్లెరి బ్రాండ్ పేరుతో తాగు నీటిని ప్యాక్ చేసి అమ్ముతోంది. అది ఈ ఏప్రిల్‌లో ఫాంజో పేరుతో మామిడి పండు పానీయాన్ని మార్కెట్లో ప్రవేశపెట్టనుంది. తమ్ముడు ప్రకాశ్ సామ్రాజ్యంలోకి రమేశ్ కంపెనీ నేరుగా అడుగు పెట్టడం ఇదే మొదటిసారవతుంది. ప్రకాశ్, ఆయన కుమార్తెలు షౌనా, నదియా, అలీషాల నేతృత్వంలోని పార్లే ఆగ్రో ఫ్రూటీ (మామిడి పండు), యాపీ (యాపిల్ పండు) రసాలను తయారు చేసి మార్కెట్లో విక్రయిస్తోంది. అయితే, ఫ్రూటీ, యాపీ రెండింటికీ మార్కెట్లో ఫిజీ వేరియంట్లు అందుబాటులో ఉన్నాయి.

ఒకరి వ్యాపారంలోకి ఒకరు అడుగుపెట్టకుండా ఇంతకాలం ఎవరి దారిన వారు వ్యాపారం చేసుకుంటున్న ఈ ఇద్దరు సోదరులు, గత కొద్ది సంవత్సరాలుగా వివిధ విభాగాల్లోకి విస్తరించే కార్యకలాపాల్లో ఉన్నారు. రమేశ్ ఊర్జా, బిస్లెరి పాప్ వంటి వాటితో ఎనర్జీ డ్రింకులు, కార్బొనేటెడ్ బివరేజెస్‌లోకి కాలుమోపారు. ప్రకాశ్ కేఫ్ క్యూబా, ఫ్రియోలతో ఏరేటెడ్ పానీయాలలోకి ప్రవేశించారు. హిప్పో వంటి స్నాక్స్‌ని కూడా అమ్మడం మొదలుపెట్టారు.

అయితే, మామిడి పండు రస విభాగంలోకి రమేశ్ ప్రవేశాన్ని నిశితంగా పరిశీలించే అవకాశం ఉందని అభిజ్ఞ వర్గాలవారు చెబుతున్నారు. మామిడి పండు రస పానీయాలలో ఫ్రూటీతోపాటు, కోక-కోలా (మజా), పెప్సికో (స్లైస్), మన్‌పసంద్ బివరేజెస్ (మ్యాంగో సీప్) వంటివి కూడా ఉన్నాయి. భారతదేశంలో ప్యాకేజ్డ్ జ్యూస్ మార్కెట్ రూ. 120 బిలియన్ల మేరకు ఉంటుందని అంచనా.



తిరిగి అందులో మామిడి పండు జ్యూస్ విభాగ పరిమాణం 50 శాతం పైనే ఉంటుందని అంచనా. పండ్లలో మామిడి పండుకున్న ప్రాచుర్యాన్ని ఇది సూచిస్తోంది. ఈ విభాగం రెండు సంఖ్యలలో స్థిరంగా వృద్ధి చెందుతూ వస్తోంది. దాంతో అదే కేటగిరీలో పోటీ పానీయాలు తీసుకురావాలని పానీయాల తయారీ అగ్ర సంస్థలు తహతహలాడుతున్నాయి.

ఉదాహరణకు, విజయ్ చౌహాన్ ప్రమోట్ చేస్తున్న పార్లే ప్రాడక్ట్స్‌తో ఇటీవల మన్‌పసంద్ బివరేజెస్ పంపిణీ ఒప్పందాన్ని ప్రకటించింది. ఈ రెండు సంస్థలు ఈ వేసవి కాలం నుంచి పరస్పరం బ్రాండ్లను ప్రమోట్ చేయడం, అమ్మడం చేయనున్నాయి. ఈ రెండు సంస్థలు సొంత ఉత్పత్తులతోపాటు ఒకదాని ఉత్పత్తులను ఒకటి విక్రయించేందుకు సుముఖంగా ఉన్నాయి.

బైలీ బ్రాండ్ పేరుతో పార్లే ఆగ్రో తాగు నీటిని విక్రయిస్తోంది. మామిడి పండు రస పానీయాలలోకి బిస్లెరి ప్రవేశంపై అది ఎలా స్పందించనుందో ఇంకా స్పష్టం కాలేదు. ''సాధారణ మామిడి ఆధారిత పానీయాలతో భారతీయ మార్కెట్ ఇక పెరగడానికి అవకాశం లేని స్థితికి చేరుకుంది. కొత్తగా ఆఫరు చేసేందుకు సంస్థల వద్ద ఏవీ లేవు. ఫాంజోతో మేం ఫిజ్‌తో కూడిన మామిడి పానీయం రుచిని చూపించనున్నాం'' అని బిస్లెరి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రమేశ్ చౌహాన్ చెప్పారు. ఈ కొత్త పానీయం 250 మిల్లీ లీటర్ల పెట్ బాటిళ్ళలో అందుబాటులో ఉంటుందని, ఒక్కో యూనిట్ ధర రూ. 18గా ఉంటుందని రమేశ్ చౌహాన్ చెప్పారు. దేశవ్యాప్తంగా అన్ని చిల్లర దుకాణాల్లోనూ దీన్ని అందుబాటులోకి తెస్తామని, పూర్తి స్థాయి మీడియా కాంపైన్ నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

జోరు అందుకోనున్న నియామకాలు

ముంబయి: పెద్ద నోట్ల రద్దు, హెచ్-1బి నిబంధనల సవరణ, జి.ఎస్.టి అమలు ప్రభావాల నుంచి బయటపడేందుకు 2018లో నియామకాల కార్యకలాపాలు ఊపందుకుంటాయని భావిస్తున్నారు. పలు కంపెనీలు ఈ ఏడాది పెద్ద సంఖ్యలో సిబ్బందిని తీసుకోవాలని చూస్తున్నాయని, ముఖ్యంగా స్టార్టప్‌ల నుంచి ఉన్న ముప్పును ఎదుర్కొనే నిర్దిష్ట ఉద్దేశంతో అవి రిక్రూటింగ్‌కు దిగుతున్నాయని ఒక సర్వే వెల్లడించింది. ఇంజనీరింగ్, మౌలిక వసతులు, ఆరోగ్య రక్షణ, రిటైల్, ఆటోమొబైల్ రంగాలు నియామకాలలో పెరుగుదలను చూడనున్నప్పటికీ, ఈ ఏడాది సమాచార సాంకేతిక పరిజ్ఞాన (ఐ.టి) రంగం హైరింగ్‌లో గరిష్ఠ పరిమాణాన్ని నమోదు చేయనుందని ఆన్‌లైన్ రిక్రూట్‌మెంట్, కెరీర్ సొల్యూషన్ల పోర్టల్ విజ్‌డమ్ జాబ్స్ డాట్‌కామ్ నిర్వహించిన సర్వే తెలియజేసింది.



స్టార్టప్‌ల నుంచి ఉన్న ముప్పు నియామక కార్యకలాపాల్లో కనిపించింది. ''కొత్తగా మొదలైన సంస్థలు ముఖ్యంగా టెక్నాలజీ, ఐ.టి రంగాల్లో పుట్టుకొచ్చినవి ఉన్నత స్థాయి ప్రతిభావంతులను ఉద్యోగాల్లోకి తీసుకోవడంలో కార్పొరేట్లతో పోటీ పడుతున్నాయి'' అని విజ్‌డమ్‌జాబ్స్ డాట్‌కామ్ స్థాపకుడు, సి.ఇ.ఓ అజయ్ కొల్ల చెప్పారు.

ఐ.ఐ.టిలు, ఐ.ఐ.ఎంల వంటి ఉన్నత శ్రేణి సంస్థల నుంచి అభ్యర్థులను తీసుకునే మొలక సంస్థల సంఖ్య ఏయేటికాయేడు పెరుగుతూ వస్తోందని ఆయన చెప్పారు. అయితే, లాటరల్ హైరింగ్ విషయానికి వచ్చినప్పుడు, ''అవే స్టార్టప్‌లు కార్పొరేట్లు ఇవ్వజూపుతున్న ప్రతిఫలాలు, ప్రయోజనాలతో సమానంగా అభ్యర్థులకు పారితోషికాలు ఆఫరు చేసేందుకు సుముఖంగా ఉన్నాయి. చాలా కంపెనీలు ఒకే ప్రతిభావంతుల కోసం పోటీ పడుతున్నాయి'' అని అజయ్ తెలిపారు. ''ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అగ్‌మెంటెడ్ రియాలిటీ, అడ్వాన్స్‌డ్ డాటా ఎనలటిక్స్ వంటి నవీన యుగ టెక్నాలజీలపై పనిచేయగలవారు సాపేక్షంగా చూస్తే ఇప్పటికీ తక్కువగానే ఉన్నారు'' అని అజయ్ తెలిపారు. ఈ విషయంలో స్టార్టప్‌ల లాభం, కార్పొరేట్లకు నష్టమని ఆయన అంగీకరించారు. ''కార్పొరేట్లు వాటి నియామక, హెచ్.ఆర్ విధానాలను పాటించడం ద్వారా, ముఖ్యంగా స్టాక్ ఆప్షన్లు, లాభాలను పంచుకోవడం వంటి ప్రయోజనాలను కల్పించడం ద్వారా కార్పొరేట్లు ఈ ముప్పును ఎదుర్కొంటున్నాయి. సత్తా ఉన్న అభ్యర్థులకు వాటిని మరింత ఆకర్షణీయమైనవిగా రూపొందిస్తున్నాయి'' అని ఆయన చెప్పారు.


ఐ.టి, రిటైల్, ఆతిథ్య, ఎఫ్.ఎం.సి.జి, ఆరోగ్య రక్షణ, ఆటోమొబైల్స్ వంటి 10 రంగాల్లో 350 మందికి పైగా రిక్రూటర్లు, 140 కంపెనీలు ఈ సర్వేలో పాల్గొన్నాయి. సంస్థలో ఉన్న ప్రతిభావంతులను నిలబెట్టుకునేందుకు కంపెనీలు గట్టిగా ప్రయత్నిస్తాయని, ఉద్యోగుల నైపుణ్య అభివృద్ధి, ఉన్నత కౌశలాన్ని సంతరింపజేయడం, శిక్షణపై మరింతగా పెట్టుబడులు పెడతాయని విజ్‌డమ్‌జాబ్స్ సంస్థకు చెందిన 'నియామక రీతులు-పారితోషికాల విశ్లేషణ 2018' నివేదిక వెల్లడించింది. నైపుణ్య అభివృద్ధి, ప్రస్తుతం ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడంపై తమ హెచ్.ఆర్ బడ్జెట్‌లను 10 శాతం పెంచే ఆలోచనలో ఉన్నట్లు సర్వేలో పాల్గొన్న కంపెనీల్లో 58 శాతం కంపెనీలు పేర్కొన్నాయి. అవే పనులపై పెట్టుబడులను 20 శాతం పైగా పెంచుతామని దాదాపు 10 శాతం కంపెనీలు తెలిపాయి. ఈ ఏడాది గణనీయమైన సంఖ్యలో నియామకాలు జరిపే పథకాలున్నట్లు దాదాపు 60 శాతం కంపెనీలు వెల్లడించగా, మెట్రో నగరాలు, టైర్ వన్ పట్టణాల నుంచి ప్రధానంగా నియామకాలు జరుపనున్నట్లు 52 శాతం కంపెనీలు తెలిపాయి. ఐ.టి, టెక్నాలజీ రంగాల్లో నవీన యుగ టెక్నాలజీలకు సంబంధించి కొత్త అవకాశాలు పెద్ద సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. కనుక, వాటిల్లో నియామకాలు వేగవంతం కానున్నాయి. వస్తూత్పత్తి, ఐ.టి ఆధారిత, రవాణా, ఆతిథ్య రంగాలు 2017లో నియామకాల్లో తగ్గుదలను చూశాయి. ఈ ఏడాది ఆ రంగాల్లో నియామకాలు పాక్షికంగా పునరుద్ధరణ పొందవచ్చని భావిస్తున్నారు.

ఎయిర్ కోస్టా ఆర్డరు సజీవమే

హైదరాబాద్: ప్రస్తుతం కార్యకలాపాలు నిలిపివేసిన ఎయిర్ కోస్టా విమానయాన సంస్థ పెట్టిన 50 విమానాల ఆర్డరు ఇప్పటికీ సజీవంగా ఉన్నట్లేనని, ఆ ప్రాంతీయ విమానయాన సంస్థ కోలుకుంటుందని ఆశిస్తున్నామని బ్రెజిలియన్ విమానాల తయారీ సంస్థ ఎంబ్రేయర్ కమర్షియల్ ఏవియేషన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఒకరు శుక్రవారం చెప్పారు. ''అది (ఎయిర్ కోస్టా ఆర్డరు) మా పుస్తకాల్లో ఉంది. శక్తిని కూడగట్టుకోగలిగితే ఆ విమానయాన సంస్థ మళ్ళీ కార్యకలాపాలు ప్రారంభించవచ్చు. కనుక ఏదైనా సంభవిస్తే తప్పించి దానికి (ఆర్డర్ల రద్దుకు) సమయం అంటూ ఏదీ లేదు'' అని ఎంబ్రేయర్ సంస్థ ఆసియా పసిఫిక్ ప్రాంత ఉపాధ్యక్షుడు సీజర్ పెరీరా అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న వింగ్స్ ఇండియా 2018 సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎయిర్ కోస్టా నుంచి సమాచారం తెలుసుకుంటూనే ఉన్నామని పెరీరా చెప్పారు. ''పరిస్థితి నుంచి రికవరయ్యేందుకు ఆ విమానయాన సంస్థ ప్రయత్నిస్తోంది'' అని ఆయన చెప్పారు. విజయవాడ కేంద్రంగా ఉన్న ఆ విమానయాన సంస్థ మూలధన కొరత కారణంగా 2016 జులైలో తాత్కాలికంగా కార్యకలాపాలు నిలిపివేసింది. విమానయాన రంగ నియంత్రణ సంస్థ డి.జి.సి.ఎ తదనంతరం ఎయిర్ కోస్టా ఫ్లయింగ్ పర్మిట్‌ను సస్పెండ్ చేసింది. ఎయిర్ కోస్టా ఆర్డరును దృష్టిలో పెట్టుకుని తయారు చేసిన విమానాలను మళ్ళించడం గురించి అడిగిన ఒక ప్రశ్నకు ''మేం ఆ పని (ఆ విమానాలను మరొక మార్కెట్ దేనిలోనే అమ్మడం) చేయక తప్పని పరిస్థితి ఏమీ లేదు. అటువంటి అవసరం తలెత్తితే, తదుపరి చర్య కోసం మేం వారితో మాట్లాడతాం'' అని ఆయన జవాబిచ్చారు. ''ఏ చర్య తీసుకునేందుకైనా మేం అంత (లైసెన్సు రద్దు) వరకు వేచి చూడవలసిన అవసరం ఉంది'' అని పెరీరా అన్నారు.



ఎల్.ఇ.పి.ఎల్ గ్రూప్ ప్రమోట్ చేసిన ప్రాంతీయ విమానయాన సంస్థ ఎయిర్ కోస్టా 2014 జనవరిలో 20 ఏళ్ళపాటు విమానాల నిర్వహణ పథకం కింద 2.94 బిలియన్ల డాలర్ల విలువైన 50 జెట్లకు ఎంబ్రేయర్ వద్ద ఆర్డరు పెట్టింది. ఇ190-ఇ2 రకం జెట్‌లు అదనంగా మరో 50 కొనేందుకు కూడా ఎయిర్ కోస్టా కొనుగోలు హక్కుల అవకాశాలు ఉంచుకుంది. కేంద్రం గత ఏడాది ప్రకటించిన ప్రాంతీయ కనెక్టివిటీ పథకం (ఆర్.సి.ఎస్)లో ఎంబ్రేయర్ ''పెద్ద అవకాశాన్ని'' చూస్తోందని పెరీరా అన్నారు. ''ఆర్.సి.ఎస్ మరింత మంది ప్రయాణికులను వ్యవస్థలోకి తీసుకొచ్చే అద్భుతమైన కార్యక్రమం. కానీ, కొన్ని విమానయాన సంస్థలు దీర్ఘకాలిక మనుగడ కోసం చూస్తాయి. మరి కొన్ని సంస్థలు మూడేళ్ళపాటు విమానాలు నడపవచ్చు. కానీ, ఆ తర్వాత మాటేమిటి? ఇండిగో ఎ.టి.ఆర్‌లకు వెళ్ళాలని నిర్ణయించుకున్నట్లు తెలుసు. స్పైస్‌జెట్‌కి ఎలాగూ క్యూ400లు ఉన్నాయి. ఇ175కున్న అవకాశాలను తెరిచేందుకు మేం అన్ని విమానయాన సంస్థలతోను చర్చలు జరుపుతున్నాం'' అని పెరీరా చెప్పారు. ''అమెరికా మార్కెట్ కోసం మేం ఈ 80 సీట్ల విమానాలను అందిస్తున్నాం. అక్కడి ప్రాంతీయ రూట్లలో కూడా వాటిని వాడనున్నారు'' అని ఆయ న చెప్పారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో 150 సీట్ల విభాగానికి చెందిన 3010 విమానాలను వచ్చే 20 ఏళ్ళలో విమానయాన సంస్థలు స్వీకరిస్తాయని ఎంబ్రేయర్ అంచనా. ఆ విభాగంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న డిమాండ్‌లో అవి 29 శాతానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు లెక్క. మౌలిక వసతులకు సంబంధించిన ప్రతిబంధకాల వల్ల భారతదేశంలో బి జినెస్ జెట్‌ల వృద్ధికి అవరోధం ఏర్పడుతోందని ఎంబ్రేయర్ ఎగ్జిక్యూటివ్ జెట్స్ మధ్య ప్రాచ్య, ఆసియా పసిఫిక్ ప్రాంత అ మ్మకాల విభాగ ఉపాధ్యక్షుడు క్లాడియో కామిలియర్ చెప్పారు.



నోట్లో నీరెందుకు ఊరుతుంది?

పిల్లలకు ఇష్టమైన తినుబండరాలు చూసినపుడు నోట్లో నీళ్లు ఊరతాయి. ఎందుకో తెలుసా? మనం మంచి ఆకలిమీద ఉన్నపుడు ఇష్టమైన వస్తువులు కళ్ల ముందు కనిపించినా, వాటి పేరు తలచుకున్నా, ఆ పదార్థాల్ని చూసినా నోట్లో నీళ్లు ఎక్కువగా ఊరుతుంటాయి. పులుపు పదార్థాలకు ఆమ్లత్వం ఉండడంవల్ల ఆ ఆమ్లత్వాన్ని తగ్గించేందుకు, సజలీకరణం చేసేందుకు పుల్లని వస్తువులు తిన్నప్పుడు నోరు అధికంగా ఊరుతుంది. ఈ స్థితికి మన శరీరం, జీర్ణవ్యవస్థ అలవాటుపడి ఉంటాయి. కాబట్టి మనం బాగా ఆకలితో ఉన్నప్పుడు చింతపండు, ఊరగాయలు వంటి పదార్థాలను చూసినప్పుడు లేదా విన్నప్పుడు మన మెదడు నోట్లో నీరు ఊరించేలా ప్రేరేపిస్తుంది. అలాంటి జీవభౌతిక ధర్మాన్ని అలవాటువల్ల వచ్చిన ప్రేరణ అంటారు. అలాగని తీపి వస్తువులు చూసినా, వాటి గురించి విన్నా నోట్లో నీరు ఊరదు అనుకోకూడదు. ఆకలితో ఉన్నప్పుడు మనకు రుచిగా అనిపించే ఏ ఆహార పదార్థాన్ని గురించి విన్నా లేదా చూసినా ఎంతో కొంత నోరూరుతుంది. కానీ కడుపునిండా తిన్నాక చింతపండు చూసినా నోట్లో నీరు ఊరుతుంది. ఇది నోట్లో నీరూరడం వెనుకమున్న అసలు సంగతి.



పిల్లల హల్ 'సెల్'

నడక, మాటలు కూడా సరిగా రాని చిన్నారులు సెల్‌ఫోన్లు, ట్యాబ్లెట్లు, పిసిలతో ఆడుతున్నారు. వాటిని విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నారు. ఈ పరిణామం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అధ్యయనకారులు హెచ్చరిస్తున్నారు. సెల్‌ఫోన్లకు పిల్లలు అలవాటుపడుతున్న తీరు తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఈ స్టడీ పేర్కొంది. ఆరు నెలల వయసు నుంచే సెల్‌ఫోన్ల పట్ల పిల్లలు ఆసక్తి చూపడంపై తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ స్టడీ కింద మొత్తం 370 మంది బేబీలను సర్వే చేశారు. వీరంతా ఆరు నెలల నుంచి నాలుగు సంవత్సరాల లోపు పిల్లలు. వీళ్లకు మాటలు రాకముందే, నడవడానికి అడుగులు కూడా పడకముందే సెల్‌ఫోన్లు, ట్యాబ్లెట్లతో ఆడుకుంటున్నారు. ఇంకో దురదృష్టకరమైన విషయం ఏమిటంటే 73 శాతం మంది తల్లిదండ్రులు పిల్లల చేతల్లో ఈ గాడ్జెట్స్‌ను పెట్టి ఇంటిపనులు చూసుకుంటున్నారు. 65 శాతం మంది అయితే తమ పిల్లలు ఏడవకుండా, అల్లరి చేయకుండా ఉండేందుకు వారి చేతుల్లో సెల్‌ఫోన్లు పెడుతున్నామని చెప్పారు. 29 శాతం మంది తమ పిల్లలను నిద్రపుచ్చడానికి ఈ గాడ్జెట్స్‌ను వాడుతున్నట్టు చెప్పారు. పిల్లలు గంటల తరబడి సెల్‌ఫోన్లు పట్టుకుని ఆడుకోవడం చూసిన ఇక్కడి వైద్యులు సైతం ఆశ్చర్యపోతున్నారు. పిల్లలు వీటికి అలవాటుపడ్డం వల్ల ప్రవర్తనాపరమైన సమస్యలతోపాటు రకరకాల అనారోగ్య సమస్యలు వారికి వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పిల్లలకు వెన్నెముక, మెడ నొప్పి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ముందొస్తుగానే వారి సమస్యను గుర్తించి తగిన వైద్యం అందించకపోతే పోశ్చరల్ సమస్యలు వారిలో తలెత్తే అవకాశం ఉందిట. అతిగా ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు ఉపయోగించడం వల్ల పిల్లలు కూడా ఎలాంటి భావావేశాలు లేని మనుషుల్లా.. అంటే యంత్రాల్లా తయారవుతారని వైద్యులు చెబుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలను టివితో సహా సెల్‌ఫోన్లకు, పిసిలకు, ట్యాబ్లెట్లకు ఎంత దూరంగా ఉంచితే అంతమంచిదంటున్నారు. అంతేకాదు ఈ సమస్యకు పరిష్కారం తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని అధ్యయనకారులు అంటున్నారు. గాడ్జెట్స్‌తో కాకుండా ఇతరత్రా ఆసక్తికరమైన అంశాల్లో, ఆటపాటల్లో, సృజనాత్మక కార్యకలాపాల్లో పిల్లలు పాల్గొనేట్టు తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచిస్తున్నారు.



గాల్లోనే జీవించే పక్షులు

పిల్లలూ..! మనం గాలిలో ఎగిరే పక్షులను తరచూ చూస్తూనే ఉంటాం. అయితే అవి కొంతసేపు గాలిలో ఎగిరి, మరి కొంతసేపు విశ్రాంతి తీసుకుంటాయి. ఇది మనకు పక్షుల గురించి తెలిసిన విషయం. కానీ ఒక జాతి పక్షులు గాలిలోనే సుమారు ఆరునెలలు ఎగురుతాయట! అవే స్విఫ్ట్ పక్షులు. అవి వాటి జీవిత కాలంలో ఎక్కువభాగం గాలిలోనే ఎగురుతాయని చాలామంది చెబుతుంటారు. కానీ ఇది నిజం అని ఇప్పటి వరకూ ఎవరూ నిరూపించలేకపోయారు. ప్రస్తుతం ఒక అధ్యయనం ఇందులో కొంత నిజం ఉందని సూచించింది. ఆల్పైన్ స్విఫ్ట్‌లు వరుసగా ఆరునెలలు గాలిలోనే గడుపుతాయనీ.. యూరప్‌లో తమ ప్రత్యుత్పత్తి కాలం ముగిసిన తర్వాత ఉత్తర అమెరికాకు వలస వస్తాయనీ.. తర్వాత ఏ మాత్రం విశ్రాంతి తీసుకోకుండా గాలిలోనే గడుపుతాయనీ తేలింది.

పిల్లల్లో జ్ఞాపకశక్తి

పిల్లల్లో కాన్సెన్ట్రేషన్‌ను మెరుగుపరచడానికి ఆటని ప్రయత్నించండి ఇది మీకు కోపాన్ని తెప్పించవచ్చు! కానీ, ఒక మనిషిగా మీరు ఒత్తిడితో కూడిన సమస్యలను ఎదుర్కొంటూ, పిల్లవాడి ఒత్తిడి, పోటీ మరియు ఇతర పనిని కూడా ఎదుర్కోవాల్సి వస్తుందా? మీ పిల్లల పనిని సరైన సమయంలో పూర్తి చేయగల సామర్థ్యాన్ని అందించేలా మీరు వారికి సహాయపడాలి. కాబట్టి, ఇక్కడ మీ పిల్లల యొక్క ఏకాగ్రతను వారంతట వారే మెరుగుపరచడానికి సహాయపడే కొన్ని చిట్కాలు ఉన్నాయి. మీరు వారి ఏకాగ్రతని పెంచడం మీదమాత్రం పని చేయాల్సిన అవసరం ఉంది,మిగిలిన అన్నింటినీ చూసుకోవడానికి మీ పిల్లల తెలివి సరిపోతుంది. వారి శారీరక అవసరాల గురించి తెలుసుకోండి పెద్దలతో పోలిస్తే పిల్లలు కొంచెం భిన్నంగా వుంటారు. వారు వివిధ శరీరధర్మ అవసరాలను కలిగి వుంటారు, మరియు మీరు వారికి కావాల్సిన అవసరాలు అందేలా చూసుకోవాలి.



చిన్నప్పటి నుంచే పిల్లల్లో కాన్ఫిడెన్స్ మెరుగుపరచాలి. పిల్లలకైనా, పెద్దవాళ్లకైనా ఏ పని చేసేటప్పుడైనా కాన్ఫిడెన్స్ ఉంటేనే అందులో సక్సెస్ అవుతారు. కాబట్టి చదువులోనైనా, పనిలోనైనా, ఎందులో అయినా.. సక్సెస్ అవ్వాలంటే.. కాన్ఫిడెన్స్ చాలా అవసరం. కాబట్టి పిల్లలకు చిన్నప్పటి నుంచే వాళ్ల ఎబిలిటీ గురించి కాన్ఫిడెన్స్ పెరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వాళ్లలో ఉన్న టాలెంట్, వాళ్ల ఆసక్తికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా.. అందులో సక్సెస్ అవడానికి సరైన ప్రోత్సాహం చాలా అవసరం. దాంతో పాటు వాళ్లు ఆ పని చేయ గలరు, అందులో అనుకున్నది సాధించగలరు అన్న కాన్ఫిడెన్స్ రావాలి అంటే.. తల్లిదండ్రుల ప్రోత్సాహం చాలా అవసరం. కాబట్టి పిల్లల్లో కాన్ఫిడెన్స్ మెరుగుపరిచే.. సింపుల్ టిప్స్ ఏంటో చూడండి...

పిల్లల్లో కాన్ఫిడెన్స్ పెంచడం ఎలా!

చదువులోనైనా, పనిలోనైనా, సక్సెస్ అవ్వాలంటే.. కాన్ఫిడెన్స్ చాలా అవసరం.

ఆత్మగౌరవం కోల్పోవడం

కొన్ని సందర్భాల్లో పిల్లలు ఆత్మ గౌరవం కోల్పోతారు. అలాంటప్పుడు వాళ్లలో ఎందుకు ఆ ఫీలింగ్ వచ్చిందో గుర్తించాలి. అప్పుడే.. వాళ్ల సమస్య అర్థమవుతుంది. దానికి సరైన పరిష్కారం సూచిస్తారు. పిల్లలు ఎప్పుడైతే.. ఆత్మ గౌరవంపై అనుమానం చూపించారో.. అప్పుడు వాళ్లలో కాన్ఫిడెన్స్ క్రియేట్ చేయడం చాలా అవసరం.

ఎంకరేజ్ చేయాలి

వాళ్ల గురించి వాళ్లకు ఉన్న అభిప్రాయాలను, భయాలను మార్చేలా చర్యలు తీసుకోవాలి. ఉదాహరణకు కొంతమంది పిల్లలు తమకు మ్యాథ్స్ అంటే భయం అని అంటుంటారు. అలా తరచుగా చెబుతూ ఉంటే.. తనను ప్రోత్సహించాలి. మంచి స్టూడెంట్ అని, ఇంకాస్త టైం ఆ సబ్జెక్ట్ కోసం కేటాయిస్తే.. ఈ సారి మంచి మార్కులు స్కోర్ చేస్తావని ఎంకరేజ్ చేయాలి.



వేరే పిల్లలతో పోల్చొద్దు

ముఖ్యంగా తల్లిదండ్రులు చేసే పెద్ద పొరపాటు ఇతరులతో పోల్చడం, లేదా అన్నదమ్ములతో పోల్చడం. ఇలా చేయడం వల్ల వాళ్ల కాన్ఫిడెన్స్ లెవెల్స్ దెబ్బతింటాయి. కాబట్టి.. ఇతరులతో పోల్చడం మానేయండి.



పిల్లలను పొగడటం

మన పిల్లలను కుటుంబ సభ్యులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్ ముందు పొగడటం వల్ల వాళ్లలో కాన్ఫిడెన్స్ లెవెల్స్ పెరుగుతాయి. ముఖ్యంగా ఏదైనా సాధించినప్పుడు కంపల్సరీ నలుగురిలో పొగడాలి. అప్పుడు దాన్ని వాళ్లు ప్రోత్సాహంగా తీసుకుని మరిన్ని విజయాలు కాన్ఫిడెన్స్‌తో సాధిస్తారు.

ప్రేమించడం

వాళ్లు ఏదైనా తప్పు చేసినా.. ప్రేమగా మాట్లాడటం, నెమ్మదిగా మందలించడం, మరోసారి ఇలాంటి మిస్టేక్ చేయకూడదని చెప్పడం వల్ల వాళ్లలో కాన్ఫిడెన్స్ పెరుగుతుంది. సైక్లింగ్ నేర్చుకోవడంలో సక్సెస్ అయినప్పుడు, ఎగ్జామ్‌లో మంచి స్కోర్ సంపాదించినప్పుడు పిల్లలను అప్రిసియేట్ చేయాలి. దీనివల్ల వాళ్లలో ఉత్సాహం రెట్టించి.. మరింత కాన్ఫిడెన్స్ లెవెల్స్ పెరిగి.. ఈ సారి ఇంకా ఎక్కువ మార్కులు సంపాదిస్తారు.

రోల్ మోడల్

బిడియం ఫీలవడం, నలుగురిలోకి వెళ్లడానికి ఇబ్బంది పడటం, చాలెంజెస్ తీసుకోవడానికి భయపడటం వంటి లక్షణాలు మీరు కలిగి ఉంటే.. మీ పిల్లలు కూడా అదే దారిలో నడుస్తారు. మనం ఏది నేర్పితే.. అదే ఫలితం దక్కుతుంది అన్నట్టు. తల్లిదండ్రులు కాన్ఫిడెంట్‌గా ఉంటేనే.. వాళ్లు మిమ్మల్ని రోల్ మోడల్ గా తీసుకుంటారు. కాబట్టి మీ పిల్లల్లో కాన్ఫిడెన్స్ తీసుకురావాలంటే.. మీలో కూడా మార్పులు రావాలి.



పిల్లల్లో కాన్సంట్రేషన్ పెంచడం

మీ బిడ్డకు తక్కువ శ్రద్ధ ఉందని మీరు ఎప్పుడైనా అనుకున్నారా? దేనిమీదా దృష్టిని కేంద్రీకరించలేకపోతు న్నారని మీరు భావిస్తున్నారా? ఇది ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లల గురించి చెప్పేఒక సాధారణ ఫిర్యాదు లాంటిది. ఈ రోజుల్లో పిల్లలు ఒకే పని మీద దృష్టి పెట్టలేకపోతున్నారు. వాస్తవానికి దీనికి ప్రధాన కారణం వారి పని లోడ్ పెరుగుతుండటం లేదా వారు ఎక్కువ పనిని తట్టుకోలేక పోతున్నాయని చెప్పవచ్చు. ఇంకా పిల్లలు బాగా అలసిపోయిన మరియు బాగా ఒత్తిడికి గురవడం వలన వారు దేనిమీదా దృష్టి చేయక పోవడానికి కారణాలు కావచ్చు. మీరు వారి కోసం ఏమైనా చేస్తే లేదా వాటిని తినేలా చేయండి, ఒక్కొక్కసారి మీరు చేసింది తినాలనే ద్యాస వారికి ఉండకపోవచ్చు.



తగినంత నిద్ర

వారి రోజువారీ కార్యకలాపాలకు అవసరమైన ఆహారాన్ని మరియు తగినంత నిద్ర వారికి అందించేలా నిర్ధారించుకోండి. వారు తగినంత చక్కెరను తీసుకోవడం సరైనదని నిర్ధారించుకోండి. వారు శారీరకంగా మంచిగా ఉన్నప్పుడు, వారు బాగా పని చేయగలరు మరియు బాగా దృష్టి పెట్టగలరు అని గ్రహించండి. రైట్ మూడ్ ని కల్పించండి మీ పిల్లల ఏకాగ్రతను పెంచడానికి మొదట మీరు వారికి సరైన మూడ్‌ని సృష్టించాలి. మీరు శబ్దం, అలసట, ఆకలి మొదలైనవి వంటి అన్ని పరధ్యానాలను తొలగించేలా చూసుకోండి. అంతేకాక, మీ పిల్లలు మానసికంగా ఆనందంగా ఉండేలా చూసుకోండి.

ఏది బలం!

అదో అందమైన చిట్టడవి. ఆ అడవికి రాజు పెద్దపులి. దాని గాండ్రింపు వినేసరికి ఎక్కడి జంతువులక్కడే గప్ చుప్. ఎందుకంటే దానికి ఆకలెక్కువ మరి. కనిపించిన ఏ జంతువునీ వదలదు. ఓసారి పాపం, ఈ విషయం తెలియని



కథ

అడవి పక్కన ఉన్న వూళ్లొని మేకల మంద మేత కోసం అడవిలోకి వచ్చింది. వీటిని దూరం నుంచి చూసిన పులి భలే విందు దొరికిందనుకుంటూ వాటి మీద దూకి ఒక మేకను తినేసింది. మిగిలినవి ప్రాణ భయంతో అరుస్తూ పారిపోయాయి. ఇలా మేకలు తరచు పులి బారిన పడటం చాలా సార్లే జరిగింది. ఇక లాభం లేదనుకుని మేకలన్నీ కలిసి జట్టులోని ముసలి మేక దగ్గరికి సలహా కోసం వెళ్లాయి. అపుడా ముసలి మేక 'పిల్ల మేకల్లారా! మనం బలహీనంగా ఉన్నంత కాలం మనల్ని భగవంతుడు కూడా రక్షించడు. మనం శారీరకంగా బలహీ నులమైనా తెలివి ఉపయోగించ వచ్చు' అంటూ ధైర్యం చెప్పింది. అప్పుడు మేకలన్నీ తర్జనభర్జన పడి ఓ ఉపాయాన్ని ఆలోచించాయి. అవి ఆ రోజంతా కష్టపడి పులి వచ్చే దారిలో కాకుండా వేరే దారిలో ఉండే పెద్ద



కందకాన్ని గడ్డీ ఆకులతోనూ నింపేశాయి. మరునాడు ఆ కందకానికి అవతలి వైపు మేకలు 'మే... మే...' అంటూ అరవ సాగాయి. మేకల అరుపులు విన్న పులి వెంటనే లొట్టలేసుకుంటూ వెనకా ముందూ చూసుకోకుండా వాటికేసి పరిగెత్తింది. అలా పరిగెడుతూ ఆ కంద కంలో పడి చచ్చింది. బలమనేది కేవలం శరీరానికే కాదు. బుద్ధికి కూడా రావాలని మేకలు గుర్తించాయి.

పుచ్చకాయ మ్యూజియం

పిల్లలూ..! అప్పుడే ఎండలు మండిపోతున్నాయి కదా! ఈ సీజన్లో వడదెబ్బ తగిలే అవకాశాలూ ఎక్కువ. అందుకే మనల్ని మనం రక్షించుకోవాలంటే కీరా, దోసకాయ, పుచ్చకాయ వంటివి ఎక్కువగా తినమని అమ్మావాళ్లు చెబుతుంటారు. మరి మనకు చాక్లెట్స్, ఐస్‌క్రీమ్స్ అంటే ఉన్న ఇష్టం వీటిపై ఉండదు కదా?! అందుకే వారి మాటలను మనం వినిపించుకోం.. ! కానీ చైనాలోని ఒక మ్యూజియం చూస్తే మాత్రం మీకు పుచ్చకాయ అద్భుతాలు కనిపిస్తాయి. ఎండాకాలంలో వచ్చే పండ్లలో.. పుచ్చకాయలకి ప్రత్యేకస్థానం ఉంది. మనకి తెలిసిన పచ్చని, గుండ్రని పుచ్చకాయ రకాలు ఒకటో, రెండో కాదు. ప్రపంచ వ్యాప్తంగా పన్నెండు వేల రకాలున్నాయి. వీటికోసం ప్రత్యేకంగా చైనాలోని బీజింగ్‌లో ఏకంగా 'వాటర్ మెలన్' మ్యూజియాన్నే నిర్మించారు. ఈ మ్యూజియం మొత్తాన్నీ పుచ్చకాయ ఆకారంలోనే తీర్చిదిద్దడం పెద్ద విశేషం. ఇందులోని అద్దాల గదుల్లో, గోడలపైన, పైకప్పును ఎటు చూసినా రకరకాల పుచ్చకాయలే దర్శనమిస్తాయి. అవి నోరూరిస్తున్నా వాటిని తినడం మాత్రం సాధ్యం కాదు. ఎందుకంటే వాటిని మైనంతో అచ్చు పుచ్చకాయల మాదిరిగానే తయారుచేశారు. చైనీయులకు పుచ్చకాయలంటే చాలా ఇష్టం. వీటిని తరాతరాల నుంచి వాళ్లు పండిస్తున్నారు. బీజింగ్‌లో ఏర్పాటు చేసిన ఈ మ్యూజియంలో పుచ్చకాయల పుట్టుపూర్వోత్తరాలు మొత్తం తెలుసుకోవచ్చు.



మనం స్పోర్ట్స్
ఆదివారం 11 మార్చి 2018
www.manamnews.com

కెరీర్ క్లోజ్!



అజ్ఞాతంలో షమీ

ఐపీఎల్‌లో ఆడేది అనుమానమే

న్యూఢిల్లీ : టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ షమీ కెరీర్ క్లోజ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. షమీ భార్య హసిన్ జమీన్ చేసిన ఆరోపణలతో కోల్‌కతా పోలీసులు హత్యాయత్నం కేసు పెట్టారు. అయితే ఆ తర్వాత నుంచి షమీ ఆచూకి తెలియడం లేదు. తన ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని తెలుస్తోంది. చివరి సారిగా ఢి ల్లీ నుంచి ఘజియాబాద్ వెళ్లినట్టు మొబైల్ లొకేషన్ ద్వారా గుర్తించారు. మరో వైపు షమీ కుటుంబ సభ్యుల్లో కొందరు కోల్‌కతాలోని భార్య జమీన్ బంధువులతో చర్చిస్తున్నారని తెలుస్తోంది. ఈ వ్యవహారం సద్దుమణిగే దాకా మీడియాకు దూరంగా ఉండమని కుటుంబీకులతో షమీ చెప్పినట్టు తెలుస్తోంది.

ఐపీఎల్‌లో ఆడతాడా..!

కేసులతో ఉక్కిరిబిక్కిరవుతున్న షమీ ఐపీఎల్‌లో ఆడటం అనుమానంగానే కనిపిస్తోంది. భార్య ఆరోపణలతో ఇప్పటికే బీసీసీఐ కాంట్రాక్టును దక్కించుకోలేకపోయిన షమీ వ్యవహారంపై ఐపీఎల్ జట్టు ఢిల్లీ డేర్‌డెవిల్స్ ఆచితూచి అడుగులేస్తోంది. షమీని ఐపీఎల్‌లో ఆడించాలా వద్దా అన్న విషయంపై సందిగ్ధంలో పడ్డ ఢిల్లీ జట్టు బీసీసీఐతో సంప్రదింపులు జరుపుతోంది. మహ్మద్ షమీని ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టు మూడు కోట్లకు కొనుగోలు చేసింది. బీసీసీఐ సలహా కోసం ఎదురు చూస్తున్నామని ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టు యజమాని తెలిపారు. ఐపీఎల్‌కు దూరమైతే షమీ కెరీర్ క్లోజయినట్టేనని భావిస్తున్నారు. ఈ వ్యవహారంపై బీసీసీఐ కూడా న్యాయ నిపుణులను సంప్రదిస్తోంది.

తమ్ముడి చేత...

ఇక షమీపై భార్య హసీన్ జహాన్ ఆరోపణలు కొనసాగుతున్నాయి. తన సోదరుడితో శృంగారంలో పాల్గొనాలని షమీ వత్తిడి తెచ్చేవాడని తాజాగా జహాన్ సంచలన ఆరోపణ చేసింది. ఓ రోజు తమ్ముడు ఉన్న గదిలోకి తనను నెట్టి తలుపు గడియ వేశాడని, లోపల షమీ తమ్ముడు హసీబ్ తనతో అసభ్యంగా ప్రవర్తించటంతో కేకలేశానని, దీంతో భయపడ్డ షమీ తలుపులు తెరిచాడు... కుటుంబ సభ్యులంతా తనను కొట్టేవాళ్లని తెలిపింది. పలువురు మహిళలతో షమీ అసభ్యకరంగా మాట్లాడిన ఫోన్ సంభాషణలను కూడా జహాన్ మీడియాకు వినిపించింది. పలువురు మహిళలతో తనకు సంబంధం ఉందని షమీ చెప్పటం ఆ టేపుల్లో స్పష్టంగా ఉంది.



మకర తోరణం అలంకరిస్తున్న పర్వతయ్య దంపతులు

అమ్మవారి భక్తుడి సేవా భావం

జోగులాంబ ఆలయంలో షెడ్ల నిర్మాణం

20 లక్షలతో కొనసాగుతున్న పనులు

వినాయక విగ్రహానికి 'మకర తోరణం' బహూకరణ

అలంపూర్, మార్చి 10 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠం జోగు లాంబదేవి, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల ఇబ్బందులను గుర్తించిన ఓ భక్తుడు తన సేవా భావాన్ని చాటుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన బొట్ట పర్వతయ్య ఆలయ సిబ్బందితో చర్చించి భక్తుల సౌకర్యార్థం షెడ్ల నిర్మాణం చేపట్టారు. రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన వివిధ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆలయాన్ని సందర్శించిన పర్వతయ్య దంపతులకు అక్కడి సిబ్బంది ఘనస్వాగతం పలికారు. వేద మంత్రోచ్చారణల మధ్య స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులు ఎండలో క్యూలైన్లలో నిలబడలేక పోతున్న విషయం గమనించిన పర్వతయ్య..ఆలయ అధికారులతో సంప్రదించి అర్చకుల సూచన మేరకు షెడ్డు నిర్మించేందుకు ముందుకొచ్చారు. కాగా, అమ్మవారి గాలి గోపురం ముందు పెద్ద షెడ్డు నిర్మాణం పూర్తయింది. క్యూలైన్ల షెడ్ల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. బ్రాహ్మణ వీధిలో వెలసిన



వినాయక విగ్రహానికి పంచ లోహాలతో తయారు చేసిన మకర తోరణాన్ని పర్వతయ్య దంపతులు శనివారం సమర్పించారు. వినాయక విగ్రహానికి మకర తోరణం అలంకరణను చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరారు. అమ్మవారిని, స్వామివారిని దర్శించుకునేందుకు ఇక్కడికి వేలాది మంది భక్తులు వస్తుంటారని, అలాంటి వారికి తగు సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం అభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా పర్వతయ్య దంపతులు తెలిపారు. ఆలయ అధికారులు, అర్చకుల సహకారంతో మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

ప్రేమ చిత్రం



ముంబై: విరాట్ కోహ్లీ- అనుష్క శర్మల గురించి ఏ వార్తయినా ఆస్తక్తికరమే. అనుష్క అంటే తనకు ఎంత ఇష్టమో మరోసారి రుజువు చేశాడు కోహ్లీ. ముంబై నుంచి తిరిగి వెళుతుండగా విరాట్‌కోహ్లీ మొబైల్‌ను ఫొటోగ్రాఫర్లు కెమెరాల్లో బంధించారు. ఆ ఫోన్‌లో వాల్‌పేపర్‌గా కోహ్లీ-అనుష్క రిసెప్షన్‌లోకలిసి దిగిన ఫోటో ఉండటం విశేషం. ప్రస్తుతం ఈ ఫోటోకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.అనుష్క ప్రేమను అభిమానులు తెగ పొగిడేస్తున్నారు. సౌతాఫ్రికా పర్యటన తర్వాత ఇండియాకు వచ్చిన విరాట్ శ్రీలంక పర్యటన నుంచి విరామం తీసుకొని సన్నిహితులతో, కుటుంబసభ్యులతో ఎంజాయ్ చేస్తున్నాడు. అనుష్క మాత్రం తన తదుపరి సినిమాల షూటింగ్‌లో బిజీగా ఉంది.

ఇరానీ కప్‌లో అశ్విన్



న్యూఢిల్లీ : భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ దేశవాళీ ఇరానీ ట్రోఫీ టోర్నీలో ఆడబోతున్నాడు. ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా స్థానంలో అశ్విన్‌ను రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టుకు ఎంపిక చేసిందని బీసీసీఐ తెలిపింది. గాయంతో ఉన్న జడేజాను విశ్రాంతి తీసుకోవాలని సూచించడంతో ఆస్థానంలో అశ్విన్‌ను ఎంపిక చేశామని ప్రకటించింది. గాయంతో దేవధర్ ట్రోఫీకి దూరమైన అశ్విన్ వారం రోజుల విశ్రాంతి తర్వాత తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించడంతో సెలెక్టర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. రంజీ ట్రోఫీ చాంపియన్ విదర్భతో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు ఈనెల 14 నుంచి 18 వరకు నాగపూర్‌లో ఇరానీ కప్‌లో ఆడుతుంది. రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టుకు కరుణ్ నాయర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు.



ఐర్లండ్‌పై ప్రతీకారం

చివరి మ్యాచ్‌లో విజయం • అజ్లాన్ షా హాకీ టోర్నీలో భారత్‌కు ఐదో స్థానం

ఇపో (మలేసియా) : అజ్లాన్ షాకప్ హాకీ టోర్నీలో భారత జట్టు ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ఆరు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో భారత్ ఐదు, ఆరుస్థానాల కోసం ఐర్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 4-1 తేడాతో గెలుపొంది శుక్రవారం నాటి పోరులో ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది. కుర్రాళ్లతో ప్రయోగాలు చేసిన భారత జట్టు అత్యంత పేవలమైన ఆటతీరును ఈటోర్నీలో ప్రదర్శించి ఐదో స్థానం దక్కించుకుంది. అగ్రశ్రేణి జట్ల ఆస్ట్రేలియా, అర్జెంటీనా జట్లకు ఏ మాత్రం పోటీ ఇవ్వ లేకపోయిన భారత ఆటగాళ్లు ఐర్లండ్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో కాస్త ఫర్వాలేదనిపించేలా ఆడారు. ఈ మ్యాచ్‌లో భారత ఆటగాడు వరుణ్‌కుమార్ రెండు గోల్స్ చేయగా, శిలానంద్ లక్రా, గుర్జంత్ సింగ్‌లు ఒక్కో గోల్ చేశారు. ఐర్లండ్ తరపున జులియన్ డాలే ఏకైక గోల్ చేశాడు. దూకుడుగా ఆట మొదలుపెట్టిన భారత్‌కు ఐదో నిమిషంలో పెనాల్టీ కార్నర్ లభించింది. వరుణ్ కుమార్ గోల్ కొట్టి భారత్ ఆధిక్యతను 1-0కు పెంచాడు. ఆ తర్వాత ప్రత్యర్థి శిబిరంపై పలు మార్లు దాడులు జరిపిన భారత జట్టు వ్యూహం 28వ నిమిషంలో ఫలించింది. శిలానంద్ గోల్ కొట్టిభార్ ఆధిక్యతను 2-0కు పెంచాడు. 32వ నిమిషంలో మరో పెనాల్టీ కార్నర్‌ను వరుణ్ గోల్‌గా మలచడంతో భారత్ 3-0 గోల్స్‌తో తిరుగులేని ఆధిక్యత సంపాదించింది. ఆ తర్వాత 37వ నిమిషంలో గుర్జంత్ బ్రిలియంట్ షాట్‌తో చేసిన గోల్‌తో భారత్ 4-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 48వ నిమిషంలో ఐర్లండ్ ఆటగాడు డేల్ ఏకైక గోల్ చేసి భారత్ ఆధిక్యతను 4-1కి తగ్గించాడు.

కోచ్‌తో షరపోవా కటీఫ్



ఇండియన్ వెల్స్ : నాలుగేళ్ల నుంచి తనకు శిక్షణ ఇస్తున్న నెదర్లాండ్స్ కోచ్ స్వెన్ గ్రోవెవెల్డ్‌తో మాజీ చాంపియన్ మారియా షరపోవా తెగతెంపులు చేసుకుంది. ఇండియన్ వెల్స్‌లో మొదలైన డబ్ల్యుటిఏ టెన్నిస్ టోర్నీ తొలి మ్యాచ్‌లో పరాజయంతో షరపోవా ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. ఐదు సార్లు గ్రాండ్‌శ్లామ్ టోర్నీ విజేత, ఒకప్పటి వరల్డ్ చాంపియన్ షరపోవాను జపాన్ ప్లేయర్ ఓసాకా 6-4, 6-4 తేడాతో ఓడించింది. ఈ షాక్‌తో కొత్త కోచ్‌ను వెతుక్కునే పనిలో పడ్డ షరపోవా స్వెన్‌కు గుడ్‌బై చెప్పింది.

నేటి నుంచి టి20 ముంబాయి లీగ్



ముంబాయి : ముంబాయిలో మరో మెగా క్రికెట్ టోర్నీ నేటి నుంచి ప్రారంభం కానుంది. మొట్టమొదటి సారిగా ముంబాయి టి20 లీగ్ క్రికెట్ టోర్నీ యువ ఆటగాళ్లలో ప్రతిభను వెలుగులోకి తీసేందుకు నిర్వహిస్తున్నారు. నార్త్ ముంబాయి పాంథర్స్, ఆర్క్స్ అంథేరీ, సోబో సూపర్‌సోనిక్స్, ముంబాయి నార్త్ ఈస్ట్ నైట్స్ మధ్య ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ నెల 21న ఫైనల్ జరుగుతుంది. శ్రీలంక పర్యటనలో ఉన్నందున యువ ఆటగాళ్లు చాలా మంది ఈ టోర్నీకి దూరమయ్యారు. మాస్టర బ్లాస్టర్ సచిన్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న ఈ టోర్నీకి మాజీ స్టార్లు గవాస్కర్, దిలీప్ వెంగ్‌సర్కార్‌లు లీగ్ కమిషనర్, మెంటార్లుగా వ్యవహరిస్తున్నారు. మ్యాచ్‌లన్నీ ముంబాయి వాంఖడే స్టేడియంలో జరుగుతాయి.



చిక్కుల్లో రబడా!

దక్షిణాఫ్రికా - ఆస్ట్రేలియా రెండో టెస్ట్‌లోనూ వివాదం

పోర్ట్‌ఎలిజిబెత్ : దక్షిణాఫ్రికా - ఆస్ట్రేలియా క్రికెటర్ల మధ్య స్లెడ్జింగ్ వివాదం ఇప్పట్లో ఆగేలా కనిపించటం లేదు. డర్బన్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా ఆటగాడు వార్నర్ -డికాక్‌లు దూషించుకుంటే పోర్ట్‌ఎలిజిబెత్‌లో జరిగిన రెండో టెస్ట్‌లో సౌతాఫ్రికా బౌలర్ రబాడా, ఆస్ట్రేలియా కెప్టెన్ స్మిత్‌ల మధ్య వివాదం రేగింది. ఈ వివాదంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న దక్షిణాఫ్రికా ఆటగాడు రబడాపై రెండు మ్యాచ్‌ల నిషేధం పడే అవకాశాలు కనపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మైదానంలో అతిగా ప్రవర్తించిన కారణంగా ఐదు డీమెరిట్ పాయింట్లు వచ్చాయి. మరో మూడు డీమెరిట్ పాయింట్లు వచ్చినట్లయితే రబాడాపై ఖచ్చితంగా రెండు టెస్ట్‌ల వేటు పడే అవకాశముంది. పోర్ట్ ఎలిజిబెత్‌లో శుక్రవారం మొదలైన రెండో టెస్ట్‌లో తొలి రోజు రబడా వేసిన బంతికి ఆసీస్ కెప్టెన్ స్మిత్ ఎల్బీడబ్ల్యు అయ్యాడు. దీంతో గంతులేస్తూ స్మిత్ వైపు వెళ్లిన రబడా భుజంతో ఢీ కొట్టి పెవిలియన్ వైపు వెళ్లాని సూచించడం వివాదానికి కారణమైంది. ఈ మ్యాచ్‌లో మొదటి రోజు ఐదు వికెట్లు పడగొట్టిన రబడా ఆసీస్‌ను భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నాడు. రబడా మైదానంలో ప్రత్యర్థి ఆటగాళ్లపై ఇలా దురుసుగా ప్రవర్తించడం, నిషేదానికి ఎదుర్కొవడం ఇదేం ఇతనికి మొదటి సారి కాదు. గతంలోనూ ఐసీసీ అతడిపై నిషేధం విధించింది. తాజాగా మరో సారి నిషేధానికి గురయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. తొలి టెస్ట్‌లో వ్యక్తిగత దూషణలకు దిగిన వార్నర్, డికాక్‌లకు ఐసీసీ జరిమానా విధించింది. ఆ మ్యాచ్‌లోనే డివిలియర్స్‌ను రనౌట్‌చేశాక అతనిపై బాల్ వేసిన నాథన్ లియోన్‌పైనా జరిమానా పడింది. తాజా వ్యవహారంపై పలువురు సీనియర క్రికెటర్లు స్పందించారు. ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని ప్రకటించారు.

పాకిస్తాన్ నయా సంచలనం



షహీన్ అఫ్రిది (3.4-1-4-5)

లాహోర్ : పాకిస్తాన్ క్రికెట్ అంటేనే సంచలనాలకు మారుపేరు. ప్రత్యర్థి ఎవరన్నది లెక్కచేయకపవటం, భారీ స్కోర్లు సాధించటం, తక్కువ రన్స్‌కే కుప్పకూలటం.. ఇలాంటివి ఎన్నో ఆ జట్టుకు సొంతం. బౌలింగ్‌లో సైతం ఆ జట్టు చేసిన సంచనాలు ఎన్నెన్నో..ఇమ్రాన్ ఖాన్, వసీం అక్రం, వకార్ యూనిస్, షోయబ్ అక్తర్, షాహిద్ అఫ్రిది లాంటి బౌలర్లు ప్రత్యర్థులను బెంబేలెత్తించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఆ జాబితాలోనే మరో పాకిస్తానీ యువ సంచలనం తెరమీదకొచ్చాడు. ఇటీవల జరిగిన అండర్ -19 ప్రపంచ కప్‌లో పాకిస్తాన్ జట్టుకు ఆడిన 17 ఏళ్ల లెఫ్టామ్ స్పిన్నర్ షహీన్ అఫ్రిది సంచలనాలు సృష్టిస్తున్నాడు. పాకిస్తాన్ సూపర్ లీగ్ టోర్నీలో షహీన్ కేవలం నాలుగు పరుగులు మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టి ఓ మెరుపు మెరిశాడు. పాకిస్తాన్ సూపర్ లీగ్ టోర్నీలో లాహోర్ ఖలందర్స్ తరపును ఆడుతున్న షహీన్ ముల్తాన్ సుల్తాన్ జట్టుపై ఈ బౌలింగ్ విన్యాసాన్ని ప్రదర్శించి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. 3.4 ఓవర్లు వేసిన షహీన్ నాలుగు పరుగులే ఇచ్చి ఐదు వికెట్లు నేలకూల్చాడు. మొత్తం 22 బంతులేసిన షహీన్ 18 డాట్ బాల్స్ వేశాడు. దీంతో ముల్తాన్ జట్టు 114 రన్స్‌కే కుప్పకూలింది. ఆ తర్వాత లాహోర్ 18.4 ఓవర్లలో మ్యాచ్‌ను ముగించింది. షహీన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. ఇదే టోర్నీలో షహీన్‌దే బెస్ట్ బౌలింగ్. ఆరడుగుల ఆరంగుళాల పొడవుండే షహీన్ బంతిని రెండువైపులా తిప్పటంలో దిట్ట. దేశమంతా ఇప్పుడు షహీన్ బౌలింగ్ గురించే చర్చ. ఈ నయా హీరోపై ప్రసంశలు వెల్లువెత్తుతున్నాయి.

ఇంగ్లండ్‌కు వన్డే సిరీస్

చివరి మ్యాచ్‌లో చెలరేగిన బ్రిస్టో • న్యూజిలాండ్‌పై 7 వికెట్ల ఘనవిజయం



క్రైస్ట్‌చర్చ్ : న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌ను ఇంగ్లండ్ గెలుచుకుంది. శనివారం జరిగిన చివరి వన్డేలో ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించి 3-2 తేడాతో సిరీస్ సొంతం చేసుకుంది. ఇంగ్లండ్ ఓపెనర్ బెయిర్‌స్టో చెలరేగి ఆడి 58 బాల్స్‌లోనే సెంచరీ సాధించటంతో ఇంగ్లండ్ 32.5 ఓవర్లలోనే 224 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. ఈ సెంచరీతో ఫాస్టెస్ట్ సెంచరీ కొట్టిన మూడో ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్‌గా బెయిర్‌స్టో రికార్డుల్లోకెక్కాడు. పాకిస్తాన్‌పై ఇంగ్లండ్ ప్లేయర్ బట్లర్ 46 బాల్స్‌లో సెంచరీ కొట్టగా, వెస్టిండీస్‌పై మొయిన్ అలీ 53 బాల్స్‌లో సెంచరీ పూర్తి చేశాడు. ఆ జాబితాలో చేరిన బెయిర్ స్టో 9 ఫోర్లు 6 సిక్స్‌లతో 104 రన్స్ చేసి హిట్ వికెట్ అయ్యాడు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 49.5 ఓవ ర్లలో 223 పరుగులకు ఆలౌట్ అయింది. కివీస్ బ్యాట్స్‌మన్ లలో సాంటర్న్ 67, నికోలస్ 55 తప్ప మిగతా వాళ్లెవరూ రాణించలేక పోవడంతో తక్కువ స్కోరుకే కుప్పకూలింది. రెండు జట్ల మధ్యా మొదటి టెస్ట్ ఈ నెల 22 నుంచి క్రైస్ట్ చర్చ్‌లో ప్రారంభమవుతుంది.

సంక్షిప్త స్కోర్లు: న్యూజిలాండ్ 223 ఆలౌట్ (49.5ఓవర్లలో), ఇంగ్లండ్ 229/3 (32.4 ఓవర్లలో)

ఈ పెనాల్టీ విచిత్రం



క్వీన్స్‌లాండ్ : ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్‌లో ఓ విచిత్రం జరిగింది. డర్బన్‌లో జరిగిన షఫీల్డ్ ఫీల్డ్ టోర్నీలో క్వీన్స్‌లాండ్ - వెస్ట్రన్ ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అంపైర్ ప్రకటించిన ఐదు పరుగుల పెనాల్టీ క్రికెట్ చరిత్రలోనే మొదటి సారి. వెస్ట్రన్ ఆస్ట్రేలియా బ్యాటింగ్ చేస్తుండగా క్వీన్స్‌లాండ్ కీపర్ జిమ్మీ బంతి కోసం గ్లోవ్‌ను పక్కన పడేసి పరుగెత్తాడు. అయితే స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న రెయిన్ షా కీపర్ వదిలేసిన గ్లావ్‌ను పెట్టుకుని కీపర్ విసిరిన ఆ బంతిని అందుకున్నాడు. క్రికెట్ రూల్స్ ప్రకారం వికెట్ కీపర్ కాకుండా మరే ఫీల్డర్ గ్లావ్ వేసుకోకూడదు. దీంతో అంపైర్ రెయిన్ షాను పిలిచి తప్పేమిటో చెప్పాడు. జట్టు స్కోరు నుంచి ఐదు రన్స్ కోత విధిస్తున్నట్టు చెప్పాడు. అదృష్టవశాత్తూ క్వీన్స్‌లాండ్ ఈ మ్యాచ్‌లో గెలిచింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.